అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

ఆదివారం 12-01-2025

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 సంచిక : 13 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు + వెబ్‌లో (సోపతి) వెల : 8.00

నికొలస్ మదురో ప్రమాణస్వీకారం



వెనిజులా అధ్యక్షుడిగా మూడోసారి బాధ్యతలు

ఆంక్షలతో అమెరికా సహా పశ్చిమ దేశాల కన్నెర్ర

ప్రతిపక్షానికి వత్తాసు

వివరాలు 3లో



బీఆర్ఎస్ కార్యాలయంపై

కాంగ్రెస్ శ్రేణుల దాడి

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆగ్రహం

- పరిస్థితి ఉద్రిక్తం
- పోలీస్ స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ కార్యకర్తల నిరసన

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నేత, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు రామకృష్ణారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆ పార్టీ జిల్లా కార్యాలయం ఎదుట యువజన కాంగ్రెస్, ఎన్ఎస్ యూఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిం చారు. కార్యాలయం లోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో విలేకర్ల సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 'సీఎం రేవంత్‌రెడ్డి పథకాలు అమలు చేయకుండా, కక్ష సాధింపు రాజకీయాలు చేస్తున్నారని, పరిపాలన చేతకాని సీఎం "రండ.." అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ కార్యా లయం ఎదుట బైటాయించారు. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న బీఆర్ఎస్ నాయకులకు వీరికి మాటామాటా పెరిగింది. అనంతరం కార్యాలయంలోని ఫర్నీచర్‌ను కాంగ్రెస్ నాయకులు ధ్వంసం చేశారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొది సేపటికే వారిని విడుదల చేయడంపై మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో మాట్లాడే హక్కు లేదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి పేగులు మెడలో వేసుకుంటా అని, ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతారు కానీ, ప్రజల పక్షాన హామీలు అమలు చేయాలని అడిగితే దాడులు చేస్తారా అని ప్రశ్నించారు. భువనగిరి నియోజకవర్గంలో భూకబ్జాదారులు, రౌడీలు, గూండాలు రాజ్యమేలుతు న్నారని, ఈ విషయంపై డీసీపీ...13లో

దాడి పిరికి పందల చర్య



రాజకీయంగా ఎదుర్కోలేకే భౌతిక దాడులు

బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, కవిత



వివరాలు 13లో

రేపటి నుంచి కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్

- హాజరు కానున్న 16 దేశాల కైట్ క్రీడాకారులు
- వెయ్యికి పైగా నోరూరించే మిఠాయిలు
- 15 లక్షల మంది వీక్షకులు వస్తారని అంచనా
- పోస్టర్‌ను ఆవిష్కరించిన పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

6లో..



కన్నౌజ్ రైల్వే స్టేషన్‌లో కూలిన భవనం

శిథిలాల కింద చిక్కుకున్న పలువురు కార్మికులు

కన్నౌజ్ : ఉత్తరప్రదేశ్‌లోని కన్నౌజ్ రైల్వే స్టేషన్‌లో నిర్మాణంలో ఉన్న ఓ భవనం శుక్రవారం కుప్పకూలింది. ఈ ఘటనలో పలువురు కార్మికులు శిథిలాల కింద చిక్కుబడి పోయారు. రైల్వే స్టేషన్ ఆధునీకరణ ప్రాజెక్టులో భాగంగా రెండంతస్తుల భవనంలో పనులు జరుగుతున్నాయి. ప్రమాదం జరిగిన సమయంలో ఆ ప్రదేశంలో 35 మంది...13లో



అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుల్‌పై విస్తృత
అధ్యయనం



తొలుత హైదరాబాద్ ఔటర్ లోపల ఏర్పాటు

- దేశంలోనే బెస్ట్ విధానమై ఉండాలి
- విదేశాల్లో అధ్యయనం చేయండి
- విద్యుత్‌శాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ ఆవిష్కరణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుళ్ల ఏర్పాటుపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి విద్యుత్‌శాఖ అధికారుల్ని ఆదేశించారు. విదేశాల్లో దీనిపై పరిశీలన చేసి, దేశానికి ఆదర్శంగా ఉండేలా నివేదిక ఇవ్వాలని చెప్పారు. అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుల్ వ్యవస్థను తొలుత గ్రేటర్ హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతంలో ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. శనివారంనాడిక్కడి ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025ని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్‌శాఖల మంత్రి మల్లు భట్టివిక్రమార్కతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం విద్యుత్ శాఖపై సమీక్ష నిర్వహించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, జెన్‌కో సీఎమ్‌డీ సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ కృష్ణభాస్కర్, టీజీఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ ముషారఫ్ ఫారూఖీ, టీజీఎన్పీడీసీఎల్ సీఎమ్‌డీ వరుణ్‌రెడ్డి, సింగరేణి సీఎమ్‌డీ ఎన్ బలరాంనాయక్, టీజీ రెడ్కో వైస్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వీ అనీల తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ విద్యుత్ కేబుల్స్‌తో పాటు అన్ని రకాల కేబుల్స్‌ను అండర్‌గ్రౌండ్‌లోనే ఉండేలా వివిధ ప్రత్యమ్నాయాలు కూడా పరిశీలించాలని సూచించారు. దీనివల్ల విద్యుత్ నష్టాలను తగ్గించొచ్చనీ, విద్యుత్ చౌర్యాన్ని అరికట్టవచ్చనీ, ప్రకృతి వైపరీత్యాల వల్ల విద్యుత్ అంతరాయం వంటి సమస్యలను అధిగమించవచ్చని తెలిపారు. వచ్చే వేసవిలో విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ అంతరాయాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గత ఏడాది మార్చి నెలలో రాష్ట్రంలో పీక్ డిమాండ్ 15,623 మెగావాట్లకు చేరిందనీ, ఈ సారి ఆ డిమాండ్ 16,877 మెగావాట్ల కు చేరుతుందని అంచనా వేశామని ఈ సందర్భంగా విద్యుత్ సంస్థల అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై సీఎం...13లో

క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీలో...

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025 పూర్తిగా ప్రయివేటు పెట్టుబడిదారులు, సంస్థలకు అనుకూలంగా ఉంది. ప్రభుత్వ భూములను మార్కెట్ ధరలో 10 శాతానికే కంపెనీలకు దాదాపు 45 ఏండ్లు లీజులకు ఇచ్చేలా ఈ పాలసీలో పొందుపర్చారు. అలా ఇచ్చిన భూములకు...13లో

లిక్కర్ కంపెనీల ఒత్తిడికి తలొగ్గం

పారదర్శకంగా మద్యం సరఫరా సంస్థల ఎంపిక

కమిటీ నివేదిక తర్వాతే ధరల పెంపుపై నిర్ణయం

ఆబ్కారీ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి

వివరాలు 13లో


నెలాఖరులోగా ఉస్మానియాకు శంకుస్థాపన

భవిష్యత్ అవసరాలకనుగుణంగా డిజైన్లు

ఆ దిశగా చర్యలు చేపట్టండి

అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

వివరాలు 13లో



పట్నం పల్లె బాట

సంక్రాంతికి సొంతూళ్లకు పయనం

కిక్కిరిసిన బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు

విజయవాడ హైవేపై వాహనాల బారులు

ప్రయివేట్ ట్రావెల్స్ దోపిడీ

వివరాలు 14లో

కొండపోచమ్మ సాగర్‌లో నీట మునిగి

ఐదుగురు యువకులు మృతి

ఇద్దరికి తప్పిన ప్రమాదం

- సిద్దిపేట జిల్లాలో విషాదం
- గజ ఈతగాళ్లతో మృతదేహాలు వెలికితీత
- దగ్గరుండి సీపీ పర్యవేక్షణ
- సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి
- సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం



(ఫైల్)

నవతెలంగాణ-మర్కుక్ /ములుగు

కొండపోచమ్మ సాగర్‌లో ఈతకు వెళ్లి నీటిలో గల్లంతై ఐదుగురు యువకులు మృతి చెందారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల కేంద్రంలోని కొండ పోచమ్మ సాగర్ వద్ద శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌కు చెందిన ఏడుగురు యువకులు.. గైరా ధనుష్ (18), గైరా లోహిత్(17) అన్నదమ్ములు, దినేశ్వర్ (17), సాహిల్ దీపక్ సుతార్ (19), ఉప్పల జతీన్ (17), కొమారి మృగాంక్ (17) ఎండీ ఇబ్రహీం(20) శనివారం ఉదయం 8:30 గంటలకు సిద్దిపేట జిల్లా కొమురవెల్లి...13లో

లెక్క..పక్కా ఉండాలె!



తేడావొస్తే పంచాయతీ ఎన్నికల్లో నష్టం

- రైతు భరోసాపై సర్కార్ నజర్
- పడావుభూములు, వెంచర్లు, మైనింగ్, ఇండ్లపై ఆరా
- నాలా కన్వర్టు భూములకు చెక్
- పాత ఫైళ్లు దులుపుతున్న రెవెన్యూ అధికారులు
- అర్హుల జాబితా బాధ్యత ఏఈవోలదే...
- 28 నుంచి రైతు భరోసా విడుదలకు కసరత్తు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాపై నజర్ పెట్టింది. సాగు భూముల లెక్కలు పక్కగా ఉండేలా పకడ్బంధీ చర్యలు చేపడుతున్నది. ఈ విషయంలో ఏ మాత్రం తేడావొచ్చినా కాంగ్రెస్ పార్టీ పంచాయతీ ఎన్నికల్లో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని భావిస్తున్నది. మరోవైపు ప్రభుత్వం కూడా బదనాం అవుతుందనే టెన్షన్ ఉన్నది. ప్రస్తుతం పంచాయతీల్లో బీఆర్ఎస్ పార్టీకి 80శాతానికి పైగా సర్పంచులు ఉండగా, కాంగ్రెస్‌కు 18 శాతం, ఇతర పార్టీలకు రెండు శాతం మంది సర్పంచులు ఉన్నారు. రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో హస్తం పై చేయి సాధించేందుకు రైతు భరోసాను సద్వినియోగం చేసుకోవాలని భావిస్తున్నది.' కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో చెప్పినట్టు రాళ్లు, రప్పలకు రైతు భరోసా ఇవ్వకూడదు...అలాగాని అర్హులకు ఎలాంటి నష్టం జరగకూడదు' అనేది సర్కారీ లెక్క. రానున్న పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురాలంటే, సాగు భూముల లెక్కలు, సాగు రహిత భూముల లెక్కలను కచ్చితంగా నిర్ధారించాలని నిర్ణయించింది. అందుకు రెవెన్యూ శాఖ అధికారులను రంగంలోకి దించింది. ముఖ్యంగా తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లకు ఆ బాధ్యతను అప్పగించింది. గత ప్రభుత్వం రైతు బంధు పథకం కింద పడావు భూములు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, మైనింగ్ భూములు, లే అవుట్లు, నాలా కన్వర్టు భూములు, గోదాములు, ఫంక్షన్ హాళ్లు ...తదితరాలకు కూడా కోట్ల రూపాయలు చెల్లించింది. ఈ క్రమంలో అటువంటి భూములను గుర్తించేందుకు రెవెన్యూ అధికారులు పాత ఫైళ్లను దులుపుతున్నారు. ప్రస్తుతానికి అన్ని రెవెన్యూ కార్యాలయాల్లో రైతు భరోసా అమలుపై కసరత్తు చేస్తున్నారు. ముఖ్యంగా మున్సిపల్ కార్పొరేషన్ శివారు ప్రాంతాల్లో, మున్సిపాలిటీల్లో కూడా గతంలో రైతు బంధు పథకాన్ని అమలు చేశారు. ఈసారి వీటన్నింటికి కాంగ్రెస్ సర్కారు రైతు భరోసా ఇవ్వకూడదని నిర్ణయించింది. అందుకు ...13లో

రెవెన్యూ, వ్యవసాయ శాఖల సమన్వయం

సంక్రాంతి పండుగ తర్వాత రైతు భరోసా ఇస్తామన్న కాంగ్రెస్ సర్కారు...అందుకు డేట్ కూడా ఫిక్స్ చేసినట్టు తెలిసింది. ఈ నెల 28 నుంచి రైతుల ఖాతాల్లో రైతు భరోసా జమ చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. అందుకనుగుణంగా రెవెన్యూ అధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవో) సమన్వయంతో పని చేస్తున్నారు. ఆ రెండు శాఖల అధికారులతో ఇప్పటికే కొన్ని జిల్లాల్లో కలెకర్లు సమావేశాలు నిర్వహించారు. కొన్ని జిల్లాల్లో ఆది, సోమవారాల్లో జరగనున్నాయి. గతంలో రైతు బంధు తీసుకున్న వారి...13లో

భారత ఆర్మీ పట్ల పీఎన్‌బీ నిబద్ధత

- నామినీకి రూ.50 లక్షల ఇన్సూరెన్స్ చెక్ అందజేత



హైదరాబాద్ : భారత ఆర్మీ, వారి కుటుంబాలకు బాసటగా నిలిచే విషయంలో పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) తన నిబద్ధతను చాటింది. రూ.50 లక్షల పీఎన్‌బీ రక్షక్ ప్లస్ ఇన్సూరెన్స్ చెక్‌ను భారత ఆర్మీకి చెందిన దివంగత రిటైర్డ్ సుబేదార్ ముకేశ్ కుమార్ భార్య కమళావతి దేవికి అందించింది. హైదరాబాద్ జోన్‌లోని పీఎన్‌బీ లాల్‌బజార్ శాఖ వినియోగదారుగా ఉన్న ముకేశ్ కుమార్ ఇటీవల ఒక రైలు ప్రమాదంలో మరణించారు. డిప్యూటీ జోనల్ హెడ్ సంజయ్ మానె, సికింద్రాబాద్ సర్కిల్ హెడ్ సుజీత్ కుమార్ ఝా లు ఈ చెక్‌ను నామినీగా ఉన్న ముకేశ్ భార్యకు ఒక కార్యక్రమంలో అందజేశారు. బాధిత కుటుంబానికి సంజయ్ మానె.. సానుభూతి ప్రకటించారు. సాయుధ బలగాల త్యాగాల పట్ల బ్యాంకు నిబద్ధతను ఆయన వివరించారు. పీఎన్‌బీ రక్షక్ ప్లస్‌ను అందించటం పట్ల పీఎన్‌బీ గర్వంగా ఉన్నదనీ, సోల్జర్లు, పెన్షనర్ల ఆర్థిక భద్రత కోసం రూపొందించిన ఒక అసాధారణ పథకమని అన్నారు. ఈ బాధా సమయంలో ముకేశ్ కుటుంబానికి పీఎన్‌బీ మద్దతుగా ఉంటుందని సుజీత్ కుమార్ ఝా ఈ కార్యక్రమంలో తెలిపారు. ఆర్థిక భద్రత కోసం ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ కవర్‌ను తీసుకోవాలని సూచించారు. కష్టకాలంలో మద్దతుగా నిలిచిన పంజాబ్ నేషనల్ బ్యాంకుకు కమళావతి దేవి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన వినియోగదారులు, ఆర్మీ అకౌంట్ హోల్డర్లకు బ్రాంచ్ మేనేజర్ ధన్యవాదాలు చెప్పారు. గవర్నమెంట్ బిజినెస్ వర్టికల్, హైదరాబాద్(సికింద్రాబాద్) హెడ్ రేఖా రావు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డీజిల్ ఖర్చుల కోసమే చార్జీల సవరణ

- టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం వెల్లడి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రధాన పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో నడిపే స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ కోసమే టికెట్ ధరలను సవరించినట్టు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) స్పష్టం చేసింది. తిరుగు ప్రయాణంలో ప్రత్యేక బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ, ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరితగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుందని శనివారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపారు. ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా వాటిని ఆయా రూట్లలో నడిపిస్తున్నామనీ, ఈ నేపథ్యంలోనే స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరలను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16 ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిందని పేర్కొన్నారు. ఆ ఉత్తర్వుల ప్రకారమే ఈ సంక్రాంతికి కేవలం ఐదు రోజులు పాటు టికెట్ ధరలను టీజీఎస్‌ఆర్టీసీ సవరించిందని వివరించారు. ప్రయివేటు వాహనాల్లో ప్రమాదకర ప్రయాణం చేయొద్దనీ, ఆర్టీసీ సిబ్బంది ఎంతో అనుభవజ్ఞులని, సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే వారు ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు.

27న రాష్ట్రానికి ఖర్గే, రాహుల్‌గాంధీ

- ఇష్టాగోష్టిలో మహేష్‌కుమార్‌గౌడ్ వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఈ నెల 17 రాష్ట్రంలో 'సంవిధాన్ బచావో' ప్రదర్శన నిర్వహిస్తామని టీపీసీసీ అధ్యక్షులు మహేకుమార్‌గౌడ్ చెప్పారు. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రదర్శనకు హాజరు అవుతారని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో మంత్రివర్గ విస్తరణ గురించి మాట్లాడలేదని చెప్పారు. దానిపై ముఖ్యమంత్రి, ఏఐసీసీ నేతలు నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. కార్పొరేషన్లు, బోర్డులు, కమిషన్ చైర్మెన్లు, డైరెక్టర్లు, సభ్యుల నియామకాలపై ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. పార్టీ కార్యవర్గాన్నీ ఈ నెలాఖరులోగా నాయకులతో అభిప్రాయాలు తీసుకుంటామని చెప్పారు. రానున్న గ్రాడ్యువేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తామని వెల్లడించారు. టీచర్స్ ఎమ్మెల్సీ విషయంలో ఎవరికీ మద్దతు ఇవ్వాలన్న అంశంలో ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ సీఎం, మంత్రుల అభిప్రాయం తీసుకుంటామని వివరించారు. కాంగ్రెస్‌లో చేరిన సీనియర్ నేత డీవీ.సత్యనారాయణరావు, కండువా కప్పి పార్టీలోకి ఆయన్ను ఆహ్వానించారు.

సైబర్ నేరగాళ్లున్నారు.. జాగ్రత్త

- కుంభమేళాకు వెళ్లే యాత్రికులకు సీఎస్‌బీ హెచ్చరిక

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో జరగనున్న మహా కుంభమేళాకు రాష్ట్రం నుంచి వెళ్లే యాత్రికులు సైబర్ నేరస్థుల పట్ల జాగరూకతతో వ్యవహరించాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) డీజీపీ షికా గోయెల్ హెచ్చరించారు. కుంభమేళకు రాష్ట్రం నుంచి వేలాది మంది యాత్రికులు వెళ్తున్నారనీ, వారికి అక్కడ బస చేయటానికి తమ వద్ద అవసరమైన ధర్మశాలలు, హోటళ్లు, టెంట్‌హౌజ్‌లు ఉన్నాయంటూ సైబర్ నేరస్థులు దొంగ యాప్‌లను సృష్టిస్తున్నారని ఆమె చెప్పారు. వాటిని నమ్ముకొని అడ్వాన్స్ బుకింగ్ కోసం వారి అకౌంట్లలో డబ్బుల వేయటం ద్వారా మోసపోతున్నారని తెలిపారు. కుంభమేళకు వచ్చే యాత్రికుల బస కోసం అవసరమై ధర్మశాలలు, హోటళ్లు, టెంట్ సిటీలను యూపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందనీ, వాటిని బుకింగ్ చేసుకోవటానికి అధికారికంగా వెబ్‌సైట్లను కూడా రూపొందించిందనీ, యాత్రికులు వాటిని మాత్రమే విశ్వసించాలని ఆమె సూచించారు. ఈ దొంగ యాప్‌లకు సంబంధించి అధికారికంగా పూర్తిగా సమాచారాన్ని సేకరించాకే ముందడుగు వేయాలని షికా గోయెల్ తెలిపారు. మోసానికి గురైన యాత్రికులు 1930కు ఫోన్ చేసి సమాచారమివ్వాలని చెప్పారు.

సంక్రాంతికి ఊర్లకు వెళ్లేవారు జాగ్రత్త

సంక్రాంతి సెలవులపై ఊర్లకు తరలి వెళ్తున్న ప్రజలు తమ ఇండ్ల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. ముఖ్యంగా, దూరంగా విసిరివేసినట్టు ఉండే కాలనీలు, బస్తీల ప్రజలు తాము ఊర్లకు వెళ్తున్న విషయమై స్థానిక పోలీసులకు సమాచారమివ్వాలనీ, దానితో వారు ఆ ప్రాంతాల్లో రాత్రివేళ గస్తీని పెంచి చోరీలు కాకుండా చూసే అవకాశమున్నదని షికా గోయెల్ తెలిపారు.

అభివృద్ధిని జీర్ణించుకోలేని గవర్నర్

- తమిళనాడు సీఎం స్టాలిన్ విమర్శ



చెన్నయ్ : తమిళనాడు అభివృద్ధిని చూసి గవర్నర్ రవి జీర్ణించుకోలేకపోతున్నారని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, డీఎంకె అధినేత ఎంకె స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరిగిన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రజలను, ప్రభుత్వాన్ని ఎప్పుడూ అవమానిస్తూనేవున్నారని స్టాలిన్ ఆక్షేపించారు. 'గవర్నర్ అసెంబ్లీకి వచ్చినా ప్రసంగించకుండానే మధ్యలో వెళ్లిపోయారు. ఆయన తీరు చిన్న పిల్లల చేష్టల మాదిరిగా ఉంది. రాజ్యాంగం ప్రకారం గవర్నర్ బాధ్యతను నిర్వర్తించలేకపోయారు. తమిళనాడు అభివృద్ధి చూసి ఆయన జీర్ణించుకోలేకపోతున్నారు' అని స్టాలిన్ విమర్శించారు.

ప్రయివేటు ట్రావెల్స్‌పై ఆర్టీఏ కొరడా

ఆరు రోజుల్లో 250 బస్సులపై కేసులు

- హైదరాబాద్ పరిధిలో 130 కేసులు
- ఈ నెల 18 వరకు కొనసాగనున్న తనిఖీలు



నవతెలంగాణ- సిటీ బ్యూరో

ప్రయివేటు ట్రావెల్స్‌పై రవాణా శాఖ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. సంక్రాంతి పండుగ వేళ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాహనాలపై దాడులు నిర్వహిస్తున్నారు. అడ్డగోలు టికెట్ ధరల వసూళ్లకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో తనిఖీలు చేపడుతున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో అధికారులు బృందాలుగా ఏర్పడి తనిఖీలు కొనసాగిస్తున్నారు. ముంబయి, బెంగళూరు, విజయవాడ, నాగ్‌పూర్ హైవేలపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఆరు రోజులుగా కొనసాగుతున్న దాడుల్లో 250కి పైగా బస్సులపై కేసులు నమోదు చేసినట్టు రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ పరిధిలో 130 బస్సులపై కేసులు నమోదు కాగా, రూ.52వేల కాంపౌండింగ్ ఫీజు వసూలు చేశారు. ఈ తనిఖీలు ఈ నెల 18వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆ శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్ ఆదేశాల మేరకు అధికారులు రంగంలోకి దిగారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాలకు ట్రావెల్స్ బస్సులు నడుస్తున్నాయి. ఈ బస్సుల్లో ప్రయాణికులు మండే స్వభావం గల పదార్థాలను తీసుకెళ్లకుండా చూడాలని, ఇద్దరు డ్రైవర్లు లేని ట్రావెల్స్‌పై కేసులు నమోదు చేయాలని మంత్రి, కమిషనర్ సూచించడంతో ఆర్టీఏ అధికారులు అప్రమత్తమై తనిఖీలు చేపడుతున్నారు. గతంలో జరిగిన బస్సు ప్రమాదాల నేపథ్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. రెండ్రోజులుగా ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ జేటీసీ చంద్రశేఖర్‌గౌడ్ పర్యవేక్షణలో రంగారెడ్డి డీటీసీ సదానందం, ఆర్టీవోలు కిష్టయ్య, పురుషోత్తం రెడ్డి, ఇతర ఆర్టీవోలు, ఎంవీఐలు, ఏఎంవీఐలు తనిఖీలు చేపట్టి 250కిపైగా బస్సులపై కేసులు నమోదు చేశారు.

రూ.88.55 కోట్ల డివిడెండ్ చెల్లింపు

సీఎంకు చెక్కు అందజేసిన సింగరేణి సీఎమ్‌డీ బలరాం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి కాలరీస్ రాష్ట్ర ప్రభుత్వానికి డివిడెండ్ చెల్లించింది. శనివారం ఆసంస్థ సీఎమ్‌డీ ఎన్ బలరాం నాయక్ ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు రూ.88.55 కోట్ల చెక్కును అందచేశారు. సింగరేణి కాలరీస్ చెల్లింపు మూల ధనం (పెయిడ్ అప్ ఈక్విటీ షేర్ క్యాపిటల్) లో పది శాతాన్ని (రూ.173 కోట్లు) డివిడెండ్‌గా చెల్లించాలని నిర్ణయించారు. సంస్థలో రాష్ట్ర ప్రభుత్వ వాటా 51 శాతం ఉన్నందున, ఆ వాటా ప్రకారం డివిడెండ్‌ను చెల్లించినట్టు ఆ సంస్థ తెలిపింది. సింగరేణి సంస్థ దక్షిణ భారత దేశ ఇంధన అవసరాలు తీరుస్తూ, లాభాలు ఆర్జిస్తూ, కార్మికులకు లాభాల వాటా చెల్లిస్తున్నదని పేర్కొన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా ఏటా డివిడెండ్లు చెల్లిస్తున్నారు. విద్యుత్ శాఖపై సమీక్ష సందర్భంగా ఈ చెక్కును సింగరేణి సీఎమ్‌డీ అందచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇంధన శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

టెట్ నిర్వహణలో విద్యాశాఖ నిర్లక్ష్యం

- వర్ధమాన్ ఇంజినీరింగ్ కాలేజీలో సాంకేతిక సమస్య
- అర్థాంతరంగా నిలిచిన రెండో విడత పరీక్ష
- అభ్యర్థుల ధర్నా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్/శంషాబాద్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) పరీక్షల నిర్వహణలో పాఠశాల విద్యాశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించింది. శనివారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పక్కన నర్కుడ గ్రామ సమీపంలోని వర్ధమాన్ ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించిన పరీక్షలో సాంకేతిక సమస్యలు వచ్చాయి. సర్వర్‌డౌన్ కావడంతో ఆన్‌లైన్‌లో జరుగుతున్న పరీక్ష మధ్యలోనే అర్థాంతరంగా నిలిచిపోయింది. దీంతో గందరగోళం నెలకొంది. అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పది నిమిషాల్లో సమస్య పరిష్కారమవుతుందని నిర్వాహకులు చెప్పినా అది సాధ్యం కాలేదు. గంటలకొద్దీ ఆలస్యం కావడంతో అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులు ధర్నాకు దిగారు. నిర్వాహకులతో వాగ్వాదం చోటుచేసుకుంది. అభ్యర్థులకు మద్దతుగా వారి కుటుంబ సభ్యులు శంషాబాద్-షాబాద్ రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు. న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సాంకేతిక సమస్య తలెత్తడంతో రాత్రి వరకు పరీక్ష రాయాల్సి వచ్చింది. ఈనెల రెండో తేదీన టెట్ రాతపరీక్షలు ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానం (సీబీఆర్టీ)లో ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈనెల 20వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. శనివారం పేపర్-2 గణితం, సైన్స్ (తెలుగు మీడియం) అభ్యర్థులకు పరీక్షలను నిర్వహించారు. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రెండో విడత పరీక్ష జరగాల్సి ఉన్నది. రెండో విడతలో 750 మంది అభ్యర్థులను కేటాయించారు. వారిలో 467 మంది హాజరయ్యారు. ఈ కేంద్రంలో మొత్తం మూడు సర్వర్‌లు ఉండగా, ఒక సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. పరీక్ష ప్రారంభమైన తర్వాత మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఒక సర్వర్ డౌన్ కావడంతో 150 మంది అభ్యర్థులకు పరీక్ష నిలిచిపోయింది. దీంతో అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఎట్టకేలకు పరీక్షను తిరిగి ప్రారంభించి రాత్రి 7.30 గంటల వరకు నిర్వహించారు.

సాంకేతిక సమస్యతో నిలిచిన పరీక్ష : విద్యాశాఖ

శంషాబాద్ పక్కన వర్ధమాన్ ఇంజినీరింగ్ కాలేజీలో టెట్ రెండో విడతలో 155 మంది అభ్యర్థులకు సాంకేతిక సమస్య తలెత్తడం వల్ల పరీక్ష మధ్యలో నిలిచిపోయిందని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, టెట్ చైర్మెన్ ఈవి నరసింహారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తర్వాత ఆ సమస్యను పరిష్కరించామనీ, పరీక్ష పున:ప్రారంభించామనీ, విజయవంతంగా నిర్వహించామని పేర్కొన్నారు. తర్వాతి పరీక్ష ఆదివారం ఉదయం 58 కేంద్రాల్లో, మధ్యాహ్నం 57 కేంద్రాల్లో నిర్వహిస్తామని వివరించారు. శనివారం మొదటి విడత పరీక్షలను ఉదయం 73 కేంద్రాల్లో 18,574 మందికి కేటాయించగా, 14,023 (75.50 శాతం) మంది హాజరయ్యారని వివరించారు. 4,551 (24.50 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 73 కేంద్రాల్లో 19,341 మందికి కేటాయిస్తే 14,113 (72.97 శాతం) మంది పరీక్ష రాశారని తెలిపారు. 5,228 (27.03 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

మయన్మార్ మిలటరీ వైమానిక దాడుల్లో 40మందికి పైగా మృతి



నెపిడా : పశ్చిమ రాఖినె రాష్ట్రంలోని గ్రామంలో ఈ వారంలో మయన్మార్ సైనిక ప్రభుత్వం జరిపిన వైమానిక దాడుల్లో 40మందికి పైగా మరణించారని ఐక్యరాజ్య సమితి వెల్లడించింది. మయన్మార్‌లో దాదాపు నాలుగేండ్లుగా అంతర్యుద్ధం కొనసాగుతోంది. రాఖినె ప్రాంత స్వయం ప్రతిపత్తి కోసం అక్కడి మిలీషియా అరకన్ ఆర్మీ ప్రభుత్వంతో పోరాడుతోంది. కియూక్‌ని మావ్ గ్రామంపై బుధవారం మధ్యాహ్నం జుంటా జరిపిన దాడిలో 500కిపైగా ఇండ్లు ధ్వంసమయ్యాయని, 40మందికి పైగా మృతి చెందారని ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ఐక్యరాజ్య సమితి కూడా శుక్రవారం ఒక ప్రకటన జారీ చేసింది. కాగా పౌరులపై తామెలాంటి దాడులకు దిగలేదని జుంటా పేర్కొంది. తీవ్రవాదులతోనే తమ పోరాటమని వ్యాఖ్యానించింది. ఇదిలావుండగా, ఈ దాడిలో మరణించిన 26మంది ముస్లింల పేర్లను అరకన్ ఆర్మీ వెల్లడించింది. మరో 12మంది గాయపడ్డారని తెలిపింది. అంతర్జాతీయ మానవతా చట్ట నిబంధనలకు అందరూ కట్టుబడి వుండాలని ఐక్యరాజ్య సమితి అన్ని పక్షాలకు పిలుపిచ్చింది.

కేంద్రం వాటాను పెంచండి

- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అంగన్వాడీలకు కోడి గుడ్డును ఇవ్వకపోవడం సరికాదు
- ధరలకు అనుగుణంగా పోషకాహారం అందించాలి : రాజస్థాన్‌లోని ఉదయపూర్ చింతన్ శివిర్‌లో మంత్రి సీతక్క

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్ర ప్రాయోజిత పథకాల్లో కేంద్ర ప్రభుత్వ వాటా పెరగాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క కోరారు. అంగన్వాడీ కేంద్రాల్లో పెరిగిన ధరలకు అనుగుణంగా పోషకాహారాన్ని బాలింతలు, పిల్లలకు అందించాల్సి ఉంటుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అంగన్వాడీ కేంద్రాలకు కోడి గుడ్డును దూరం చేయడాన్ని ఆమె ఆక్షేపించారు. రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయపూర్ పట్టణంలో కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవి అధ్యక్షతన జరిగిన చింతన్ శివిర్‌లో మంత్రి సీతక్క మాట్లాడారు. రాష్ట్రంలో పౌష్టికాహారం కోసం అమలవుతున్న ఆరోగ్యలక్ష్మి పథకం, బాలామృతం గురించి ఆమె వివరించారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే తాజా నివేదిక ప్రకారం సరైన పోషకాహారం అందక దేశంలో 30 శాతానికి పైగా ఐదేండ్ల లోపు చిన్నారులు ఎదుగుదల లోపంతో బాధపడుతున్నారనీ, మహిళలు రక్తహీనతతో సమస్యలు ఎదుర్కొం టున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పనిచేయాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. పోషకాలు అధికంగా ఉండే కోడిగుడ్లను బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అంగన్వాడి కేంద్రాలకు పంపిణీ చేయడం లేదనీ, సాంస్కృతిక కారణాలు ఏవైనా అడ్డుగా ఉంటే, కోడిగుడ్డు స్థానంలో అధిక పోషకాలు ఉండే ఇతర ప్రత్యామ్నాయ పదార్థాలను అందివ్వాలని సూచించారు. ఆ మేరకు కేంద్రం నుంచి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని కోరారు. రాష్ట్రంలో 35,700 అంగన్వాడి కేంద్రాలను సమర్థవంతంగా నిర్వ హిస్తున్నామని తెలిపారు. దేశంలోనే అంగన్వాడి సిబ్బందికి అత్యధిక వేతనాలు అందిస్తున్నామని వివరించారు.వితంతు ఫించన్లను రూ.2వేలు అందిస్తున్నామనీ, దీనిలో కేంద్రం వాటా కేవలం రూ.200 మాత్రమే ఉందన్నారు. పదేళ్లుగా కేంద్రం ఈ మొత్తాన్ని పెంచలేదని గుర్తుచేశారు.సమావేశంలో రాష్ట్రం తరపున మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ హాజరయ్యారు

అర్థం చేసుకోకుండా.. రాద్ధాంతం చేస్తున్నారు

- మీ మనోభావాలు దెబ్బతింటే క్షమించండి : దిల్‌రాజు



నవతెలంగాణ-హైదరాబాద్

తెలంగాణ సంస్కృతిని హేళన చేయడం తన ఉద్దేశం కాదని, ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే క్షమించాలని కోరుతున్నా అని సినీ నిర్మాత, టీఎఫ్‌డీసీ చైర్మెన్ దిల్‌రాజు అన్నారు.

ఇటీవల నిజామాబాద్‌లో జరిగిన 'సంక్రాంతికి వస్తున్నాం' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో దిల్‌రాజు చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారిన నేపథ్యంలో శనివారం ఆయన మీడియాకు క్లారిటీ ఇచ్చారు.

ఈ సందర్భంగా దిల్‌రాజు మాట్లాడుతూ 'నిజామాబాద్ పట్టణంలో 'సంక్రాంతికి వస్తున్నాం' ఈవెంట్ చేశాం. అప్పట్లో 'ఫిదా' సక్సెస్ మీట్ కూడా ఇక్కడే నిర్వహించాం. నిజామాబాద్ వాసిగా నాకు ఈ ప్రాంతంతో ఉన్న అనుబంధం అలాంటిది. మా సినిమా గురించి మాట్లాడే క్రమంలో తెలంగాణ కల్చర్‌లో ఉండే దావత్ గురించి మాట్లాడుతూ మటన్, తెల్ల కల్లు గురించి చెప్పా. అయితే ఆ మాటల్లో నేను తెలంగాణ వాళ్ళను అవమానించానని, అవహేళన చేశానని కొంతమంది మిత్రులు సోషల్ మీడియాలో కామెంట్లు పెట్టారని తెలిసింది. తెలంగాణ దావత్‌ను నేను మిస్సవుతున్నాను. సంక్రాంతికి వస్తున్న నా రెండు సినిమాలు విడుదలయ్యాక దావత్ చేసుకోవాలని ఉంది అని చెప్పటం నా ఉద్దేశం. అదే విషయాన్ని ఈవెంట్ చివరిలోనూ చెప్పా. నా భావాన్ని తప్పుగా అర్థం చేసుకుని, రాద్ధాంతం చేయటం ఎంతో బాధగా ఉంది. నా మాటల వల్ల నిజంగా మీరు మనస్తాపం చెందితే క్షమించండి. నేను మన తెలంగాణ సంస్కృతిని గౌరవిస్తా. ఆ గౌరవంతోనే నిజామాబాద్ జిల్లా బాన్సువాడలో 'ఫిదా' సినిమా తీశా. ఫ్యామిలీ ఎమోషన్స్‌కి ఎంతో విలువ ఇస్తామని భానుమతి పాత్ర ద్వారా చెప్పాం. ఆ సినిమా ప్రపంచ వ్యాప్తంగా ఎంత పెద్ద హిట్ అయ్యిందో మీ అందరికీ తెలుసు. అలాగే 'బలగం' తీసినప్పుడు తెలంగాణ సమాజం మమ్మల్ని అభినందించింది. తెలంగాణ ప్రజలందరూ 'ఇది మా సినిమా' అని గుండెలకు హత్తుకున్నారు. అన్ని రాజకీయ పార్టీలు మాపై ప్రశంసలు కురిపించాయి. అయితే ఒక తెలంగాణ వాసిగా ఈ రాష్ట్ర సంస్కృతిని హేళన చేస్తానని ఎలా అనుకున్నారో నాకు తెలియదు. సినిమా రంగంలో ఫెటర్నీ నుంచి ఎఫ్‌డీసీ చైర్మెన్‌ను అయ్యాను. ఇటు పరిశ్రమకు, అటు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నాను. తెలంగాణలో మన తెలుగు సినిమా అభివృద్ధి చెందడంతోపాటు, యువతకు ఉపయోగపడేలా పని చేస్తా. ఇటీవల ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కూడా పలు సూచనలు చేశారు. యువత చాలా ఎక్కువగా ఉంది. వారిని ప్రోత్సహించి, పరిశ్రమలో మరిన్ని అవకాశాలు కల్పించాలన్నారు. యువత ఆంధ్రలో శిక్షణ పొందినా, తెలంగాణలో శిక్షణ పొందినా ఫైనల్‌గా తెలుగు పరిశ్రమకు వారి ప్రతిభ ఉపయోగపడేలా చేయాలనుకుంటున్నాం. ఏపీ ప్రభుత్వంతో కూడా కలిసి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తా. సినిమాలకు, ఎఫ్‌డీసీకి రాజకీయాలతో సంబంధం లేదు. ఇలాంటి అనవసర విషయాల్లోకి నన్ను లాగొద్దని తెలంగాణలోని అన్ని పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నా' అని అన్నారు.

జోక్యం చేసుకోలేం

- శాసన, కార్యనిర్వాహక శాఖలదే బాధ్యత
- ఎస్సీ, ఎస్టీ ఉపవర్గీకరణ, క్రిమిలేయర్ తీర్పు అమలుపై సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ : ఎస్సీ, ఎస్టీ ఉపవర్గీకరణ, క్రిమిలేయర్ విషయంలో గతేడాది ఆగస్టులో వెలువర్చిన చారిత్రాత్మక తీర్పు అమలుపై ప్రభుత్వాలను ఆదేశించే విషయంలో సుప్రీంకోర్టు తన అభ్యంతరాలను పునరుద్ఘాటించింది. దీనిపై చర్య తీసుకోవాల్సిన బాధ్యత శాసనసభ, కార్యనిర్వాహక శాఖపై ఉన్నదని సర్వోన్నత న్యాయస్థానం నొక్కి చెప్పింది. విధానపరమైన నిర్ణయాల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ఎస్సీ, ఎస్టీ కేటగిరీలలోని 'క్రిమిలేయర్' అభ్యర్థులు రిజర్వేషన్ ప్రయోజనాలు పొందకుండా నిరోధించటం, ఎస్సీ, ఎస్టీ సమూహాలలో ఉపవర్గీకరణ ద్వారా ఈ ప్రయోజనాలను అత్యంత వెనుకబడిన వర్గాలకు విస్తరించటానికి అనుమతించటమే సుప్రీంకోర్టు తీర్పు లక్ష్యం.

సుప్రీంకోర్టు మార్గదర్శకత్వం ఉన్నప్పటికీ.. భారత్‌లో పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వివాదాస్పద సమస్య పరిష్కారంలో ముందుకు రావటంలేదు. ముఖ్యంగా, దళిత వర్గాలలోని కొన్ని అమలును సమర్థించటం, మరికొన్ని వ్యతిరేకిస్తుండటమే దీనికి కారణమని విశ్లేషకులు చెప్తున్నారు. దీంతో సుప్రీంకోర్టు తీర్పు అమలు క్లిష్టమైందని అంటున్నారు. ఈ పరిస్థితుల నడుమ మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. రాష్ట్రస్థాయి నియామక ప్రక్రియల్లో సుప్రీంకోర్టు తీర్పును అమలు చేసేలా ఆదేశాలివ్వాలంటూ తన పిటిషన్‌లో పేర్కొన్నాడు.

పిటిషనర్ తరపున అడ్వొకేట్ సిద్ధార్థ గుప్తా వాదనలు వినిపించారు. అన్ని ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థ(పీఎస్‌యూ)లు ఎస్సీ, ఎస్టీ సమూహాల్లోని క్రిమిలేయర్ వ్యక్తులకు రిజర్వేషన్ ప్రయోజనాలను తక్షణమే ఆపాలంటూ వాదించారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.ఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసిహ్‌లతో కూడిన ధర్మాసనం స్పందించింది. విధాన మార్పుల అమలులో న్యాయవ్యవస్థ పరిమితులను ధర్మాసనం స్పష్టం చేసింది. గత 75 ఏండ్ల అనుభవంతో తాము తమ అభిప్రాయాన్ని తెలిపామనీ, నిర్ణయం తీసుకోవాల్సింది శాసన, కార్యనిర్వాహక శాఖలదేనని వివరించింది. విధానపరమైన నిర్ణయాల్లో న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోకూడదన్న అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమనీ వాదనను సుప్రీంకోర్టు ధర్మాసనం హైలెట్ చేసింది. ఈ సమస్య పరిష్కారంలో చట్టాలను రూపొందించే అధికారం శాసనసభ్యులకు ఉన్నదని జస్టిస్ గవాయ్ నొక్కి చెప్పారు. అవసరమైన చర్యలు తీసుకోవటం ఎన్నికైన ప్రతినిధుల బాధ్యత అని అన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉపవర్గీకరణపై సంచలన తీర్పు వెలువరించిన ఏడుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు ధర్మాసనంలో జస్టిస్ గవాయ్ కూడా ఉన్న విషయం విదితమే.

యూజీసీ ముసాయిదాను ఉపసంహరించుకోవాలి

తమిళనాడు శాసనసభ తీర్మానం

చెన్నై : యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ముసాయిదా నిబంధనలపై తమిళనాడు శాసనసభ ఆగ్రహం వ్యక్తం చేసింది. దానిని ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీర్మానాన్ని ప్రవేశపెడుతూ యూజీసీ ముసాయిదా నిబంధనలు సమాఖ్యకు వ్యతిరేకమని, రాష్ట్ర ఉన్నత విద్యా ప్రయోజనాలకు భంగకరమని విమర్శించారు. ఇప్పటికీ ముసాయిదా రూపంలోనే ఉన్న నిబంధనలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ప్రజా నిరసన తప్పదని తీర్మానంలో తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ కోసం అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామని కూడా తమిళనాడు ప్రభుత్వం స్పష్టం చేసింది.

నికోలస్ మదురో ప్రమాణస్వీకారం

వెనిజులా అధ్యక్షుడిగా మూడోసారి బాధ్యతలు

ఆంక్షలతో అమెరికా సహా పశ్చిమ దేశాల కన్నెర్ర

ప్రతిపక్షానికి వత్తాసు



కారకాస్ : వెనిజులా అధ్యక్షుడిగా నికొలస్ మదురో శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. దేశాధ్యక్షుడుగా మదురో బాధ్యతలు స్వీకరించడం ఇది మూడోసారి. ఆయన ఆరు సంవత్సరాల పాటు ఆ పదవిలో కొనసాగుతారు. అయితే ఎన్నికల్లో మదురో అనేక అవకతవకలకు పాల్పడ్డారని ఆయన ప్రత్యర్థి ఎడ్మండో గోంజలెజ్ ఆరోపించారు. చట్టబద్ధంగా ఎన్నికైంది తానేనని ఆయన ప్రకటించుకున్నారని అల్ జజీరా తెలిపింది. అంతర్జాతీయ ఒత్తిడులు, అమెరికా ఆంక్షల నడుమ మదురో వెనిజెలియా అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. గత జూలైలో జరిగిన ఎన్నికల్లో గోంజలెజ్‌ను విజేతగా అమెరికా గుర్తించింది.

ప్రజా తీర్పును నిలబెట్టుకుంటా

ప్రమాణస్వీకార కార్యక్రమంలో మదురో ప్రసంగిస్తూ 'నా పదవీకాలంలో శాంతి, సౌభాగ్యం, సమానత్వం, నూతన ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలని ఆకాంక్షిస్తున్నాను' అని తెలిపారు. దేశ చట్టాలను గౌరవిస్తానని ఆయన పునరుద్ఘాటించారు. 'నేను చరిత్ర మీద, నా జీవితం మీద ప్రమాణం చేస్తున్నాను. ప్రజలిచ్చిన తీర్పును నిలబెట్టుకుంటాను. వారి సమస్యలు పరిష్కరిస్తాను' అని అన్నారు. కాగా మదురో ప్రమాణస్వీకారానికి ముందు రోజు ప్రతిపక్ష నేత మరియా కొరినా మచాడో నేతృత్వంలో నిరసన ప్రదర్శన జరిగింది. ఆమెను కొద్దిసేపు నిర్బంధించారని మద్దతుదారులు ఆరోపించారు.

విడుదలైన తర్వాత ఆమె సామాజిక మాధ్యమంలో ఓ పోస్ట్ పెడుతూ మదురో పాలనను సవాలు చేస్తూనే ఉంటానని తెలిపారు.

ప్రజాతీర్పును నిరాకరిస్తున్న పశ్చిమ దేశాలు

వామపక్ష దిగ్గజ నేత హూగో ఛావెజ్ 2013లో మరణించడంతో మదురో వెనిజులా పగ్గాలు స్వీకరించారు. మదురోను దేశ ప్రజలు ఎన్నుకుంటున్నప్పటికీ ఆయనను వెనిజులా అధ్యక్షుడిగా గుర్తించేందుకు అమెరికా సహా పలు పశ్చిమ దేశాలు నిరాకరిస్తున్నాయి. 2018 ఎన్నికల్లో మదురో విజయం సాధించినా ఆయన ప్రత్యర్థి, ప్రతిపక్ష నాయకుడు జువాన్ గుయాడియోను పశ్చిమ దేశాలు దేశాధ్యక్షుడిగా గుర్తించాయి. గుయాడియో కూడా తనకు తాను అధ్యక్షుడిగా ప్రకటించుకున్నారు. ఆ తర్వాత వెనిజులాపై అమెరికా మరిన్ని ఆంక్షలు విధించింది. దీంతో ఆ దేశం ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది.

ఆంక్షల పర్వం

మదురో అరెస్ట్‌పై సమాచారం అందిస్తే ఇస్తానన్న రివార్డును అమెరికా ప్రభుత్వం 15 మిలియన్ డాలర్ల నుండి 25 మిలియన్ డాలర్లకు పెంచింది. అంతేకాక మదురోకు మద్దతు ఇస్తున్న వ్యక్తులపై అమెరికా ఆర్థిక శాఖ ఆంక్షలు విధించింది. ఆంక్షలు ఎదుర్కొంటున్న వారిలో ప్రభుత్వ రంగ చమురు కంపెనీ పెట్రోలియస్ డీ వెనిజులా అధ్యక్షుడు హెక్టర్ ఆండ్రెస్ ఓబ్రెగాన్ కూడా ఉన్నారు.

ప్రతిపక్షానికి అమెరికా వత్తాసు

గత జూలైలో జరిగిన ఎన్నికల్లో మదురోను ఓడిస్తామని ప్రతిపక్షాలు బీరాలు పలికాయి. అయితే 51 శాతం ఓట్లతో ఆయన విజయకేతనం ఎగరేశారు. తనను పదవీచ్యుతుడిని చేసేందుకు ప్రతిపక్షాలు పశ్చిమ దేశాలతో కలిసి కుట్ర చేస్తున్నాయని మదురో ఆరోపించారు. మదురో ప్రభుత్వం ప్రతిపక్ష నేత గోంజలెజ్‌పై అరెస్ట్ వారంట్ జారీ చేయడంతో ఆయన దేశాన్ని వదిలి పరారై స్పెయిన్‌లో ఆశ్రయం పొందారు. గోంజలెజ్ ఈ వారం ప్రారంభంలో అమెరికాలో పర్యటించి అధ్యక్షుడు జో బైడెన్‌తో సమావేశమయ్యారు. మదురో చర్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. శ్వేతసౌధం ఆయనకు వంత పాడుతూ శాంతియుత ప్రదర్శనలపై, ప్రజాస్వామిక వాదులపై అణచివేతకు పాల్పడుతున్నదంటూ మదురో ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. గోంజలెజ్‌ను వెనిజులా అధ్యక్షుడిగా గుర్తించిన అమెరికా...మరుదో ప్రమాణస్వీకారాన్ని తప్పుపట్టింది.

ఆరోగ్యానికి హానికరం

వారానికి 90 గంటల పనితో కష్టమే.. గుండె జబ్బులు, మధుమేహం పెరిగే ప్రమాదం

ఎల్ అండ్ టీ చైర్మెన్ వ్యాఖ్యలపై వైద్యులు



న్యూఢిల్లీ : భారత్‌లోని ఉద్యోగులు వారానికి 90 గంటలు పని చేయాలని కోరుకుంటున్నట్టు ఎల్ అండ్ టీ చైర్మెన్ ఎస్.ఎన్ సుబ్రమణియన్ వ్యాఖ్యలు చేసినట్టు కొన్ని కథనాలు వస్తున్నాయి. ఇప్పటికే ఇవి సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో ఆ వ్యాఖ్యలకు సంబంధించిన కథనాలపై ఉద్యోగులు, కార్మికులతో ఇప్పటికే చర్చ నడుస్తున్నది. 'వారానికి 90 గంటల పని'పై తీవ్ర వ్యతిరేకతను వారు వ్యక్తం చేస్తున్నారు. ఇటు వైద్య, ఆరోగ్య నిపుణులు సైతం ప్రతికూలంగానే స్పందిస్తున్నారు. ఈ పని విధానం మనిషి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని అంటున్నారు.

వారానికి 90 గంటలు అంటే, రోజుకు సగటున 13 గంటలు పనిచేయటం. దీనితో శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్రమైన పరిణామాలుంటాయని వైద్య నిపుణులు చెప్తున్నారు. మిగిలిన 11 గంటలలో నిద్ర, ఇతర పనులు, ప్రయాణం, సంబంధాల బాధ్యతలను చూసుకోవాల్సి ఉంటుంది. కాబట్టి, ఈ తీవ్రమైన పనిభారం అన్ని సమయాల్లో ఒత్తిడి స్థాయిలు, పేలవమైన నిద్ర, విశ్రాంతి లేకపోవటం, అనారోగ్యకరమైన జీవనశైలి అలవాట్లతో ముడి పడి ఉంటుందని వారు హెచ్చరిస్తున్నారు. గుండెజబ్బులు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధుల భారంతో ఇప్పటికే పోరాడుతున్న భారతీయులకు ఈ పని ఒత్తిడి భారం మరింత నష్టాన్ని చేకూరుస్తుందని చెప్తున్నారు.

వారానికి 55 లేదా అంతకంటే ఎక్కువ గంటలు పని చేయటం వల్ల స్ట్రోక్ వచ్చే ప్రమాదం 35 శాతం, గుండె జబ్బులతో మరణించే ప్రమాదం 17 శాతం పెరుగుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) అధ్యయనం సమాచారం. "ఎక్కువ పని గంటలతో దీర్ఘకాలిక ఒత్తిడి వస్తుంది. ఇది కార్టిసాల్, అడ్రినలిన్ వంటి ఒత్తిడి హార్మోన్ల విడుదలను ప్రేరేపిస్తుంది. ఫలితంగా గుండె జబ్బుల ప్రమాదాలు పెరుగుతాయి. దీర్ఘకాలిక అధిక రక్తపోటు, గుండెపోటులు, స్ట్రోక్‌లు గుండె వైఫల్యానికి కారకాలు" అని ప్రముఖ వైద్యులు, గుండె, ఊపిరితిత్తుల మార్పిడి సర్జన్ డాక్టర్ ముకేశ్ గోయెల్ అన్నారు.

ఎక్కువ పని గంటల కారణంగా డయాబెటిస్ ప్రమాదాలు పెరిగే అవకాశమున్నదని వైద్యులు అంటున్నారు. పనిలో ఎక్కువ గంటలు ఉన్న సమయంలో భోజనంపై శ్రద్ధ ఉండకపోవచ్చనీ, దీంతో రక్తంలో చక్కెర హెచ్చుతగ్గులకు కారణమవుతుందని ప్రముఖ ఎండోక్రినాలజిస్ట్ వైద్యులు సప్తర్షి భట్టాచార్య చెప్తున్నారు. వారానికి 45 గంటలు లేదా అంతకంటే ఎక్కువగా పని చేసిన మహిళలకు వారానికి 35-40 గంటలు పని చేసినవారి కంటే మధుమేహం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉన్నదని ఒక అధ్యయనం వెల్లడించింది.

ఒత్తిడితో పాటు నిద్రలేమి, శరీరంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. నిద్ర చాలా అవసరమనీ, ఆ సమయంలో శరీరం రోజంతా కణాలలో పేరుకుపోయే చెడును తొలగిస్తుందని డాక్టర్ గోయెల్ అన్నారు. నిద్రలేమితో రోగనిరోధక వ్యవస్థ బలహీనపడుతుందనీ,బరువు పెరగటం, హార్మోన్ల అసమతుల్యత, కొలెస్ట్రాల్, రక్తంలో చక్కెర స్థాయిలు పెరగటం వంటికి దారి తీస్తుందని చెప్పారు. సంతానోత్పత్తి పైనా ప్రభావితం చేస్తుందన్నారు. పని భారం కారణంగా మానసిక ఆరోగ్యం కూడా ప్రతికూల ప్రభావాన్ని ఎదుర్కొంటుందని డాక్టర్ గోయెల్ చెప్పారు.

కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలు

లేబర్ కోడ్‌లను తక్షణమే విరమించుకోవాలి : సీఐటీయూ

ఆల్ ఇండియా ఉపాధ్యక్షులు ఎం.సాయిబాబు



నవతెలంగాణ-సూర్యాపేట

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని సీఐటీయూ ఆల్ ఇండియా ఉపాధ్యక్షులు ఎం.సాయిబాబు అన్నారు. రాష్ట్రంలో 25 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు వివిధ వృత్తుల్లో పనిచేస్తున్నారని, వారి సంక్షేమాన్ని తుంగలో తొక్కేలా ప్రభుత్వాల విధానాలున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రామ్మోహన్ అధ్యక్షతన జరిగిన ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుం దన్నారు.

రాష్ట్రంలో వెల్ఫేర్ బోర్డులో మార్పులు చేస్తూ నిధులను విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ కార్మికులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సంక్షేమ పథకాల దరఖాస్తులకు నిధులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించిన కార్మికుని కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలని, సహజ మరణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని కోరారు. దహన సంస్కారాలకు ఇచ్చే 30 వేలను లక్ష రూపాయలకు పెంచాలని, 60 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికునికీ రూ.6000 పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర గౌరవాధ్యక్షులు వంగూరి రాములు, రాష్ట్ర కార్యదర్శి ఆర్. కోటంరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ముదం శ్రీనివాస్, కోశాధికారి యల్క సోమయ్య గౌడ్, సిహెచ్.లక్ష్మీనారాయణ, అనంతల మల్లయ్య, సోములు, లక్ష్మయ్య, ఉప్పలయ్య, గాలయ్య, జంగయ్య, సాగర్, రాములు, నాగేశ్వరరావు, రమేష్, బాలాజీ నాయక్, రాజేశ్వరి, సుజాత, మంజుల పాల్గొన్నారు.

ఉపాధి కల్పనకు ప్రభుత్వాలు కృషి చేయాలి

- ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలిఉల్లా ఖాద్రీ, ధర్మేంద్ర

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యార్థి, యువజన సమస్యల పరిష్కారమే తమ ప్రధాన కర్తవ్యమని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలిఉల్లాఖాద్రీ, కె ధర్మేంద్ర అన్నారు. యువజనుల అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలనీ, అందుకోసం నిర్దిష్టమైన విధానాలను అవలంభించాలని కోరారు. శనివారం హైదరాబాద్‌లో ఏఐవైఎఫ్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయడం ద్వారానే దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందని చెప్పారు. రాష్ట్రంలో నిరుద్యోగులు నిరుద్యోగ భృతిని ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఆఫీసు బేరర్లు టి సత్యప్రసాద్, శ్రీమాన్, పి మహేందర్, నాయకులు సల్మాన్‌బేగ్, మస్క సుధీర్, శివకుమార్, నవీన్, జగదీశ్, హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళితులు, గిరిజనులకు అండ.. సీపీఐ(ఎం) జెండా

మెతుకు సీమలో నేటికీ కొనసాగుతున్న వివక్ష

అంబేద్కర్ విగ్రహాలను ఊర్లో పెట్టనీయని పెత్తందార్లు

ఎర్రజెండా నీడన దళితుల ప్రతిఘటన పోరాటాలు

సామాజిక న్యాయం కోసం

చైతన్య యాత్రలు, సహపంక్తి భోజనాలు

రాజ్యాంగం, రిజర్వేషన్ల రక్షణకు ఐక్య సహ ఉద్యమాలు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో వెనుకబాటుకు గురైన దళితులు, గిరిజనులకు అండగా సీపీఐ(ఎం) జెండా నిలుస్తోంది. ఆధునీకత సంతరించుకున్నా మెతుకు సీమ మెదక్‌లో ఇప్పటికీ సామాజిక అణచివేత, కుల వివక్ష కొనసాగుతోంది. పెత్తందార్ల ఆధిపత్యం చెలాయించే గ్రామాల్లో ఇప్పటికీ అంబేద్కర్ విగ్రహాల్ని ఊరి మధ్యలో పెట్టనీయని దుస్థితి ఉంది. మూఢనమ్మకాల పేర మంత్రాలు చేశారంటూ.. ఊర్లో గుడిని తాకారంటూ.. గ్రామ బహిష్కరణలు చేసే దుస్సాంప్రదాయం కొనసాగుతోంది. అసైన్డ్, పేదల భూములపై కన్నేసిన పెత్తందార్లు కబ్జాలు చేయడం, ప్రజా అవసరాల పేర ప్రభుత్వం లాక్కోవడం ద్వారా పేదల్ని భూమికి దూరం చేశారు. సామాజిక శ్రేణుల సమస్యలపై స్పందిస్తూ వారి వెన్నంటి ఉద్యమాలు, ప్రతిఘటనా పోరాటాలు నడిపింది సీపీఐ(ఎం). వర్గ పోరాటాలతో పాటు సామాజికోద్యమాలను సాగించడంలో సీపీఐ(ఎం) ముందుంది. రాజ్యాంగం, రిజర్వేషన్ల పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలు చేసింది.

అంబేద్కర్ విగ్రహాన్ని ఊర్లోకి రానివ్వని పెత్తందార్లు


ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికీ సామాజిక శ్రేణుల్ని అంటిముట్టకుండా దూరం పెట్టి వివక్ష చూపే దుస్థితి ఉంది. చౌటకూరు మండలంలోని ఏటిగడ్డ లింగంపల్లి, కోర్పోల్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని ఊర్లో పెట్టనీయకుండా పెత్తందార్లు అడుకున్నారు. ఇదేమిటని అడిగితే దళిత వాడల్లోనే పెట్టాలని హుకుం జారీ చేశారు. రాయికోడ్ మండలం పాపాడు, కొండాపూర్ మండలంలోని తేలుపోలు, మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలంలోని బూరుగుపల్లి వంటి గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాల్ని ఊర్లో పెట్టొద్దంటూ పెత్తందార్లు అడ్డుకున్నారు. దళితులు ఎదిరించలేని పరిస్థితుల్లో ఎర్రజెండా వారికి అండగా నిలిచి మూడు నెలలపాటు ప్రతిఘటనా పోరాటాలు చేసి ఊర్లోనే అంబేద్కర్ విగ్రహాలు పెట్టించడంలో కీలక పాత్ర పోషించింది. సదాశివపేట మండలంలోని ఎల్లారంలో దళితుడు చనిపోతే ఆ ఊరికొచ్చిన మృతుని బంధువులు ఊర్లోని హనుమాన్ గుడ్డి కట్టను తాగినందుకు ఊర్లోకి దళితులు రాకుండా ఫెన్సింగ్ వైర్లు చుట్టి కంచె పాతారు.. గుడిని శుభ్రం చేశారు. ఆ ఊర్లో బిక్కుమన్న దళితుల్ని చైతన్య పర్చిన సీపీఐ(ఎం) నెలల తరబడి దశలవారీగా పోరాటం సాగించి పెత్తందార్లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయించారు. ఆందోల్ మండలంలోని కొడెకల్‌లో సైతం చర్చికి ప్రహరీ నిర్మించుకున్న దళితులపై కక్షకట్టిన ఉన్నత కులాల వాళ్లు దళితులున్న కాలనీ చుట్టూ ముళ్ల కంప వేసి ఊర్లోకి రాకుండా అడ్డుకున్నారు. ఇలాంటి సామాజిక రుగ్మతుల్ని ఎదిరించి దళితుల కోసం నిలబడిన సీపీఐ(ఎం) ఆ ఊరి జనాలకు భరోసా ఇచ్చింది. ఇలా ఉమ్మడి మెదక్ జిల్లా అంతటా కులాధిపత్య దురంకారాన్ని ఎదిరించడంతో ఎర్రజెండా పట్ల సామాజిక వర్గాల్లో ఎంతో సానుకూలత పెరిగింది. మెదక్ జిల్లా మనోహరాబాద్ మంలంలోని గౌతోజిగూడలో ఉన్నత చదువులు చదివిన దళిత యువకులు ఊర్లో జరిగే శుభ, అశుభ కార్యాలకు డప్పులు కొట్టేందుకు రావడంలేదన్న నెపంతో పంచాయితీకి లాగారు. ఊరి నుంచి బహిష్కరించారు. దప్పుకొట్టనందున వారికి ప్రభుత్వం ఇచ్చిన ఇనాం భూమి తిరిగిచ్చేయాలని, ఎవరైనా వారితో మాట్లాడితే రూ.5 వేల జరినామా, 25 చెప్పుదెబ్బలంటూ తీర్మానం చేశారు. ఆ సంఘటనపై సీపీఐ(ఎం) న్యాయ పోరాటం సాగించింది. 18 మందిపై కేసు నమోదు అయ్యే వరకు బాసటగా నిలిచింది. ఎల్లారంలో గుడి ప్రవేశ ప్రతిఘటనా పోరాటం ఎంతో చర్చనీయాంశమైంది. మెగుడంపల్లిలోని గుడిపల్లి అంబేద్కర్ విగ్రహ వివాదంలో జహీరాబాద్ వరకు పాదయాత్ర చేసి విగ్రహావిష్కరణ జరిపారు. కొల్కూరులో మూఢ నమ్మకాల పేర దళితుడిని చెట్టుకు కట్టేసి కొట్టి బహిష్కరించిన సంఘటనపైనా సీపీఐ(ఎం) నికరంగా నిలబడి కొట్లాడింది.

కుల దురహంకార హత్యలు, దాడులపై..

అక్కడక్కడ కుల దురహంకార హత్యల పరంపర కొనసాగింది. నారాయణఖేడ్ ప్రాంతంలో నర్సప్ప అనే దళితులు ఉన్నత కులానికి చెందిన వ్యక్తి భూమిని కౌలుకు సాగు చేశారు. భూమి యజమాని సోదరుడైన అగ్రకులహం కారి తన సోదరుడి భూమిని సాగు చేయొద్దంటూ బెదిరించి బండరాయితో కొట్టి పొలం గట్లపైనే చంపేశారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బాధితుని కుటుంబం తరపున శవాన్ని రోడ్డుపైన పెట్టి ఆందోళన చేసింది. నిందితు డిని అరెస్టు చేసి కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేయడంతో పోలీసులు చర్యలు తీసుకున్నారు. కోహీర్ మండలంలోని బడంపేటలో నర్సింహులు అనే దళితుడు ఊర్లో బుద్ధిని విగ్రహ ఏర్పాటులో కీలకంగా ఉన్నారు. అతని కొడుకు ఇటీవల కులాంతర వివాహం చేసుకోవడంతో జీర్ణించుకోలేని పెత్తందార కులస్తులు నర్సింహులుపై సామూహిక దాడి చేసి కొట్టి చంపారు. బాధితులపై తప్పుడు కేసులు పెట్టారు. సీపీఐ(ఎం) జోక్యం చేసుకుని ఆర్డీఓ, డీఎస్పీ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లింది. ఊర్లో సభలు, సమావేశాలు జరిపి దళితుల్ని ఐక్యం చేసింది. 16మందికి పైగా అట్రాసిటీ కేసు కింద అరెస్టు చేసే వరకూ పోరాటం సాగించారు. అదే విధంగా దళితుల అసైన్డ్ భూములపై పెద్దల కన్ను పడి అనేక చోట్ల కబ్జా చేశారు. ప్రభుత్వం శ్మశానవాటికలు, రైతు వేదికలు, డబుల్ ఇండ్లు, నర్సరీలను దళితుల భూముల్లోనే పెట్టి భూమికి దూరం చేసింది. జిల్లాలో వందలాది గ్రామాల్లో భూములు కోల్పోయిన దళితులకు అండగా ఉండి భూముల్ని కాపాడేందుకు ఆందోళనలు చేయడం, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

మహనీయుల స్ఫూర్తిని నింపే కార్యక్రమాలు

జ్యోతిరావుపూలే, సావిత్రిబాయిపూలే, బీఆర్ అంబేద్కర్, జగ్జీవన్‌రామ్, బీటీ రణదీవె వంటి మహనీయుల్ని స్మరిస్తూ సామాజిక న్యాయం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించారు. కార్మిక వర్గంలో సామాజిక న్యాయ చైతన్యాన్ని నింపేందుకు పారిశ్రామిక వాడల్లో సహపంక్తి భోజన కార్యక్రమాలు నిర్వహించారు. ఏప్రిల్ మాసమంతా అంబేద్కర్-పూలే జాతర్లు, సామాజిక చైతన్య యాత్రలు, సహపంక్తి భోజనాలు, సెమినార్లు, రౌండ్‌టేబుల్ సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దళిత, గిరిజనుల్లో సీపీఐ(ఎం) పట్ల మంచి ఆదరణ ఉంది.



దళితుల భూములపై పెద్దల కన్ను

ఉమ్మడి జిల్లాలో దళితులకున్న అసైన్డ్ భూములపై పెద్దలు కన్నేశారు. వందలాది గ్రామాల్లో అసైన్డ్ భూముల్ని రియల్టర్లు, లీడర్లు కబ్జా చేశారు. ప్రభుత్వమే ప్రజా అవసరాల పేర భూముల్ని గుంజుకుంది. ఇలాంటి సంఘటనలపై సీపీఐ(ఎం) బాధితుల పక్షాన నిలబడింది. ఆధునిక కాలంలోనూ అంబేద్కర్ విగ్రహాలను వెలివాడలకే పరిమితం చేయాలన్న పెత్తందార్ల ఆగడాలను ఎదిరించడంలో ఎర్రజెండా ముందుంది. చట్టాలున్నా అమలు కావడంలేదు. గ్రామాల్లో గుడిని తాకారని, డప్పులు కొట్టట్లేదని, మూఢనమ్మకాల పేర బహిష్కరణలు చేసే దుర్మార్గం కొనసాగుతోంది.

- అతిమేల మాణిక్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు



'అనంత' అజ్ఞానం

"ఏమంటివి ఏమంటివి ! జాతి నెపమున సూత సుతునకిందు నిలువ అర్హత లేదందువా? ఇది క్షాత్ర పరీక్షయేకాని, క్షత్రియ పరీక్షకాదే! ఇది కుల పరీక్షయేనందువా! నీ తండ్రి భరద్వాజుని జననమెట్టిది? మట్టికుండలో పుట్టితివి కదా! నీది యే కులము? అస్మత్ పితామహుడు గురకుల వద్దుడైన ఈ శాంతనవుడు శివసముద్రుల భార్యయగు గంగా గర్భమున జనియించలేదా? ఈయినదే కులము? మా వంశమునకు మూల పురుషుడయిన వశిష్ఠుడు దేవవేశ్యగు ఊర్వశీ పుత్రుడు కాదా?... మా వంశము ఏనాడో కులహీనమైనది. కాగా నేడు కులమూ కులమూ వ్యర్థ వాదమెందుకు?" అని నిండు సభలో దుర్యోధనుడు ఆచార్యులతో చరిత్రనంత తిరగేసి నిలదీస్తాడు. కుల సమాజం కూలిపోయి అందరూ సమానంగా బతకాలని కోరుకునే ఆధునికులందరికీ 'దాన వీర శూర కర్ణ' సినిమాలోని మాటలు ఎంతో ప్రేరణగా నిలుస్తాయి. ఉత్సాహాన్నిస్తాయి. సుయోధనుడూ కర్ణుని మధ్య మైత్రీ సంబంధాన్ని ఎంతో ఉదాత్తంగా చిత్రీకరించిన సినిమా అది. ఆనాటి ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకుంది. కానీ కుల వ్యవస్థను, వాటి పీడనను కాపాడుకోవాలనుకునే మనువాదులకు, దానికండగా ఉండే మతవాదులకూ చిర్రెత్తుకు వచ్చింది. అలాంటి సినిమాలు, పాత్రలూ హిందూ మతానికి వ్యతిరేకంగా ఉన్నాయని ఇపుడు కొత్తగా గొంతునెత్తుకుని అక్కసును వెళ్లగక్కుతున్నారు.

అలాంటి ఆక్రోశమే అనంత శ్రీరాంలో మనం చూస్తాం! మొన్నీమధ్య విజయవాడ సమీపంలో ఏర్పాటు చేసిన విశ్వహిందూ పరిషత్ వారి 'హిందూ శంఖారావం' సభలో ఈ సినిమా పాటల రచయిత పాల్గొని ప్రసంగించాడు. కర్ణుడి పాత్రను, ఇతిహాస, కావ్య పురాణాల పాత్రలను వక్రీకరిస్తున్నారని, హిందువుగా నేను సహించననీ గొంతు చించుకున్నాడు. కర్ణుని పాత్రను కల్కి సినిమాలో గొప్పగా చూపించడం, హిందూమతానికి తీవ్ర అపచారంగా బాధపడిపోయాడు. 'బ్రహ్మాండ నాయకుడు' అనే తెలుగు పదాన్ని అన్యమత దేవతలకు వాడరాదని, సినిమా పరిశ్రమలో హిందూ వ్యతిరేక శక్తులున్నారని కళా సాంస్కృతిక రంగంలో వైషమ్యాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశాడు. పాత్రల వ్యక్తీకరణలను సహించబోమని వీరంగం వేశాడు. వ్యాసుడు రాసిన భారతాన్ని ఏ పొల్లు పోకుండా కవిత్రయం అనువదించిందా? ఎన్నిరకాల భారత రామాయణాలు లేవుమనకు! ఎన్ని పిట్టకథల్ని చేర్చుకోలేదు! కావ్యపాత్రలమీద, కథమీద ఎన్నోరకాల విమర్శలు వచ్చాయి. కాలానుగుణంగా వ్యాఖ్యానించుకోవడమూ ఉంది. 'రామాయణ విషవక్షంలో రంగనాయకమ్మ హేతు విరుద్ధాంశాల నెన్నింటినో ఎత్తిచూపి విమర్శ చేసారు. అవి రచనలు, కావ్యాలు, మత గ్రంథాలు కాదు. సినిమాలను కూడా మత కళ్లద్దాలతో చూడటం, సినిమాల్లో పాటలు, మాటలు ఎలా రాయాలో, రాయకూడదో నిర్దేశించే ఉన్మాదంలోకి మునిగిపోయారు ఈ అనంత అజ్ఞాని. పురాణ పాత్రలను తీసుకుని ఆధునిక పాత్రలుగా మలచటం, నేటి నీతిని, ధర్మాన్ని బోధించడం ఎంతోకాలంగా ఉంది. కళాసాహిత్యా రంగంలోకి, సినిమారంగంలోకి ఈ మతతత్వ విద్వేషాలను తెచ్చే ప్రయత్నాన్ని ఈ అజ్ఞాని ద్వారా ఆరంభించారు సంఘీయులు. దీన్ని ఉన్మాద స్థాయికి తీసుకెళ్లాడు అతను.

ఇంతకీ, అనంతుడు తను పాటలు రాసి సొమ్ము చేసుకోవటానికి హిందూ మత ఆచారాలను, విశ్వాసాలను తుంగలో తొక్కి పాటలు రాసాడని ఈ విశ్వ హిందూ పరిషత్తే ఆందోళనలు చేసిందొకప్పుడు. "దిగు దిగు దిగు నాగా, దివ్యా సుందరినాగా" అని నాగదేవత పాటను ఐటెం సాంగ్‌గా రాసిన అనంతుడే ఇప్పుడు అరచికేకలు పెడుతున్నాడు. డబ్బులకోసం బూతు పాటలు రాసి, ధర్మం కోసం ద్వేషం రెచ్చగొట్టటం అంటే ఇదే మరి! సినిమాల్లో ఎన్నో పౌరాణిక పాత్రలను ధరించి కష్టుడంటే, రాముడంటే ఇతడేనన్న భావాన్ని కలిగించిన ఎన్టీ రామారావు ముస్లిం పాత్రలనూ పోషించి ఎన్నో ప్రశంసలందుకున్నారు. 'అందరికీ ఒక్కడే దేవుడు, కొందరికి రాముడు, కొందరికి రహీము, ఏ పేరున పిలిచినా దేవుడొక్కడే' అని పాటల్లో మత సామరస్యాన్ని, 'మానవుడే మహనీయుడు' అంటూ మానవశక్తిని ఉన్నతంగా వినిపించిన చిత్రసీమలో ఇంత విద్వేష విషాన్ని చిమ్మటం సహించరానిది. కర్ణుని గొప్పవానిగా చూపటమే హిందూ మతానికి ముప్పును తీసుకొస్తుందని, సినీ పరిశ్రమలో ఉన్న ఇతర మతస్తుల వల్ల అపచారం ఏర్పడుతుందన్న ప్రచారం అజ్ఞానికే చేతనయ్యేపని. 'భారతీయులందరూ నా సహోదరులు' అన్న మన ప్రతిజ్ఞా పాదం అర్థాన్ని రచయితకు అర్థం చేయించవలసే ఉన్నది. జాతి మత భేదాలు లేక సృజనశీలతతో నిర్మించుకున్నదే సినీ పరిశ్రమ. ఆ పరిశ్రమే శ్రీరాంనూ నిలబెట్టింది కూడా.

పురాణేతిహాసాల కథలను, చిత్రాలను, పాత్రలను కుల, మతాలకతీతంగా ఆదరించి ఆస్వాదించినవాళ్లు తెలుగు ప్రజలు. ఇప్పుడు ఆ ప్రజల్లో చిచ్చురేపే విధంగా అనంతుడు ప్రసంగించడం ఆక్షేపణీయం. ఆయన ఏ ప్రయో జనాలు ఆశించి ఇందుకు పూనుకున్నాడో ప్రజలు అర్థం చేసుకుంటారు "మతములన్నియు మాసిపోవును జ్ఞానమన్నది నిలిచి వెలుగును" అన్న గురజాడ నినాదం నిజమై నిలబడుతుంది. కళా సజనలోకి కళంకిత వాదనలు తేవడాన్ని, కల్మషాలు పులమడాన్ని కళారంగం సహించదు.

సంపాదకీయం

బీజేపీ హఠావో.. ఢిల్లీ బచావో.. తీర్పు ఎటు?



తెలకపల్లి రవి

దేశ రాజధాని మాత్రమే గాక బీజేపీ భవిష్యత్తు అంచనాలపై తీవ్ర ప్రభావం చూపే ఢిల్లీ శాసనసభ ఎన్నికలు రానే వచ్చాయి.ఫిబ్రవరి 5న ఎన్నికలు, 8న ఫలితాల ప్రకటన ఎలా వుంటుందనే దానిపై దేశమంతా ప్రత్యే కాసక్తిగా ఎదురు చూస్తుంది. ఢిల్లీ రాజధాని మాత్రమే గాక వివిధ రాజకీయ శక్తుల మధ్య పోరాటంలో ఒక కీలక పాత్ర వహిస్తుంది.దీర్ఘకాలం పాటు బీజేపీ పట్టులో వుండి తర్వాత కాంగ్రెస్ హాట్రిక్‌లు చూసి ఆ పైన శాసనసభ వరకూ ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) కంచుకోటగా కనిపించిన ఢిల్లీ పయనం ఎటు? స్థానికంగానే గాక దేశ రాజకీయాల్లోనే కొత్త మలుపుగా ఏర్పడిన కొద్దికాలంలోనే అధికార పార్టీగా మారి ఆ పైన పంజాబ్‌కూ విస్తరించిన తొలి ప్రాంతీయ పార్టీగా ఆప్ ఇక్కడ తన పట్టు నిలబెట్టుకుంటుందా? ఒక దశలో జాతీయ ప్రత్యామ్నాయంగా ప్రచారమై తర్వాత సిబిఐ,ఈడి కేసులలో వరుసగా సవాళ్లనెదుర్కొని పదవిని కూడా వదులుకున్న అరవింద్ కేజ్రీవాల్ ఇతర నాయకుల ప్రభావం ఇప్పుడెలా వుంటుంది? కేంద్ర పాలిత ప్రాంతంగా వుంటూనే రాష్ట్ర హోదా పొందిన ప్రత్యేక రాజ్యాంగ నిబంధనల కింద అటు మోడీ ప్రభుత్వ చెలగాటాలకు కొట్టుమిట్టాడే ఎన్‌ఆర్‌సిడి (నేషనల్ క్యాపిటల్ రీజియన్) ప్రతిపత్తి నిలబడుతుందా?ఈ కాలంలో సుప్రీంకోర్టు ఇచ్చిన స్పష్టమైన తీర్పుల స్ఫూర్తి నిలబడేలా ప్రజలతీర్పు రావడానికి ఏం చేయాలి? ఇవన్నీ ఈ ఎన్నికల్లో కీలక ప్రశ్నలుగా వున్నాయి.

'ఆప్' తొలి అడుగులు

1952లో ఏర్పడిన ఢిల్లీ అసెంబ్లీ అనేక మలుపులు చూసింది. 1956లో దాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా నేరుగా రాష్ట్రపతి ఆధ్వర్యంలోకి మార్చారు. మంత్రివర్గాన్ని, శాసనసభను రద్దు చేసి మునిసిపల్ కార్పొరేషన్‌గా చేశారు. పదేళ్ల తర్వాత 1966లో ఢిల్లీకి నిర్ణయాధికారాలు లేని మెట్రోపాలిటన్ కౌన్సిల్‌గా మార్చారు.ఆ కౌన్సిల్‌గా వున్నంత కాలం అప్పటి జనసంఘం, బీజేపీ/ఆరెస్సెస్‌ల ఆధిపత్యమే నడుస్తుండేది. వాజ్‌పేయి, రాజేశ్ ఖన్నా, సిఎం స్టీఫెన్ వంటి హేమాహేమీలు పోటీ చేస్తుండేవారు. 1991లో 69వ రాజ్యాంగసవరణ ద్వారా మళ్లీ అసెంబ్లీని తీసుకురావడమే గాక ఎన్‌ఆర్‌సిడిగా ప్రకటించారు.1993 ఎన్నికల్లో బీజేపీ గెలిచాక మదన్‌లాల్ ఖురానా,తర్వాత సాహెబ్ సింగ్‌వర్మ బీజేపీ ముఖ్యమంత్రులుగా పనిచేశారు. ఖురానా అవినీతి ఆరోపణల్లో దిగిపోయాక వచ్చిన వర్మ కూడా విమర్శలపాలు కావడంతో ఆఖరి అస్త్రంగా సుష్మా స్వరాజ్‌ను కొద్ది వారాల ముఖ్యమంత్రిని చేశారు. కానీ కాంగ్రెస్ సీనియర్ షీలాదీక్షిత్ ముందు స్వరాజ్ తట్టుకోలేకపోయారు. 1998 నుంచి 2013 వరకూ షీలా దీక్షిత్ అప్రతిహతంగా పాలించారు. అయితే కాంగ్రెస్ యూపీఏ2 వరస కుంభకోణాల కేసుల్లో చిక్కిపోయాక అంతా తలకిందులైంది. సరిగ్గా ఆ అవినీతిపై పోరాటంలో అన్నా హజారేతో కలసి పనిచేసిన అరవింద్ కేజ్రీవాల్ మరికొందరు విద్యాధిక నేతలతో మాజీ అధికారులతో కలసి ఆప్ స్థాపించారు. పౌర సమస్యల పరిష్కారం,అవినీతి నిర్మూలన వాగ్దానాలతో ప్రజల్లోకి చొచ్చుకెళ్లారు.2013లో 28 స్థానాలతో ఆప్ పెద్దపార్టీగా వచ్చింది. కాంగ్రెస్ 13స్థానాలు పొందింది. కాంగ్రెస్ ఆలస్యంగా ఆప్‌కు మద్దతు ప్రకటించినా కేజ్రీవాల్ 49 రోజుల్లోనే రాజీనామా చేశారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించినా 2015లో జరిగిన శాసనసభ ఎన్నికలకు వచ్చేసరికి ఆప్ 70లో 67 గెలుచుకుని విజయదుందుభి మోగించింది. కాంగ్రెస్‌కు ఒక్కస్థానం రాకపోగా బీజేపీ మూడుసీట్లకు పరిమితమైంది. ఆప్ పాలనలో కొన్నిలోపాలు, అస్పష్టతలు వున్నా బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయంగా ప్రజల మద్దతుతో 2020లో మళ్లీ విజయం సాధించగలిగింది. కాకపోతే ఈసారి 62 స్థానాలకు పరిమితమవగా బీజేపీ బలం పెంచుకుంది. కాంగ్రెస్ ఎంత హడావుడి చేసినా ప్రజల ఆదరణ పొందలేకపోయింది. 2019లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం అధిక్యత సాధించిన బీజేపీ మరీ ముఖ్యంగా ప్రధాని మోడీ ఢిల్లీని కైవసం చేసుకోవడానికి అన్ని అస్త్రాలు ప్రయోగించారు.పైగా ఈలోగా 2022లో పంజాబ్‌లోనూ ఆప్ అధికారంలోకి రావడం వారికి మరింత కంటగింపుగా మారింది.

రాజ్యాంగ ప్రతిపత్తికే చేటు

రాజ్యాంగ రీత్యా ఢిల్లీ ప్రత్యేక పరిస్థితిని ఆసరా చేసుకుని, లెఫ్టినెంట్ గవర్నర్‌ను అడ్డం పెట్టుకుని అడుగడుగునా ఆటంకాలు కల్పిస్తూ వేధించారు. పోలీసుల పహారా నుంచి గాలింపుల దాకా, ఆర్థికాంశాలు కీలక నియామకాల దాకా ప్రతిదీ లెఫ్టినెంట్ గవర్నర్ చేస్తుంటే ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రి నిస్సహాయంగా చూడవలసిన పరిస్థితి కల్పించారు. దీనిపై ఆప్ ప్రభుత్వం కేసువేయగా సుప్రీంకోర్టు కూడా రాజ్యాంగ ప్రకారం భద్రత, పర్యావరణం వంటివి తప్ప మిగిలిన విషయాల్లో ఢిల్లీ ప్రభుత్వమే నిర్ణయాత్మకమని తీర్పు చెప్పింది. దాంతో 2023మార్చిలో రాజ్యాంగాన్ని మార్చి ప్రభుత్వమంటే లెఫ్టినెంట్ గవర్నర్ మాత్రమేనన్నట్టు సవరించారు. దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని కేజ్రీవాల్‌తో సహా అనేకమందిని అరెస్టు చేసి కేంద్ర పెత్తనమే సాగించారు. దేశానికి ప్రతీకగా భిన్న రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రజలతో కూడిన ఢిల్లీని వారి తీర్పు ప్రకారం గాక తమ రాజ కీయ అవసరాల మేరకు పాలించాలనుకోవడం మోడీ సర్కారు నిరంకుశత్వానికి నిదర్శనం.లిక్కర్‌స్కాం అనేది ఆధారంగా తీసుకుని ఆప్ నాయకత్వం కూడా ఒక దశలో మోడీ పట్ల మెతకదనం, కాశ్మీర్ 370 రద్దుకు మద్దతు వంటి పనులు చేసినా వీటన్నిటి తర్వాత కండ్లు తెరవక తప్పలేదు. ఇండియా వేదికలో భాగస్వామి కావడం తత్ఫలితమే గానీ ఢిల్లీ ఎన్నికల్లో మాత్రం ఆప్‌కూ కాంగ్రెస్‌కు లేక మరే భాగస్వాములకూ అవగాహన సర్దుబాటు జరగలేదు. ఈ సమయంలో బీజేపీని ఓడించడం,ఢిల్లీ రాజ్యాంగ ప్రతిపత్తిని కాపాడుకోవడం ప్రధాన లక్ష్యం గనక అందుకు కారణమైన బీజేపీని ఓడించడం కీలకంగా ముందుకొచ్చింది.ఎన్నికల పోరాటం కూడా దానికి తగినట్టే జరగనుంది.



మూడు పార్టీల మధ్య పోటీ అంటున్నా వాస్తవంలో బీజేపీ, ఆప్‌లకే కీలక సమరం జరుగుతుందని పరిశీలకులు భావిస్తున్నారు.2020 ఎన్నికల్లో ఆప్‌కు 53.57శాతం, బీజేపీకి 38.5శాతం ఓట్లు రాగా కాంగ్రెస్‌కు కేవలం 4.26శాతంఓట్లు మాత్రమే వచ్చాయి.బీజేపీ లోక్‌సభ స్థానాలన్నీ తెచ్చుకున్నా గతంలో వలెనే శాసనసభలో అది నిలుస్తుందా అనేది ప్రశ్నగా వుంది. ఇండియా వేదిక పార్టీల మధ్య తేడాలున్నా బీజేపీ ఏకపక్ష దాడి నుంచి ఢిల్లీ రాజ్యాంగ స్థానాన్ని కాపాడుకోవాలన్న దానిపై ఏకాభిప్రాయంవుంది. సీపీఐ(ఎం) సహా వామపక్షాలు గట్టిగా అదే వైఖరి ప్రకటించాయి. సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ(ఎంఎల్) చెరో రెండు స్థానాల్లో పోటీ చేస్తూ మిగిలిన సీట్లలో బీజేపీని ఓడించేవారికే మద్దతు నివ్వాలని ప్రకటించాయి.సమాజ్‌వాది పార్టీ, టీఎంసీ ఆప్‌ను బలపరుస్తున్నాయి.

పోటీ ఇద్దరి మధ్యేనా?

మూడు పార్టీల మధ్య పోటీ అంటున్నా వాస్తవంలో బీజేపీ, ఆప్‌లకే కీలక సమరం జరుగుతుందని పరిశీలకులు భావిస్తున్నారు.2020 ఎన్నికల్లో ఆప్‌కు 53.57శాతం, బీజేపీకి 38.5శాతం ఓట్లు రాగా కాంగ్రెస్‌కు కేవలం 4.26శాతంఓట్లు మాత్రమే వచ్చాయి.బీజేపీ లోక్‌సభ స్థానాలన్నీ తెచ్చుకున్నా గతంలో వలెనే శాసనసభలో అది నిలుస్తుందా అనేది ప్రశ్నగా వుంది. ఇండియా వేదిక పార్టీల మధ్య తేడాలున్నా బీజేపీ ఏకపక్ష దాడి నుంచి ఢిల్లీ రాజ్యాంగ స్థానాన్ని కాపాడుకోవాలన్న దానిపై ఏకాభిప్రాయంవుంది. సీపీఐ(ఎం) సహా వామపక్షాలు గట్టిగా అదే వైఖరి ప్రకటించాయి. సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ(ఎంఎల్) చెరో రెండు స్థానాల్లో పోటీ చేస్తూ మిగిలిన సీట్లలో బీజేపీని ఓడించేవారికే మద్దతు నివ్వాలని ప్రకటించాయి.సమాజ్‌వాది పార్టీ, టీఎంసీ ఆప్‌ను బలపరుస్తున్నాయి. కాంగ్రెస్ విషయానికొస్తే ఇటీవల హర్యానా శాసనసభ ఎన్నికల్లో ఆప్‌కు కనీస స్థానాలు కేటాయించేందుకు నిరాకరించింది. తర్వాత మహారాష్ట్రలోనూ అంతే జరిగింది. తాను బలంగా వున్న చోట్ల ఇతర పార్టీలతో సీట్ల సర్దుబాటు చేసుకోకుండా తను లేనిచోట మాత్రం ఇతరులు ఇవ్వాలని కోరుకోవడం ఇండియాలో భాగస్వాములు ఆమోదించడం లేదు. ఢిల్లీ వరకైతే ఆప్, కాంగ్రెస్ రెండూ ఒంటరిగానే వెళతామని గతంలోనే ప్రకటించాయి. ఆప్ కూడా అదే కోరుతున్నట్టు కనిపిస్తుంది.ఎందుకంటే ఢిల్లీలో సిక్కులపై సాగిన మారణకాండ బీజేపీ అమ్ములపొదిలో నిరంతరం అస్త్రంగా వుంది.ఇప్పటికీ ఆ పార్టీ నాయకులు కాంగ్రెస్‌పై వ్యాఖ్యలతో చర్చ దారి తప్పించే ప్రయత్నం చేస్తూనే వుంటారు.తాజాగా బీజేపీ మాజీ ఎంపీ రమేష్ బిదూరి ఢిల్లీ రోడ్ల మరమ్మతులను ప్రియాంక బుగ్గలతో పోలుస్తూ మాట్లాడ్డం,ప్రస్తుత ముఖ్యమంత్రి అతిశీ తండ్రులను మారుస్తుందని చవకబారు వ్యాఖ్యలు చేయడం ఇందులో భాగమే. అతిశీని అధికార నివాసం శేష్ మహల్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్న బీజేపీ నేతలు దానిపైనే పెద్ద ఎన్నికల చర్చ దారి తప్పించాలని పాచికలు వేస్తున్నారు. కానీ కాంగ్రెస్, బీజేపీ తమ ముఖ్యమంత్రి అభ్యర్థులెవరో చెప్పలేదు గానీ ఆప్ మాత్రం మళ్లీ కేజ్రీవాల్‌ను తేవాలన్నదే నినాదంగా చేసుకున్నది.ఇందుకోసం పంజాబ్ ముఖ్యమంత్రి మాన్‌తో సహా డెబ్బయి మంది ఆప్ ఎమ్మెల్యేలు వచ్చి ప్రచారం చేస్తున్నారు. పొలిటికల్ స్టార్టప్ లాంటి ఆప్ పదేండ్ల తర్వాత ఎలా తన స్థానం కాపాడుకుంటుందన్నదే అందరూ ఆసక్తిగా చూస్తున్న విషయం. 2027లో పంజాబ్ ఎన్నికలు వస్తాయి గనక ఢిల్లీని పోగొట్టుకుంటే అక్కడా నష్టం జరుగుతుందనే అంచనా ఆప్‌లో వుంది. వరుస ఆరోపణల తర్వాత ఆ పార్టీ కూడా కొంత ఆత్మ విమర్శ చేసుకుంటుందా లేదా అన్నది ముఖ్యమైన విషయం. ఊగిసలాటలు,అస్పష్టతలు, తొందరపాటు ప్రకటనలు మేలు చేయవని కూడా ఈ కాలంలో తేలిపోయింది.

పథకాలు, వాగ్దానాలు

కేంద్ర నిరంకుశత్వం, కేసులతో వేధింపులు, తమ సంక్షేమ పథకాలు కీలకంగా ఆప్ ప్రచారం చేసు కుంటుండటమే గాక కొత్త పథకాలు కూడా ప్రకటిస్తున్నది. విద్యుత్ నీటి సరఫరా, ఆరోగ్యం విద్య మహిళల బస్సు ప్రయాణం ఉచితమన్నది వారి వాగ్దానం. దానికి తోడు ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన కింద ప్రతి మహిళలకు రూ.2100 కోట్ల సహాయం చేస్తామంటున్నది. బీజేపీ కూడా ఉచిత విద్యుత్ లాటి వాగ్దానాలు చేయడంతో పాటు తాము వస్తే ఆప్ పథకాలను రద్దు చేస్తామన్నది ప్రచారం మాత్రమేనని ఖండిస్తున్నది. ఢిల్లీ ప్రచార భారం భుజాలపై వేసుకున్న ప్రధాని మోడీ మాట్లాడుతూ అన్నీ కొనసాగిస్తామని భరోసాతో ప్రచారం చేస్తున్నారు.కాంగ్రెస్ ప్యారీదీదీ యోజన, జీవన్‌రేఖ పేరిట రూ.2500 ఇస్తానంటున్నది.ఇలా మొత్తంపైన వాగ్దానాలు పథకాల పోటీగా ఎన్నికలు నడుస్తున్నాయి. వాస్తవానికి మీడియాను చూసేవారికి ఎవరికైనా ఢిల్లీ కాలుష్యం గురించిన చర్చ తీర్పులు కనిపిస్తాయి. ధరల భారం, నిరుద్యోగం వంటివాటితో పాటు దేశ రాజధానిగా మౌలిక సమస్యలు,తీవ్ర కాలుష్యంపై తక్కువగా చర్చ నడుస్తుండడం ఒక విచిత్రం.బీజేపీ అయితే వీటితో బంగ్లాశరణార్థులు రోహింగ్యాల రాకను ప్రధాన సమస్యగా మతపరమైన అంశాలను ముందుకు తెస్తున్నది. ఓటర్ల జాబితాలోనూ మైనార్టీలను పెద్దఎత్తున తొలగించారనే ఆరోపణలున్నాయి. అందుకే ఎన్నికల సంఘం వాటిని తిరస్కరించేందుకు చాలా పెనుగులాడింది.ఈ మధ్యనే రైతుల ఆందోళన పట్ల ఎలా వ్యవహరించారో చూశాం.ఢిల్లీ రాజధాని కావడంతో అక్కడ నిరసనలు తెలిపే హక్కు వంటివాటిని కాపాడుకోవడానికి కూడా బీజేపీని ఓడించాలని ప్రతిపక్షాలు చెబుతున్నాయి. స్వయంగా మోడీనే ప్రచార బాధ్యత మీద వేసుకోవడంతో పాటు ఎనిమిది నెలలుగా ఇందుకు సన్నాహాలు చేస్తున్నారు. 'ఆప్‌ను ఇక సహించం, మార్పు సాధిస్తాం' అన్న ఎన్నికల నినాదం ఎత్తుకున్నారు. ఇన్నిటి మధ్యనా ప్రజల తీర్పు ఎలా వుంటుందో చూడాల్సిందే. ■

'అలిశెట్టి' అగ్నిగీతాల్లో 'స్త్రీ'



శోభ రమేష్
8978656327

పొట్టి పొట్టి కవితలతో గట్టిగా చెప్పినవాడు. తన బలం కవిత్వమే అని నమ్మినవాడు. దాన్నే ఆయుధంగా మలుచుకున్నవాడు. ప్రజల కోసం భౌతికవాదంతో సాగినవాడు. ఆయనే...అలిశెట్టి ప్రభాకర్. ఒకవైపు అనుభూతి కవిత్వం, మరోవైపు వ్యక్తివాద కవిత్వం పోటీపడుతున్న సమయం. ఇంకోవైపు అభ్యుదయ కవిత్వం, విప్లవ కవిత్వం పుట్టుకొచ్చిన సందర్భం. ప్రజలు పోరాటం చేస్తుంటే వాళ్ల కుటుంబాలు అనూహ్యమైన బాధలకు గురవుతున్న కాలం. అప్పుడే తగినంత భావశక్తి, సరైన భావజాలం ఉన్న కవిగా, అదే భావంతో పాఠకులకు సులభంగా అందించే సంక్షిప్త భాషా పటిమ కలిగిన కవిగా చరిత్రలో నిలిచాడు అలిశెట్టి. సుప్రసిద్ధ గాయని బెల్లి లలితను పద్నాలుగు ముక్కలు చేసినప్పుడు...గొంతు కొస్తే/పాట ఆగిపోదు/అది-ముక్తకంఠం/ గొలుసు వేస్తే/ పోరు నిలిచిపోదు/ అది-ప్రజాయుద్ధం అని రాజ్యంపై అక్షర బాణాలు సంధించిన యోధుడు.



అలిశెట్టి ప్రభాకర్ పాత కరీంనగర్ జిల్లా జగిత్యాలవాసి. జన్మించింది 1956 జనవరి 12. ప్రారంభంలో బొమ్మలు వేస్తూ ఆర్టిస్టుగా ఎదిగాడు. జగిత్యాల సాహితీ మిత్రదీప్తి సంస్థ పరిచయంతో కవిత్వ రంగంలోకి ప్రవేశించాడు.1974లో ఆంధ్రసచిత్ర వారపత్రిలో 'పరిష్కారం' మొదటి కవిత అచ్చయింది.తన కళ ప్రజల కోసమే అని చివరివరకు నమ్మినవాడు. ఎర్రపావురాలు(1978) మొదటి కవితా సంకలనం, మంటల జెండాలు, చురకలు(1979), రక్తరేఖ (1985), ఎన్నికల ఎండమావి (1989), సంక్షోభ గీతం (1990), సిటీలైఫ్ (1992) ముద్రించిన కవిత్వ సంకలనాలు ప్రభంజనాన్ని సృష్టించాయి. స్త్రీల కోణంలో అలిశెట్టి రాసిన కవితలు అనేక చర్చోపచర్చలకు వేదికయ్యాయి.

అలిశెట్టికి జీవితం పట్ల, సమాజం పట్ల కచ్చితమైన భౌతికవాద దృక్పథం ఉన్నది.చిన్న కవితలతో ఎంత ముద్ర వేశాడో పెద్ద కవితలు కూడా అంతే బాగా రాశాడు. నేలమీద పురుగులతో సమానమైన, ఆకాశంలో సగ భాగమైన స్త్రీల పట్ల ఆయనకు చాలా గౌరవం. అనేక కవితల్లో వారి గురించి రాశాడు. "వేశ్య"కవిత తెలియని కవి ఉండడంటే అతిశయోక్తి కాదు.

తను శవమై/ఒకరికి వశమై
తనువు పుండై-ఒకడికి పండై
ఎప్పుడూ ఏడారై-ఎందరికో ఒయాసిసై

వేశ్య దుర్భర జీవితాన్ని, హింసను చిన్న కవితలతో చెప్పిన పద్ధతి మనకు కన్నీళ్లు తెప్పించక మానదు.

వెల(యాలు)మరో కవితలో భిన్నంగా వేశ్యలు కన్నుగొట్టి రమ్మన్నా/గుండె బిగబట్టుకు సాగిపోయేవాడు/సాధారణంగా సామాన్యుడు అని అన్నాడు.ఆమె యవ్వనం రాయని వీలునామాలో ఆమెది ఉరి బిగించుకున్న జీవితం అంటాడు.అంటే విలవిల్లాడటం.మూగబోయిన గొంతైనా పాడక తప్పదంటూ రోజుకో పదిమంది కీచకులకి స్వాగతం పలకటంగా అభివర్ణించిన తీరులో ఒక మనోవేదన కూడా కనిపిస్తుంది. జల్సాల కోసం కష్టం లేకుండా అన్ని అవసరాలు తీర్చుకోడానికి కట్నం పేరుతో స్త్రీలను హింసించే అంధకారాన్ని తొలగించడానికి ఒక ప్రయత్నం మొదలవుతుందని స్త్రీ చైతన్యాన్ని వ్యక్తపరుస్తాడు."పోరాటం" కవితలో. అంతే కాకుండా రాతి హృదయంలో ఇమడని కన్నీటి పువ్వులా, జాతి గుండెల్లో రగిలే శోక దీపంలా ఎవరమ్మా నువ్వు? అని ప్రశ్నించాడు.

విషాదం మూర్తీభవించిన జీవితం స్త్రీది.అభాగిని,మానభంగం శీర్షిక కింద, ర్యాగింగ్ పేరుతో, అక్షరాన్ని వివస్త్రను చేసే అశ్లీల సాహిత్యం, మోడల్ పేరుతో విష సంస్కృతి, అందాల పోటీ ప్రలోభం, కట్నం పేరుతో హింస, నగ్నంగా స్త్రీలను ఊరేగించిన అంశం, బ్లూఫిల్మ్‌లో కామకేళి చిత్రాలు, ఇలా అనేక రకాలుగా స్త్రీలకు ఏడుపులే ఉన్నాయి.

ఆధునాతనంగా ఎదగాలని గొప్పలకు పోయే ఈ నాగరిక ప్రపంచంలో అశ్రు బిందువు నుంచి స్త్రీకి విముక్తి లేదంటాడు అలిశెట్టి. బాధను వ్యక్తపరిచి ఊరుకోడు.కన్నీరు సముద్రంగా మార్చి, సముద్రమంత ఆవేశంతో ఉద్యమాలు చేస్తే గాని దోపిడీ దౌర్జన్యాలతో కూడిన భూభాగాన్ని ముంచెత్తలేవని ప్రోత్సహిస్తాడు.స్త్రీల బాధ్యతను గుర్తుచేస్తాడు. "విషాదం సాక్ష్యత్కారం" కవితలో. లైంగికదాడి చేసి లేదా పెండ్లి చేసుకుంటానని అమ్మాయిని శారీరకంగా వాడుకుని మొహం చాటేస్తారు.ఇలాంటి వాటిని కొన్నిచోట్ల పెద్దమనుషుల్లో పెట్టి పంచాయితీ చేసి కొంత డబ్బులిచ్చే ప్రయత్నం చేస్తారు.ఇలాంటి వాటిని ఖండిస్తూ శీలం విలువను కొలవడానికి,కుమిలి పోడానికి హృదయం లేదంటాడు కవి.స్త్రీకి జరిగిన అన్యాయం గురించి ఆలోచించకుండా, జరగడానికి ఏర్పడిన పరిస్థితులు గమనించకుండా,డబ్బుతో ముడిపెట్టి చూడటం బాధపెట్టే అంశం."వీరుడితో కరచాలం"అనే కవితలో ప్రస్తావించబడింది.అందుకే అశ్రుకావ్యం కవితలో ఆమె నెత్తుటి గాయాల సంపుటి/రగిలే బాధల కుంపటి అని నిర్ధారించాడు. అంతేగాక

కర్కశ పాదాల్ని మోస్తూ/కఠోర తపస్సులా-
శకలాలుగా మిగిలిన రాత్రుళ్లపై
శవాసనం వేసే విషాద భరిత చిత్రంలా- ఆమె అగ్ని సముద్రం మీదే అందాల పడవ అంటాడు.

ముక్కుమొహం తెలియని వ్యక్తి పెండ్లి చేసుకోడానికి రావటం, కట్నం డిమాండ్ చెయ్యడం.అలాంటి అగాతకున్ని సునిశితంగా పరిశీలించాలనే ధోరణి కనిపిస్తుంది.మార్కెట్ లో వస్తువును తీసుకున్నప్పుడు రేటు కట్టడం లాంటిది.ఖరీదు కట్టి తెచ్చుకున్న వస్తువు మనింటికే వస్తుంది. ఉపయోగించుకుంటాం.కానీ ఇక్కడ రివర్స్‌గా కొనసాగుతుంది.అమ్మాయే డబ్బులిచ్చి అబ్బాయి ఇంటికి వెళ్లి వెట్టిచాకిరి చేస్తుంది. స్త్రీలు వేశ్యాగృహాల్లో బంధించబడుతున్నారు.వెండి తెర అనే విషపు కోరల్లో చిక్కుకుంటున్నారు.అనేక రకాలుగా వెలివేయబడుతున్నారు.మీరెవరంటూ అబలలా?అందాల రాశులా?చిలుకలా?సీతాకోకచిలుకలా?ఏదో తేల్చుకొమ్మనట్టుగా ఉంటుంది ఈ కవిత.

ఒక్క స్త్రీపై సమూహపు లైంగికదాడులను పిచ్చివాళ్ల సామూహిక విధ్వంసకాండగా చెపుతూ నీచమైన ప్రపంచం అంటాడు.అందుకే మహిళా కళాశాలలో గానీ, హాస్టల్ గదిలో గానీ తాత్కాలికంగానైనా కత్తుల్లా మెరవాలంటాడు. స్త్రీలు తమను తాము రక్షించుకోవాలనే సందేశం ఇందులో కనిపిస్తుంది.నీతి లేకుండా పోయింది. ప్రేమలేదు.శరీరాన్ని కాంక్షిస్తున్నారు. ఆత్మసౌందర్యం వదిలి,ఆభరణాలను ఒలుచుకుంటున్నారు. ఇంద్ర ధనుస్సులా కలలుకన్న స్త్రీల జీవితాలు, కల్యాణమంటపాల మంటల్లోనే బూడిదవుతున్నాయి. ఇంత దుర్మార్గం కూడా సర్వసాధారణంగా మారిందంటాడు.

అలిశెట్టి యువకుడిగా ఎదిగే సమయంలోనే సిరిసిల్ల, జగిత్యాలలో రైతాంగ పోరాటాలు జరిగాయి. భావ కుడుగా,కళాత్మక ద్రష్ట ప్రభాకర్ కవిగా, చిత్రకా రుడిగా ముందుకు రావటం,ఈ రైతాంగం పోరాటాల కాలానికి కుంచెకు కొత్త దృష్టిని, పదునునూ నిత్యనూతన చైతన్యం అందించాయి. తానొక నిబద్ధత, పీడిత ప్రజల రచయితగా ప్రకటించుకున్నాడు. పీడిత ప్రజల్లోనూ అత్యంత పీడితులు స్త్రీలుగా గుర్తించాడు.ఈ వ్యవస్థ మీద కసితో ఆయన పదునెక్కిన కవిత్వం మనల్ని నిరంతరం స్పృశిస్తుంది.

(జనవరి 12 అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి)

రేసు కారు కారు రేసు



జంధ్యాల రఘుబాబు
9849753298

నేటి రాజకీయాలు, అది కేంద్రమైనా ఏ రాష్ట్రమైనా సరే కారు రేసులా స్పీడుగా ఉన్నాయి. ఉదయం లేచిన దగ్గరినుండి నిద్రపట్టినా పట్టకున్నా రాత్రి పడుకునేవరకు మొత్తం రాజకీయమే. భారతంలో ధృతరాష్ట్రులవారి వందమంది కొడుకులను, వారు చేస్తున్న పనులను చూసిన వ్యాసులవారు "గతకాలము మేలు వచ్చు కాలముకంటెన్" అన్నారట. నేనేమీ సినిమాలకు పాటలు రాయను కాబట్టి పాండవులు మంచోళ్లా, కౌరవులు మంచోళ్లా అన్న విషయానికి పోయి ఒకరి ప్రాపకం కోసం పాకులాడే ఉద్దేశ్యం లేనేలేదు. అప్పటి రాజకీయాలను మాత్రమే తీసుకొని అప్పటి రాజులు కూడా ప్రతిపక్ష నాయకులను ఎలా వేధించారు అన్న విషయం కొద్దిగా చూడ మని చెబుతున్నానంతే. గతం గతహ్హ అని వదిలేయమన్నారు పెద్దలు అని పెద్దలు చెప్పగా విన్నాము. గతాన్ని వదిలేస్తే ఎలా, రోజూ దాన్ని గుర్తు తెచ్చుకొని ప్రస్తుతానికి అన్వయిం చకపోతే ఇంకేమైనా ఉందా, ప్రాణా లు అంటే రాజకీయ ప్రాణాలు పోవూ? పోతాయి తప్పక పోతాయి ఎందుకంటే అధికారంలో ఉన్నవాళ్లు, అధికారంలోకి రావాలనుకునేవాళ్లు, ప్రతిపక్షంలో ఉన్నవాళ్లు, కనీసం వచ్చేసారన్నా ప్రతిపక్షంలోకి రావాలనుకునేవాళ్లు ఇలా ఎవరైనా సరే రాజకీయ ప్రాణులైతే చాలు వాళ్లకు గతమే కావాలి. గతము తలచి వగచేకన్నా సౌఖ్యమే లేదు అని దేవదాసులా నిర్వీర్యమైపోయేవాళ్లు కాదు వీళ్లు. గతాన్ని పట్టుకొని ముందుకుపోయే వీరులు వీళ్లు.

పుచ్చలపల్లి సుందరయ్యగారు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు పార్లమెంటుకు వచ్చే ప్రధాని నెహ్రూతో పాటు మంత్రులు కూడా సుందరయ్యగారు వేసే ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం కోసం బాగా తయారై వచ్చేవారని విన్నాము. సుందరయ్యగారిని అంత గౌరవం గానూ చూసుకునేవారు. ఐక్యరాజ్య సమితికి విదేశీ వ్యవహారాలకోసం పంపే కమిటీకి ప్రతిపక్ష నాయకుడు వాజ్‌పేయి గారిని నాయకుడిగా వేసి పంపారు అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ. పనిలో పనిగా వాజ్‌పేయిగారికున్న అనారోగ్యం దృష్ట్యా అక్కడ చికిత్స కూడా చేయించారు ప్రధాని రాజీవ్. ఇప్పుడు అందరికీ అర్థమైపోయి ఉంటుంది ఇండియాకు భారత్‌కు తేడా. దేశభక్తి జపం చేసినా, మన సనాతన ధర్మాల గురించి మాట్లాడినా మంచిదే కాని రాజకీయాల్లో ఎప్పుడూ రేసులో పోతున్న కారులాగా ఇతర కార్లని దాటడం కాదు కొన్ని విలువల్ని ప్రజాస్వామ్యంలో పాటించే పాత సాంప్రదాయాల్ని కూడా గౌరవించాలి. మూడూ పాయింట్ సున్నా అనగానే ఎన్నో మంచిపనులు గుర్తుకు రావాలి అంతే తప్ప



ఒక్కసున్నా మాత్రమే గుర్తొస్తే ఏమిటి ప్రయోజనం చెప్పండి. ఆ లెక్కన జ్యోతిబసు ఐదుసార్లు ముఖ్యమంత్రిగా చేసి చూపించారు. ప్రధానిగా ఛాన్సు వచ్చినా వద్దన్నారు అంతే కాని ఒకటి పాయింట్ సున్నాతో మొదలు పెట్టి రేసులాగా చేయలేదు.

రేసులో పాల్గొనే కార్ల చోదకులకు వాహనాన్ని తోలడం బాగా వచ్చి ఉండాలి. అలాగే ప్రమాదాలు ఎదురైనా తప్పించుకోగల నేర్పు ఉండాలి. కార్లు తమని దాటిపోతున్నా తట్టుకోగల ఓర్పు మళ్లీ దాన్ని దాటడానికి సహనం ఉండాలి. క్రికెట్ మ్యాచుల్లా కార్ల రేసుల నిర్వాహకులతో సంబంధాలూ ఉండాలి. రేసు అయిపోయింది కప్పు వచ్చేసింది అని ఊపిరి పీల్చుకునే వీలుండదు. తరువాత దాని పర్యవసానాలను ఎదుర్కొనే శక్తీ ఉండాలి. అప్పుడే రేసుల్లోకి దిగాలి.

వేగానికి, వైరాగ్యానికి ఎప్పుడూ పడదు. గతము తలచి వగచేకన్నా సౌఖ్యమే లేదని దేవదాసు పాడతాడు సినిమాలో. వైరాగ్యంలో ఉన్న ఆ నాయకుడు అందరాని పొందుకన్నా అందమే లేదు ఆనందమే లేదు అనీ పాడతాడు. తిరిగి దాన్ని రాజకీయాలకు అన్వయిస్తే వైరాగ్యంలో ఉన్న ఆ నాయకుడు తిరిగి దాన్ని రాజకీయాలకు అన్వయిస్తే అధికారంలో ఉన్నవాళ్లు, అధికారం కోల్పోయినవాళ్లు, అది కావాలని ఆరాటపడేవాళ్లు అందరూ కారు రేసులో లాగా రోజూ ఉరుకులూ పరుగులే. అందనిదాన్ని, అందరానిదాన్ని వదులుకునే సమస్యే లేదు. అసలు రాజకీయాలే కాదండి సినిమాలు, సినిమా హీరోలు కూడా బాగా మారిపోయారు అని తెలుపు నలుపు, మూకీ సినిమాల కాలం నుండి పోలికలు ఇవ్వబోతారు కొందరు. వాటిలో నిజం లేకపోలేదు కాని పాతదాన్ని పాతగాను, కొత్తదాన్ని కొత్తగానూ చూడాలి. విలువలు అప్పటికి ఇప్పటికీ ఎప్పటికైనా ఉండాలి. అప్పుడే నిజంగా ప్రజలకు మేలు జరిగేది. గాంధీగారొస్తుంటే డబ్బులు, ఒంటిపైనున్న నగలు బంగారువైనా ఎలా ఇచ్చేశారో చెప్పి అప్పటి ప్రజలకీ ఇప్పటి ప్రజలకీ పోలికలు చేప్పేవాళ్లు, ఇప్పటి ప్రజలు కూడా రాజకీయ నాయకుల్లా మారారండీ ఎవరి సౌఖ్యం వారే చూసుకుంటున్నారు అనేవాళ్లూ ఉన్నారు.

కార్లలో, నాయకుల్లో ఎలా రకరకాలు ఉన్నాయో ప్రజల్లో కూడా అలాగే ఉంటారు కాని అందరు ప్రజలూ అలా ఉండరు. ఇప్పుడొస్తున్న సినిమాలను తీసుకున్నా అవి రేసు గుర్రాల్లా, రేసు కార్లలా తయారైనాయి. సినిమాలు వసూలు చేస్తున్న డబ్బుపైనే ధ్యాస. అందుకు ప్రభుత్వాలు కూడా సహకరించి టికెట్ల ఖరీదును మీకిష్టమొచ్చినట్టు పెట్టుకోండని చెప్పడం చూస్తే ప్రభుత్వాల్ని నడిపే ఇంధనమేదో, అధికారంలోకి రావడానికని ఎన్నికల్లో పెట్టే ఖర్చుకీ లెక్కలు రెక్కలు కట్టుకొని ఎలా వస్తున్నాయో తెలిసిపోతుంది. అక్కడక్కడా, అప్పుడప్పుడూ జరిగే కారురేసుల్ని ఒకేసారి జమిలిగా పెద్ద రేసు పెడితే ఏ కారు ముందుకు దూసుకుపోతుందో మరి!!

ఇప్పుడు రాజకీయ జనాలకు కావలసింది గేం ఛేంజర్ రాజకీయాలే.ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చేవి కాదు. ■

26న నాలుగు పథకాలు

రైతుభరోసా, తెల్లరేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, భూమిలేని పేదలకు లబ్ది

- గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో కూర్చినా, ఆర్థికభారమైనా..
- అన్ని పథకాలనూ పూర్తిస్థాయిలో అమలు చేస్తాం
- మోడల్ హౌస్ ద్వారా ఇందిరమ్మ ఇంటి నిర్మాణంపై అవగాహన
- కోర్టు పరిధిలో ఇండ్లస్థలాల అంశం.. జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబద్దాం
- ఫిబ్రవరి చివరిలోపు 'భూ భారతి': ఖమ్మంలో విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

75వ గణతంత్ర దినోత్సవం రోజున గ్రామసభల్లో చర్చించి రాష్ట్రవ్యాప్తంగా నాలుగు పథకాలను ఒకేసారి అమలు చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రైతుభరోసా, భూమిలేని నిరుపేదలకు రూ.12వేలు, తెల్లరేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను జనవరి 26న ఆచరణలోకి తెస్తామని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని పీకల్లోతూ అప్పుల్లో కూర్చిందని, అయినప్పటికీ ఇచ్చిన హామీ మేరకు అన్ని పథకాలనూ పూర్తిస్థాయిలో అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఖమ్మంలోని ఎస్ఆర్ కన్వెన్షన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇండ్ల స్థలాలపై మాట్లాడలేనని, జర్నలిస్టులకు మిగిలిన సౌకర్యాలను సమకూర్చేందుకు కృషి చేస్తానన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. నాటి ప్రభుత్వం ఎన్నికలున్నప్పుడే తెల్లరేషన్‌కార్డులు ఇచ్చేదన్నారు. మొన్న ముఖ్యమంత్రితో జరిగిన కలెక్టర్ల సమావేశంలో పేర్కొన్న మేరకు జనవరి 26వ తేదీ నుంచి అర్హులకు తెల్లరేషన్‌కార్డులు ఇస్తామని చెప్పారు. గత ప్రభుత్వం ఎకరానికి రూ.5వేల చొప్పున రైతుబంధు ఇస్తే తమ ప్రభుత్వం రూ.6వేల చొప్పున ఇచ్చేందుకు సిద్ధమైందన్నారు. రాష్ట్ర ఆర్థికస్థితి మెరుగుపడ్డాక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతుభరోసా ఏడాదికి రూ.15వేల చొప్పున ఇస్తామని తెలిపారు. భూమిలేని పేదలకు ఏడాదికి రూ.12వేలు, రెండు విడతలుగా రూ.6వేల చొప్పున జనవరి 26 నుంచి అమలు చేస్తామన్నారు.

26 నుంచే ఇందిరమ్మ ఇండ్లూ..

ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని కూడా గణతంత్ర దినోత్సవం రోజు నుంచే మొదలు చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. దీనిలో భాగంగా మోడల్ ఇండ్ల నిర్మాణాలను చేపట్టామని, తన నియోజకవర్గంలోని కూసుమంచి మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ ఇంటిని ఆదివారం ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలన దరఖాస్తులు 1.15 కోట్లు రాగా వీటిలో 80.6లక్షల మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం అప్లై చేసుకున్నట్టు తెలిపారు. ఇప్పటికే 72లక్షల మందిని గుర్తించామన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో తప్ప రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 15 నుంచి యాప్ ద్వారా ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేపట్టామని తెలిపారు. సాగు భూములున్న వారికి రైతుభరోసా ఇస్తున్నట్టే.. సొంత స్థలం ఉన్న పేదలకు ఇందిరమ్మ ఇండ్లను ఇస్తామన్నారు. నియోజకవర్గానికి 3,500 చొప్పున, ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాలకు కొన్ని అదనంగా తొలివిడత పంపిణీ కార్యక్రమాన్ని జనవరి 26న ప్రారంభిస్తామన్నారు. ఇల్లు నిర్మాణం చేపడితే పునాది దశలో రూ.లక్ష, స్లాబ్ లెవల్‌లో రూ.1.75 లక్షలు, ఇంటినిర్మాణం పూర్తయితే మిగిలిన మొత్తాన్ని ఇస్తామన్నారు. రూ.5 లక్షలను ఎలా సద్వినియోగం చేసుకోవచ్చో మోడల్ హౌస్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు.

ఫిబ్రవరి చివరిలోపు భూ భారతి...

ధరణి స్థానంలో ప్రవేశపెట్టిన భూ భారతిని ఫిబ్రవరి చివరిలోపు అమల్లోకి తెస్తామన్నారు. కోర్టు మెట్లు ఎక్కాల్సిన అవసరం లేకుండా ల్యాండ్ అప్పిల్ అథారిటీని ప్రవేశపెడతామన్నారు. కేసుల సంఖ్యను బట్టి ఓ ప్రాంతాన్ని యూనిట్‌గా తీసుకొని దీన్ని నెలకొల్పుతామన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కర్నాటకలో లాగా సరిహద్దులతో కూడిన మ్యాప్‌ను పొందుపరుస్తున్నామన్నారు. రాష్ట్రంలో 10,956 రెవెన్యూ గ్రామాలు ఉండగా సుమారు 23వేల మంది వీఆర్వోలను గత ప్రభుత్వం ఒక్క సంతకం ద్వారా రాత్రికి రాత్రి వీఆర్వో వ్యవస్థను రద్దు చేసిందన్నారు. వీరిలో 16,324 మంది తిరిగి వీఆర్వోలుగా చేరేందుకు ఆప్షన్స్ ఇచ్చారని వెల్లడించారు. అనంతరం సుమారు 400 మందికి మంత్రి స్వయంగా భోజనాలు వడ్డించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మెన్ బొర్రా రాజశేఖర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు తుంబూరు దయాకర్‌రెడ్డి, తుళ్లూరి బ్రహ్మయ్య, మద్దినేని బేబి స్వర్ణకుమారి, పాల్గొన్నారు.



గుల్జార్ కవిత్వాలు జీవితానికి మార్గదర్శకాలు

- ఆయన కవిత్వాన్ని అనువదించడం గొప్ప విషయం
- గుల్ మొహర్ పుస్తకావిష్కరణలో వక్తలు

నవతెలంగాణ - ముషీరాబాద్

గుల్జార్ కవిత్వాలు జీవితానికి మార్గదర్శకాలని అటువంటి గొప్ప వ్యక్తి కవిత్వాన్ని అనువదించడం అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. ప్రముఖ కవి గుల్జార్ కవిత్వాలను తెలుగులోకి కవి వెన్నెల సత్యం అనువదించగా.. అందుకు సంబంధించిన గుల్ మొహర్ పుస్తకావిష్కరణ సభ శనివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఆనందచారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ కవి, విమర్శకులు ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ.. గుల్జార్ కవితల్లో బంధాలు బంధుత్వాలను లోతుగా విశ్లేషించే వారని, కొన్ని కవితలు సమాజం పట్ల ప్రేమను ఔనత్యాన్ని వివరిస్తాయని అన్నారు. ఆయన రచించిన కవిత మాధుర్యంలో ఎవరైనా మనల్ని రావద్దు అని తలుపులు మూసేస్తే గొళ్లెం రెండోవైపు కూడా ఉందని గుర్తు చేయడం ఆయన మేధస్సుకు నిదర్శనం అన్నారు. సాహిత్యాన్ని ప్రేమించే వారు కవులు, వారి సమయాన్ని సర్వస్వాన్ని కోల్పోవాల్సి వస్తుందన్నారు. వారు చేసే ప్రతి పనిలో కవిత్వమే కనిపిస్తుం దన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి గుల్జార్ అన్నారు. ఆయన కవితల్లో ప్రజలు నిత్యం అనుకునే విషయాలు, దినచర్యలో భాగాలను అద్భుతమైన ఊహలతో నిండి ఉంటాయన్నారు. అటువంటి కవితలను అనువదించడం అంటే ఎంతో గొప్ప విషయం అని చెప్పారు. కవి వెన్నెల సత్యం సాహసంతో కూడిన ఈ పనిని ఎంతో నేర్పుగా చేసి మనకు చక్కని కవిత్వాన్ని అందించారని, వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నానని అన్నారు.

ఆనందచారి మాట్లాడుతూ.. గుల్జార్ తన కవిత్వాల్లో ఎటువంటి ఆటంకం లేకుండా రాస్తూనే ఉండేవారన్నారు. జీవితం ఎలా ఉండాలి, ఎంత గొప్పగా బతకాలి అనే విషయాలను తన కవిత్వంలో యువతకు నేర్పించేవారని తెలిపారు. సృజన మనిషిలో ఎప్పుడు ఉంటుందో అప్పుడు చైతన్యం వస్తుందని, ప్రతి మనిషి నిత్య విద్యార్థి వలే ప్రతి విషయాన్నీ అభ్యసించాలని చెప్పారు. కవుల్లో చైతన్యం లేకపోతే సమాజాన్ని జాగృతం చేయలేరన్నారు. కవి గుల్జార్‌కు యావత్ సమాజం రుణపడి ఉంటుందన్నారు. గుల్జార్ కవిత్వాలను తెలుగు సాహిత్యం లోపించకుండా అనువదించిన వెన్నెల సత్యం కవుల్లో అగ్ర భాగాన నిలుస్తారని అన్నారు. ఆయన కఠోర శ్రమ ఏకాగ్రతతో సాధించారని గుర్తు చేశారు. అనువాదకర్త, కవి వెన్నెల సత్యం మాట్లాడుతూ.. సామాజిక మధ్యమాలలో మహాకవి గుల్జార్ కవిత్వాలు తనను విశేషంగా ఆకట్టుకున్నాయన్నారు. అవి చదవగానే తెలుగులోకి అనువదించాలన్న ఆకాంక్ష బలంగా కలిగిందని, అలా కొంత సాధన ద్వారా ప్రయత్నాలు మొదలుపెట్టి కవి మిత్రులు ప్రోత్సహించడంతో అడుగు ముందుకు వేశానన్నారు. అనువాదాలలో తొలి అడుగే గనక వారిని మార్గదర్శకులుగా భావిస్తానని చెప్పారు. ఈ పుస్తకానికి గుల్ మొహర్ అనే శీర్షిక పెట్టడం గుల్జార్ కలానికి పూసి పరిమళించిన గుల్ మొహర్ పూలుగా భావించానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి సినీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్, ప్రముఖ కవి ఐఆర్ఎస్ అధికారి జల్ది విద్యాధరరావు, దక్షిణాఫ్రికా తెలుగు సాహిత్య వేదిక రాపోలు సీతారామరాజు, కవి మిత్రుడు డాక్టర్ వి.జయప్రకాష్, అనంతోజు మోహనకృష్ణ, పలువురు కవులు, రచయితలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నల్లగొండ జిల్లా ఇంటెలిజెన్స్ ఎస్పీ గంజి కవితపై వేటు

- పనిచేస్తున్న శాఖలోనే భారీగా వసూళ్లు.. అవినీతి మరకలు!
- పెద్దఎత్తున ఫిర్యాదులు
- డీజీపీ ఆఫీస్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు

నవతెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

ఆమె ఒక జిల్లా స్థాయి పోలీస్ శాఖలో ఉన్నతాధికారి. ఇంటెలిజెన్స్ విభాగంలో నేరుగా డీఎస్పీ స్థాయి అధికారిగా నల్లగొండలో బాధ్యతలు స్వీకరించారు. ఏడేండ్ల కాలంలో ఉన్నతస్థానాలకు చేరుకుని నాన్ క్యాడర్ ఎస్పీగా నల్లగొండ, సూర్యాపేట జిల్లా పరిధిలో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే, పని చేస్తున్న శాఖలోనే భారీగా వసూలు, అవినీతికి పాల్పడటం.. గుట్కాలు, పీడీఎస్ బియ్యం, మాఫియా నుంచి అక్రమ వసూలు చేయడం పై అధికారులకు ఫిర్యాదులు అందాయి. సోషల్ మీడియాలోనూ వైరల్ అయింది. దాంతో ఉన్నతాధికారులు విచారణ జరిపి ఆమెపై వేటు వేశారు. డీజీపీ ఆఫీస్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అధికారాన్ని ఉపయోగించి అవినీతి అక్రమాలకు పాల్పడినట్టు ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు 15 రోజులపాటు దర్యాప్తు చేసి నివేదిక అందించినట్టు తెలిసింది. వివరాలిలా ఉన్నాయి..2017 నవంబర్‌లో నల్లగొండ ఇంటెలిజెన్స్‌కు డీఎస్పీగా గంజి కవిత విధుల్లో చేరారు. ఆ తర్వాత ప్రమోషన్లు పొంది ఏడాది నుంచి నాన్ క్యాడర్ ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించారు.

ఈ క్రమంలో ఆమె పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు చేసినట్టు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వచ్చాయి. కవిత అక్రమాల్లో ఓ ఎస్ఐ, ముగ్గురు కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుల్ ప్రమేయం ఉందని తేల్చారు ఇంటెలిజెన్స్ అధికారులు. వారి విచారణలో విస్తుపోయే విషయాలు బయటకు వచ్చాయి. 9 పేజీల నివేదికను ఉన్నత అధికారులకు అందజేశారు. గుట్కాలు, పీడీఎస్ బియ్యం, మాఫియా నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. రూ.42లక్షలు అవినీతికి పాల్పడినట్టు తేల్చారు. దాంతోపాటు కవిత తల్లి గంజి కళావతి నల్లగొండ కరెంట్ డిపార్ట్‌మెంట్ డిఈ ఆఫీస్‌లో అటెండర్‌గా పనిచేస్తున్నారు. తాను ఇంటెలిజెన్స్ అధికారినంటూ అక్కడి అధికారులను బెదిరించి తల్లిని డ్యూటీకి పంపకుండా.. ఆమె స్థానంలో ఓ ముస్లిం అమ్మాయిని రూ.7వేల జీతం ఇచ్చి పని చేయించారు. ఏడేండ్ల నుంచి తల్లికి జీతం నెలకు రూ. లక్షా40 వేల చొప్పున 80 నెలలు- రూ.కోటి 12 లక్షలు ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేసినట్టు తేల్చారు.

కల్లు కాంపౌండ్లపై కొరవడిన నిఘా

- కాసులకు కక్కుర్తి పడి కల్తీ కల్లు తయారీ
- ప్రజల ప్రాణాలతో చెలగాటం
- రోడ్డున పడుతున్న పేద కుటుంబాలు
- నిద్ర మత్తులో ఎక్సైజ్ శాఖ



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

"ఇటీవల కొత్తురు మండల పరిధిలోని వలస కార్మికులు కల్తీ కల్లు తాగి అనారోగ్యానికి గురయ్యారు. అలాగే, కడ్తల్ మండల పరిధిలోని మైసిగండి ప్రాంతంలోనూ కల్తీ కల్లు తాగి అనారోగ్యానికి గురవడంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో ఎక్సైజ్ అధికారులు కల్లు దుకాణాలపై దాడులు నిర్వహించి, నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేశారు. మరో ఘటనలో.. మీర్‌పేటలోని నందనవనం బస్తీకి చెందిన ఓ మహిళ కల్తీకల్లు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది." ఇలాంటి ఘటనలను చూస్తుంటే.. ప్రజల ప్రాణాలు ఏమైతేనేమీ.. తమ జేబులు నిండితే చాలన్న చందంగా వ్యవహరిస్తున్నారు కల్లు కాంపౌండ్ల నిర్వాహకులు. నిబంధనలను గాలికి వదిలి ఇష్టారాజ్యంగా కల్తీ కల్లు తయారు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కల్లు దుకాణాలపై నిరంతరం నిఘా పెట్టి అడ్డుకట్ట వేయాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దాంతో కల్తీ కల్లు తాగిన ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కల్తీ కల్లు మాఫియా ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది.

ఉమ్మడి జిల్లాలో సుమారు 1,165 కల్లు కాంపౌండ్లకు అనుమతులు ఉన్నాయి. ఇందులో 1602 మంది కార్మికులు పనిచేస్తున్నారు. అయితే కల్లు కాంపౌండ్ల నిర్వాహకులు గ్రామీణ ప్రాంతాల నుంచి గీత కార్మికుల వద్ద కల్లు తీసుకొచ్చి విక్రయించాలి. కొంత మేరకు తగిన మోతాదులో కల్లు తయారు చేసుకోవడానికి వెసులుబాటు ఉన్నప్పటికీ.. దీన్ని ఆసరాగా చేసుకుని అధిక మోతాదులో క్లోరోహైడ్రేట్, డైజోఫామ్, ఆల్ఫాజోలమ్‌తో కల్లు తయారీ చేసి ప్రజలను మత్తులోకి దింపుతున్న పరిస్థితి ఉంది. ఈ కల్లును తాగుతున్న అమాయక కూలీలు, పేదలు ప్రాణాల మీదకు తెచ్చుకుం టున్నారు. అయితే కల్లు నిర్వాహక కేంద్రాలపై తనిఖీలు చేసి పరీక్షలు నిర్వహించాల్సిన ఎక్సైజ్ అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. శంషాబాద్, సరూర్‌నగర్, వికారాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి ప్రాంతాల్లో ఉన్న ఆబ్కారీ దుకాణాల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి కల్లు తెచ్చి అమ్మాలి. కానీ ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోనూ కల్లుగీత కార్మికులు వృత్తిని వదిలిపెట్టి పట్టణాలకు వలస వెళ్లిపోతుండటంతో కల్లు గీసే వారి సంఖ్య తగ్గిపోతోంది. దాంతో కృత్రిమ కల్లు తయారీ వైపు నిర్వాహకులు మొగ్గు చూపుతున్నారు. అయితే కల్లు తాగేవారిలో ఎక్కువగా దినసరి కూలీలు, వలస కార్మికులే ఉంటారు. దాంతో వీరు కృత్రిమంగా తయారుచేసిన కల్తీ కల్లు తాగి అనారోగ్యం బారిన పడుతున్నారు.

కల్తీ కల్లు నిర్వాహకులపై చర్యలు శూన్యం

జిల్లాలో కల్తీ విక్రయదారులు రెచ్చిపోతున్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు మాత్రం మొక్కుబడిగా ఒకట్రెండు తనిఖీలతో మమ అనిపిస్తున్నారు. తనిఖీలు నిర్వహించి సీజ్ చేసిన మరుసటి రోజు నుంచే యథావిధిగా దుకాణాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా కల్తీ కల్లు దుకాణాలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

కల్తీ కల్లు విక్రయదారులపై చర్యలు తీసుకుంటున్నాం : దశరథ, డిప్యూటీ కమిషనర్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా

మాకొచ్చిన ఫిర్యాదుల మేరకు కల్తీ కల్లు తయారీ దుకాణాలపై దాడులు నిర్వహిస్తున్నాం. ఆధారాలు లభిస్తే కల్లు దుకాణాల నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్నాం. దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేస్తున్నాం. కల్తీ కల్లు విక్రయ దారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

బస్తీలే కల్లు కాంపౌండ్లకు అడ్డాలు

ప్రజల్లోని బలహీనతను కొంతమంది కల్లు వ్యాపారులు సొమ్ము చేసుకుంటారు. క్లోరోహైడ్రేట్, డైజోఫామ్, ఆల్ఫాజోలమ్ వంటి ప్రమాదకరమైన రసాయనాలను వినియోగించి కల్తీ కల్లును తయారు చేస్తున్నారు. శంషాబాద్, రాజీవ్‌గాంధీనగర్, మీర్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్, బొంగుళూరుగేటు, ఆదిబట్ల, యాచారం, చేవెళ్ల, షాద్‌నగర్, షాబాద్, కడ్తాల్ శివారు ప్రాంతాల్లో ఈ కల్తీ కల్లు విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. శంషాబాద్ పట్టణంలో ఒక లైసెన్సుపై రెండు దుకాణాలు నడిపిస్తున్నారు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవతో ఈ తతంగం వెలుగులోకి వచ్చింది. అయితే ఎక్సైజ్ నిబంధనల మేరకు ఒక లైసెన్స్‌పై రెండు విక్రయ కేంద్రాలు నడిపిస్తున్న విషయం తెలుసుకున్న ఆబ్కారీ అధికారులు ఒక లైసెన్స్‌పై ఒకటే దుకాణం నడిపించాలని హెచ్చరించారు. వ్యాపారులు మాత్రం ఇదేమీ పట్టనట్టుగా దందా కొనసాగిస్తున్నారు. అయినా ఎక్సైజ్ అధికారులు వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా కల్తీ కల్లు దుకాణాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యువకుల మృతి పట్ల దిగ్భ్రాంతి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కొండపోచమ్మ జలాశయంలో ఐదుగురు యువకులు మునిగి చనిపోయిన సంఘటన పట్ల టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువత ఇలా అర్ధాంతరంగా జీవితాలను కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. యువకుల మరణం పట్ల తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు తన సానుభూతిని వ్యక్తం చేశారు.

కాళేశ్వరం విచారణలో కీలక మలుపు

- త్వరలో మాజీ మంత్రులకు పిలుపు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ త్వరలో కీలకమలుపు తిరగనుంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమైన బాధ్యతలు నిర్వహించిన మంత్రులను పిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈమేరకు కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ రంగం సిద్ధం చేస్తున్నది. కమిషన్‌కు సహకరించే కోఆర్డినేషన్ కమిటీ ఈమేరకు సన్నాహాలు చేస్తున్నది. బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన ఈటల రాజేందర్ తోపాటు నీటిపారుదల శాఖ మంత్రిగా వ్యవహరించిన తన్నీరు హరీశ్ రావును సైతం పిలవనున్నట్టు తెలిసింది. కాగా ఆర్థిక శాఖ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రామకృష్ణారావు విచారణ పదే పదే వాయిదా పడుతూ వస్తున్నది. నిరంతరం తీరిక లేకుండా ఉండటంతో కమిషన్ ఆయనకు వెసులుబాటును కల్పించినట్టు సమాచారం. నిర్మాణ, డిజైన్లు, హైడ్రాలజీ, డ్యామ్ సేఫ్టీ, ఓ అండ్ ఎం, నాణ్యత పర్యవేక్షణ, గణాంక విభాగాలకు చెందిన మాజీల తోపాటు ప్రస్తుత అధికారులను విచారించిన విషయం విదితమే. అలాగే అఖిల భారత సర్వీసు అధికారులతోపాటు మాజీ ఈఎన్సీల విచారణ పూర్తయింది. ఇప్పుడు ఇక ఉన్నతస్థాయి ప్రజాప్రతి నిధులను పిలవాల్సి ఉంది. అందులో భాగంగానే ఈటల, హరీశ్‌కు తాఖీదులు పంపనున్నారు. అనంతరం మాజీ సీఎం కేసీఆర్‌కూ నోటీసులు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈనెల 20న కమిషన్ చైర్మెన్ జస్టిస్ పీసీ ఘోష్ కోల్‌కతా నుంచి హైదరాబాద్ రానున్నారు. కాళేశ్వరంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల విఫలమైన నేపథ్యంలో న్యాయ విచారణ కొన్ని నెలలుగా సాగుతున్న విషయం విదితమే.

రేవంత్‌రెడ్డి ఫొటోతో గాలిపటం

- ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టుసాయికుమార్ ఆవిష్కరణ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిపై ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టుసాయికుమార్ మరోసారి తన అభిమానాన్ని చాటుకున్నారు. ఆయన ఫొటోతో ఉన్న గాలిపటాన్ని తయారు చేయించి పిల్లలకు పంపిణీ చేశారు. గతంలో సీఎం జన్మదినం సందర్భంగా ఆయన పూరీలో రేవంత్ సైకత శిల్పం తయారు చేయించిన విషయం తెలిసిందే. రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న రేవంత్‌రెడ్డి నిండు నూరేండ్లు సంతోషంగా ఉండాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

మీడియా ప్రజలపక్షాన ఉండాలి

శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మీడియా ప్రజల పక్షాన ఉండాలని శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో టీఎస్ న్యూస్, రెజ్ టీవీ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో జరిగే వాస్తవ పరిస్థితులను ప్రజల్లోకి తీసుకుపోవడంలో మీడియా ముందుండాలని సూచించారు. టీఎస్ న్యూస్ ఇప్పుడు ప్రజల పాత్రను పోషిస్తోందని కితాబిచ్చారు.

రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ న్యూస్ ఎండీ కింగ్ జాన్సన్ కొయ్యడ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాల కారణంగా కొత్త ఏడాదిలో రియాల్టీ మార్కెట్ గణనీయంగా అభివృద్ధి చెందుతున్నదన్నారు. సినీ దర్శకుడు శ్రీనాగ్ మాట్లాడుతూ క్యాలెండర్ ఆకర్షణీయంగా ఉందన్నారు. కార్యక్రమంలో యాంకర్ లహరిక, సంజయ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడికి అవమానం

కానరాని గాంధీజీ చిత్రపటం...రాష్ట్ర గీతాలాపనా లేదు

- జాతిపిత పేరైనా తలవని ఒడిశా సీఎం మంఝీ
- యధాలాపంగా ప్రస్తావించి మమ అనిపించిన మోడీ
- ఖాళీ కుర్చీలతో వెలవెలబోయిన ప్రవాసీ భారతీయ దివస్



న్యూఢిల్లీ : ఈ నెల 9వ తేదీన భువనేశ్వర్‌లో నిర్వహించిన 18వ ప్రవాసీ భారతీయ దివస్ వెలవెలపోయింది. ప్రధాన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆహ్వానితుల కోసం వేసిన కుర్చీల్లో 60 నుండి 70 శాతం వరకూ ఖాళీగా దర్శనమిచ్చాయి. 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించడం కోసం ప్రపంచంలో నలుమూలలా ఉన్న భారతీయులను భాగస్వాములను చేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించారు. ప్రారంభ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగించారు.

ఖాళీ కుర్చీల పండుగ

ఒడిషాలో మోహన్ చరణ్ మంఝీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఎంతో ప్రాచుర్యం కల్పించి ఏర్పాటు చేసిన ప్రవాసీ భారతీయ దివస్ 'ఖాళీ కుర్చీల పండుగ'లా మారడంపై ఒడియా యూట్యూబ్ ఛానల్ 'సమత' దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. రాష్ట్రంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తుందంటూ కాషాయ పార్టీ నేతలు ఊదరకొడుతూనే ఉన్నారు. అయితే ఈ కార్యక్రమంలో భారతీయ డయాస్పోరా (విదేశాలలో నివసిస్తున్న భారతీయులు)ను భాగస్వామిని చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. విదేశాలలో నివసిస్తున్న భారతీయులు మోడీకి, బీజేపీకి గట్టి మద్దతుదారులంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న తరుణంలో వారిని ఆకర్షించడంలో ప్రవాసీ భారతీయ దివస్ వైఫల్యం చెందడం గమనార్హం.

జనవరి 9నే ఎందుకు?

2003 నుండి ప్రతి ఏటా జనవరి 9వ తేదీన ప్రవాసీ భారతీయ దివస్‌ను నిర్వహిస్తున్నారు. 1915లో అదే రోజు మహాత్మా గాంధీ దక్షిణాఫ్రికా నుండి భారత్ తిరిగి వచ్చారు. 1906 సెప్టెంబర్ 11న జాతిపిత మొదటి సత్యాగ్రహం ప్రారంభమైంది. అది 1914లో విజయవంతంగా ముగిసింది. ఆ మరుసటి సంవత్సరం జనవరి 9న గాంధీజీ స్వదేశానికి వచ్చారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా ఆ తేదీన ప్రవాసీ భారతీయ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. భారత స్వాతంత్రోద్యమానికి పునాది వేసింది ఆ సత్యాగ్రహమే. అహింసా సిద్ధాంతంతో చేపట్టిన సత్యాగ్రహోద్యమం బ్రిటీష్ పాలకుల చేతిలో భారతీయులు ఎదుర్కొంటున్న జాతి, ఆర్థిక వివక్షకు వ్యతిరేకంగా నడిచిన విషయం తెలిసిందే. దేశానికి స్వాతంత్ర్యాన్ని సిద్ధింపజేయడంలో కీలక భూమిక పోషించిన గాంధీని ఒడిషాలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించడం శోచనీయం.

అడుగడుగునా అవమానమే

ఒడిషాలోని మఝీ ప్రభుత్వం కానీ, కేంద్ర సర్కారు కానీ ప్రధాన కార్యక్రమంలో గాంధీజీ చిత్రపటాన్ని ప్రదర్శించలేదు. స్వదేశానికి గాంధీజీ చేరుకున్న సందర్భాన్ని గుర్తుకు తెస్తూ ఏర్పాటు చేసిన ప్రవాసీ భారతీయ దివస్‌లో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలన్న విషయాన్ని డబుల్ ఇంజిన్ ప్రభుత్వం మరచిపోయింది. ముఖ్యమంత్రి మఝీ తన స్వాగతోపన్యాసంలో గాంధీజీ పేరును సైతం తలవలేదు. మోడీ మాత్రం మహాత్ముని పేరును ప్రస్తావించి మమ అనిపించారు.

గీతాలాపన ఏది?

ఒడిషా గీతంపై కూడా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అనేక ప్రారంభోత్సవ కార్యక్రమాలలో వినిపించిన ఈ గీతాన్ని ప్రవాసీ భారతీయ దివస్ కార్యక్రమంలో మాత్రం ఆలపించలేదు. ఒడియా ఆత్మగౌరవ నినాదంతో అధికారంలోకి వచ్చిన బీజేపీ, ఓ అంతర్జాతీయ కార్యక్రమంలో రాష్ట్ర గీతానికి చోటు కల్పించకపోవడంపై ఒడిషా వాసులు మండిపడుతున్నారు.

ఈ కార్యక్రమంలో మోడీ యధాలాపంగా గాంధీజీ పేరును ప్రస్తావిస్తే 2005లో జరిగిన ప్రవాసీ భారతీయ దివస్‌లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అందుకు పూర్తి భిన్నంగా వ్యవహరించిన తీరును ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. మన్మోహన్ తన ప్రసంగంలో చాలా సేపు గాంధీజీని గుర్తు చేసుకోవడం గమనార్హం. భారతీయ డయాస్పొరాలోని వివిధ కోణాలను ఆవిష్కరించడంలో కూడా మోడీ విఫలమయ్యారు. పైగా హిందువుల పండుగలైన మకర సంక్రాంతి, మహా కుంభమేళాలను ప్రస్తావించారు. తద్వారా మెజారిటీ ప్రజల మత విశ్వాసాలను ఏకరువు పెట్టి రాజ్యాంగ నిబంధనలకు తుంగలో తొక్కారు.

దుకాణాలు మూసేయించి...

ప్రవాసీ భారతీయ దివస్ కార్యక్రమం కోసం మోహన్ మఝీ ప్రభుత్వం చేసిన ఆర్భాటం అంతా ఇంతా కాదు. అయితే అదే సమయంలో భువనేశ్వర్‌లో చిన్న చిన్న దుకాణాలు నడుపుతూ జీవనోపాధి పొందుతున్న వ్యాపారుల పొట్ట కొట్టింది. కార్యక్రమానికి హాజరయ్యే విదేశీయులకు అసౌకర్యం కలుగుతుందన్న కారణంతో ఆ దుకాణాలను మూసేయించింది. ఇలాంటి చర్యలు గాంధీజీకి అస్సలు నచ్చేవి కావు. షరా మామూలుగానే అంతర్జాతీయ స్థాయిలో తన సొంత ఇమేజ్‌ను పెంచుకునేందుకు ప్రవాసీ భారతీయ దివస్ కార్యక్రమాన్ని మోడీ ఉపయోగించుకున్నారు. అదే సమయంలో ఆయన స్వాతంత్ర్య పోరాట రథసారథి గాంధీజీకి సముచిత గౌరవం, స్థానం ఇచ్చి ఉంటే ఆ కార్యక్రమానికి మరింత హుందాతనం చేకూరి ఉండేది.

బెంగళూరులో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల సమావేశం

- ఉప రాష్ట్రపతి ధన్కర్, కర్నాటక గవర్నర్ గెహ్లాట్, సీఎం సిద్ధరామయ్య హాజరు
- డిసెంబర్‌లో హైదరాబాద్‌లో వచ్చే పీఎస్సీల సమావేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలోని అన్ని రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ (పీఎస్సీ)లకు సంబంధించిన 25వ జాతీయ కాన్ఫరెన్స్ శనివారం బెంగళూరులో ప్రారంభమైంది. ఈ సమావేశానికి ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్, కర్నాటక గవర్నర్ తవర్ చంద్ గెహ్లాట్, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) చైర్‌పర్సన్ ప్రీతి సుదన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఖాళీ పోస్టుల భర్తీ, నియామకాల విధానం వంటి ముఖ్యమైన వివిధ అంశాలపై చర్చించారు. పీఎస్సీలు చేపడుతున్న ఉత్తమ పద్ధతుల గురించి చర్చకు వచ్చింది. వచ్చే జాతీయ స్థాయి పీఎస్సీల చైర్‌పర్సన్ల సమావేశానికి తెలంగాణ ఆతిథ్యం ఇవ్వాలనీ, డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. తెలంగాణలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ చేపడుతున్న పద్ధతుల గురించి చైర్మెన్ బుర్రా వెంకటేశం వివరించారు. నియామకాల కోసం వివిధ శాఖల అధికారు లతో సమన్వయం చేసుకోవడం, న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు నిపుణులతో సంప్రదించడం వంటి వివరాలను ఆయన చెప్పారు. ఖాళీల భర్తీ విషయంలో మెరుగైన విధానాలను అమలు చేయడం, సకాలంలో ఉద్యోగాల భర్తీకి తీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా చర్చించారు. సమస్యలు తలెత్తకుండా ఉండేలా నిరుద్యోగులకు ఇబ్బందులు రాకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలో అందులో చర్చకు వచ్చింది. ఇంకో వైపు యూపీఎస్సీ చేపడుతున్న పద్ధతులు, రాతపరీక్షల నిర్వహణ, వివాదాల్లేకుండా నియామకాలు పూర్తి చేయడం వంటి వాటిని పరిశీలించారు.

చేనేతకు మొండిచేయి : కూరపాటి రమేష్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికులకు అభయహస్తం పథకాలల్లో కోత విధించి మొండి చేయి చూపుతోందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చేనేతకు చేయూత పొదుపు పథకాన్ని 26 నెలలకు తగ్గించటం సబబు కాదని పేర్కొన్నారు. చేనేత కార్మికులను మోసం చేయటంకాక మరేమిటని ప్రశ్నించారు. గత ఐదేండ్లుగా అమల్లో ఉన్న నేతన్న బీమా పథకాన్ని నేతన్న భద్రత పేరు మార్చి మళ్లీ ప్రకటించి తానేదో నేతన్నలకు కొత్త పథకాన్ని ప్రవేశపెట్టినట్టు సీఎం గొప్పలు చెప్పుకుంటున్నారని తెలిపారు. యారన్ సబ్సిడీ పథకం ద్వారా నేత కార్మికుడికి రూ.2000, అనుబంధ కార్మికుడికి రూ.500 గత ప్రభుత్వం ఇచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకొచ్చిన సంవత్సర కాలం నుంచి ఆ పథకాన్ని నిలిపివేసిందని పేర్కొన్నారు. ఇప్పుడు కొత్తగా చేనేత కార్మికుడికి రూ. 18వేలిస్తామంటూ సీఎం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని వ్యాఖ్యానించారు. గతంలోనే ఉన్న ఏడాదికి రూ.24 వేలను ఇప్పుడు రూ. 18వేలకు తగ్గించి చేనేత కార్మికులను రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలు చేయకపోగా పాత పథకాలకు పేర్లు మార్చి కోతలు విధించటం మానుకోవాలని హెచ్చరించారు.

నాంపల్లి కోర్టులో అల్లు అర్జున్‌కు ఊరట

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

నాంపల్లి కోర్టులో సినీ నటుడు అల్లు అర్జున్‌కు ఊరట లభించింది. సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో బెయిల్‌పై ఉన్న అల్లు అర్జున్‌ను నాంపల్లి కోర్టు ప్రతి ఆదివారమూ చిక్కడపల్లి పోలీసుల ఎదుట హాజరుకావాలని ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా ప్రతి ఆదివారమూ స్టేషన్‌కు హాజరు కావడంపై అల్లు అర్జున్ మినహాయింపు కోరారు. ఈ మేరకు ఈ నిబంధనను కోర్టు మినహాయించింది. అలాగే, విదేశాలకు వెళ్లేందుకు కూడా అల్లు అర్జున్‌కి కోర్టు అనుమతినిచ్చింది.

పూల రవీందర్‌కు అధ్యాపక సంఘాల మద్దతు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఖమ్మం-వరంగల్-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పూల రవీందర్‌కు రెండు అధ్యాపక సంఘాలు మద్దతు ప్రకటించాయి. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లెక్చరర్ల అసోసియేషన్ (టీజీసీటీఏ), ప్రభుత్వ జూనియర్ కాలేజీ లెక్చరర్ల అసోసియేషన్ (జీజేఎల్ఏ) తెలంగాణ మద్దతునిచ్చాయి. శనివారం హైదరాబాద్‌లో పూల రవీందర్‌ను టీజీసీటీఏ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బ్రిజేష్, జీజేఎల్ఏ తెలంగాణ అధ్యక్షులు పి మధుసూదన్‌రెడ్డి వేర్వేరుగా కలిసి మద్దతు లేఖలను అందజేశారు.

కొండపోచమ్మ ఘటనపై బీఆర్ఎస్ నేతల దిగ్భ్రాంతి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కొండపోచమ్మ సాగర్‌లో హైదరాబాద్‌కుచెందిన ఐదుగురు యువకులు గల్లంతు కావడంపై బీఆర్ఎస్ నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆపార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు, మాజీ మంత్రి టీ హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. యుక్త వయసులో ఉన్న యువకులు అకాల మరణం చెందడం కుటుంబాలకు తీరని లోటు అని విచారం వ్యక్తం చేశారు. తీవ్ర విషాదంలో ఉన్న ఆ కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి, సంతాపం తెలిపారు.

పాలన చేతకాకే దాడులు

- తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మెన్ రాజీవ్ సాగర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పాలన చేతకాకే కాంగ్రెస్ దాడులకు తెగబడుతున్నదని తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మెన్ మేడే రాజీవ్‌సాగర్ విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ దాడిని ఆయన శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. జిల్లా పార్టీ అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక దాడులు చేయిస్తున్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ ప్రశ్నిస్తే కేసులు పెట్టడం, లేదంటే దాడులు చేయించడం ఆ పార్టీకి పరిపాటిగా మారిందని విమర్శించారు. హోమ్ మంత్రి లేకపోవటంతో రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ గాడి తప్పిందని తెలిపారు. కాంగ్రెస్ చేస్తున్న ప్రతి చర్యనూ గుర్తుపెట్టుకుని రానున్న రోజుల్లో వాటికి బదులిస్తామని హెచ్చరించారు.

టిక్కెట్ ధరల పెంపు నిర్ణయం వెనక్కి

- జీవో జారీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రామ్‌చరణ్ నటించిన గేమ్ ఛేంజర్ సినిమా టిక్కెట్ ధరల పెంపు నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. తెలంగాణలో ఇకపై టిక్కెట్ ధరల పెంపు, స్పెషల్ షోలు ఉండబోవని స్పష్టం చేసింది. ఈ మేరకు శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. హైకోర్టు ఆదేశాల మేరకు, ప్రజల ఆరోగ్యం, భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రంలో ఇక నుంచి తెల్లవారుజామున స్పెషల్ షోలకు అనుమతి లేదని స్పష్టం చేసింది.

రేపటి నుంచి కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్

వెయ్యికి పైగా నోరూరించే మిఠాయిలు

- 15 లక్షల మంది వీక్షకులు వస్తారని అంచనా
- పోస్టర్‌ను ఆవిష్కరించిన పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

హాజరు కానున్న 16 దేశాల కైట్ క్రీడాకారులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సంక్రాంతి పండుగ సందర్భంగా సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో సోమవారం నుంచి ఈ నెల 15 వరకు అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. హైదరాబాద్ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జరగనున్న ఈ పతంగుల వేడుక పోస్టర్‌ను పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ ఓ మినీ ఇండియా అనీ, దేశంలోని అన్ని రాష్ట్రాలు, ప్రాంతాలే కాకుండా ఇతర దేశాల నుంచి కూడా నగరంలో స్థిరపడ్డారని వెల్లడించారు. ఈ ఉత్సవాల్లో 16 దేశాల నుంచి 47 మంది అంతర్జాతీయ కైట్ క్రీడాకారులు, 14 రాష్ట్రాల నుంచి 60 దేశవాళీ కైట్ క్లబ్ సభ్యులు పాల్గొని పలు డిజైన్లలో రూపొందించిన పతంగులను ఎగరేస్తారని తెలిపారు. వీటితో పాటు జాతీయ, అంతర్జాతీయ స్వీట్లను, తెలంగాణ పిండి వంటలను స్టాళ్లలో అందుబాటులో ఉంచనున్నామని పేర్కొన్నారు.

తెలంగాణలోని చారిత్రాత్మక ప్రదేశాలు, వారసత్వ కట్టడాలు, ప్రాచీన దేవాలయాల ను సందర్శించాలని ఈ సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను కోరారు. రాష్ట్ర పర్యాటక శాఖ అందుకు తోడ్పాటునందిస్తుందని తెలిపారు. పర్యాటక ప్రదేశాలను సందర్శించడం వల్ల ఆ ప్రాంత చరిత్ర సంస్కృతి, సంప్రదాయాలు తెలుసుకోవడంతోపాటు స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు.

వీక్షకులకు ఉచిత ప్రవేశం ఉంటుందని, అందరూ ఆహ్వానితులేనని తెలిపారు. రాబోయే రోజుల్లో కైట్ స్వీట్ ఫెస్టివల్‌ను పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తామని ప్రకటించారు. పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ మాట్లాడుతూ భారతదేశంలోనే కాదు, ప్రపంచంలో కూడా ఇలాంటి ఫెస్టివల్ ఎక్కడ నిర్వహించరనీ, అదే తెలంగాణ ప్రత్యేకతని కొనియాడారు.

15 లక్షల మంది వస్తారని అంచనా

మూడు రోజుల పాటు జరగనున్న కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్‌కు దాదాపు 15లక్షల మందికిపైగా వీక్షకులు వస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. వేడుకలను తిలకించ టానికి వచ్చే సందర్శకులకు అసౌకర్యం కలుగ కుండా జీహెచ్ఎంసీ, పోలీసు, ఇతర శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కైట్ ఫెస్టివల్‌లో హస్తకళలు, చేనేత వస్త్రాల స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే సందర్శ కుల కోసం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ సంచాలకులు జెండగే హనుమంతు కొండిబా, భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, కైట్ ఫెస్టివల్ కన్సల్టెంట్ పవన్. డి. సోలంకి, క్లిక్ కన్వీనర్ లిబి బెంజిమన్, దేశీయ, అంతర్జాతీయ కైట్ క్రీడాకారులు, వివిధ రాష్ట్రా లకు చెందిన ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సమన్యాయం దక్కాలి

- ప్రొ. హరగోపాల్
- ఓయూలో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అమలుపై మేధావుల సంఘీభావ సభ



నవతెలంగాణ- ఓయూ

ప్రతిభ కంటే న్యాయం ముఖ్యమైందని, అందరికీ సమన్యాయం దక్కాలని, అన్యాయానికి గురైన వాళ్లు ప్రశ్నిస్తే సమాజం చైతన్యవంతమవుతుందని ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో శనివారం ప్రొఫెసర్ సి.కాశీం అధ్యక్షతన "ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అమలు కోసం మేధావుల సంఘీభావ సభ" నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణను సాధ్యమైనంత తొందరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పీడిత కులాల తరపున ఈ సభలో మాట్లాడటం తనకు వచ్చిన గొప్ప అవకాశమన్నారు.

ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్ మాట్లాడుతూ.. సమాన అవకాశాలు కల్పించడానికి ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ ఒక సాధనంగా ఉపయోగపడుతుందన్నారు. దానికి చట్టపరంగా, రాజకీయపరంగా ఉన్న ఆటంకాలను తొలగించి వర్గీకరణ అమలయ్యేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. సుదీర్ఘ పోరాటం చేసి విజయం ముంగిట్లో ఉన్న ఉద్యమాన్ని అభినందించారు.

ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశంలోని ఐక్య ఉద్యమాలకు పునాదిగా వర్గీకరణ ఉద్యమం పనిచేసిందని, సూక్ష్మ స్థాయి సమస్యలను బయటకు తీసుకొచ్చిందని అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. ఒక జడ్జిగా అన్ని కోణాల నుంచి శాస్త్రీయంగా పరిశీలించి ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అనేది రాజ్యాంగబద్ధమైనది అని చెప్తున్నానన్నారు. మాల, మాదిగలు ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ సమస్యను పరిష్కరించుకొని భవిష్యత్ ఉద్యమాల నిర్మాణంలో క్రియాశీలకంగా పని చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రొ.కె.నాగేశ్వర్ మాట్లాడుతూ.. న్యాయమైన డిమాండ్‌తో 30 ఏండ్లుగా దండోర ఉద్యమం సాగుతోందని, ఈసారి తప్పనిసరిగా వర్గీకరణ జరిగి రిజర్వేషన్ ఫలాలు అందరికీ సమానంగా అందుతాయని అన్నారు. జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్‌ను వర్గీకరించి తీరాలన్నారు. ప్రజలందరికీ ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య, వైద్యం కల్పించే విధంగా భవిష్యత్ ఉద్యమాల నిర్మాణం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకులు డా.కె.శ్రీనివాస్, డా.నందిని సిధారెడ్డి, విమలక్క, ప్రొ.సూరెపల్లి సుజాత, ప్రొ.భాంగ్య భూక్య, ప్రొ.ఈసం నారాయణ, ప్రొ.ఆరెపల్లి రాజేందర్, బూరం అభినవ్, గజవెల్లి ఈశ్వర్, వెంకట్ మారోజు, ఉద్యోగులు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను పూర్తిస్థాయిలో అమలు చేస్తాం

అటవీ భూములపై గిరిజనులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తాం : గిరిజన, ఆదివాసీ శిక్షణ ముగింపు సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



నవతెలంగాణ- నాగార్జునసాగర్

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో వారం రోజులుగా నిర్వహించిన గిరిజన, ఆదివాసీ శిక్షణా తరగతుల ముగింపు సమావేశంలో శనివారం మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. గిరిజనులకు భూమి తల్లి లాంటిదని, నదులు శక్తి రూపాలు లాంటివని, ఇవి లేకుంటే జీవం లేనట్టు వారు భావిస్తారని అన్నారు. అడవిని, నదులను కాపాడుకుంటూ జీవిస్తున్న ఆదివాసీల హక్కులను కొన్ని ప్రభుత్వాలు దూరం చేశాయన్నారు. అటవీ హక్కుల చట్టం, పీసా చట్టం, ఆర్‌వోఆర్, సబ్‌ప్లాన్ లాంటి చట్టాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో తీసుకొచ్చినట్టు గుర్తు చేశారు. గిరిజనులు, ఆదివాసీలు తమ ఆస్తులను కాపాడుకోవడానికి, హక్కులను పొందటానికి 20వేల మంది గిరిజన సైనికులను తయారు చేస్తామన్నారు. అందుకే ఈ గిరిజన శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని, మొట్టమొదటిసారిగా రాష్ట్రంలో నిర్వహించామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను తప్పకుండా అమలు చేసే బాధ్యతను తాము తీసుకుంటామని అన్నారు. రూ. 22,500 కోట్లతో ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామని తెలిపారు. అందుకు అర్హులైన వారికి ఒక్కొక్కరికి రూ. ఐదు లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలు మంజూరు చేస్తామన్నారు. జనవరి 26 నుంచి ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా ఏడాదికి రూ.12000, భూమి లేని వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరుతో రూ.12000 అందిస్తామని వివరించారు. అదే విధంగా జనవరి 26 నుంచే రేషన్ కార్డుల పంపిణీ మొదలు పెడతామన్నారు. పీసా చట్టాన్ని, అటవీ హక్కుల చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తామన్నారు. అటవీ భూములపై సంపూర్ణ హక్కులను గిరిజన ఆదివాసీలకు కల్పిస్తామని చెప్పారు. ఐటీడీఏ బడ్జెట్‌ను పూర్తి స్థాయిలో కేటాయిస్తామన్నారు. వారికి శిక్షణ ఇచ్చి ఉపాధి కలిగేలా పథకాలు ఏర్పాటు చేస్తామన్నారు.

బడ్జెట్లో ఆదివాసీలకు 10 శాతం నిధులు : మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి

రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులో గిరిజన, ఆదివాసీలకు 10 శాతం కంటే తక్కువ కాకుండా నిధులు కేటాయిస్తామని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి హామీ ఇచ్చారు. ఆదివాసీ బిడ్డలను నాయకులుగా తీర్చిదిద్దడం కోసమే ఈ శిక్షణా తరగతులు ఏర్పాటు చేశామన్నారు. ఆదివాసీ సమాజాన్ని ఒక తాటిపైకి తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. బీజేపీ ప్రభుత్వం హిందూ, ముస్లింల మధ్య మత చిచ్చు పెట్టి పబ్బం గడుపుకుంటోందని విమర్శించారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసి సదుపాయాలు కల్పించలేదన్నారు. ప్రతి తండాలో గ్రామ పంచాయతీ భవనాలు, పాఠశాలలు, అంగనవాడీ కేంద్రాలు నిర్మిస్తామని చెప్పారు. 2029లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి తీరుతుందన్నారు. ఈ సమావేశంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నిషేధిత ఆల్ప్రాజోలం డ్రగ్ తయారీ ముఠా గుట్టు రట్టు

- సుమారు రూ.60కోట్ల విలువ గల ఆల్ప్రాజోలం పట్టివేత
- పోలీసుల అదుపులో నిందితులు : జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్



నవతెలంగాణ-సంగారెడ్డి

నిషేధిత ఆల్ప్రాజోలం డ్రగ్ తయారీ ముఠా గుట్టు రట్టు చేసి, వారి వద్ద నుంచి దాదాపు రూ.60 కోట్ల విలువ చేసే ఆల్ప్రాజోలంను స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఘటన వివరాలను ఎస్పీ వెల్లడించారు. సమాచారం మేరకు.. ముత్తంగి గ్రామానికి చెందిన పాత నేరస్తుడు సుధీర్ గౌడ్ తన కారులో ముత్తంగి నుంచి మెదక్‌కు వెళు తుండగా ముంబాపూర్ గేట్ వద్ద పోలీసులు అతని కారును ఆపి తనిఖీలు చేపట్టారు. ప్రస్తుతం కూడా ఆల్ప్రాజోలంను అమ్మటానికి మెదక్ వెళుతున్నట్టు అతను ఒప్పుకోవడంతో పాటు అతని కారులో రూ.60 కోట్ల విలువ గల ఆల్ప్రాజోలం పట్టుబడిందని ఎస్పీ తెలిపారు.

జీవనోపాధి కోసం బీరంగూడలో నివాసం ఉంటూ, తెలికగా డబ్బు సంపాదించాలనే దురాశతో 2014లో సుధీర్ గౌడ్ అతని భార్య శ్రీవాణి, అతని తమ్ముడు ప్రభుగౌడ్ కమిషన్‌కు కల్లులో కలిపే నిషేధిత ఆల్ప్రాజోలం మత్తు మందును అమ్మేవారు. ఆ అనుభవంతో 2017లో కానుకుంటకు చెందిన విశాల్ గౌడ్ అనే వ్యక్తిని పరిచయం చేసుకుని అతని నుంచి ఆల్ప్రాజోలం తీసుకొని అమ్మేవారు. 2020లో గుమ్మడిదలకు చెందిన సాయిగౌడ్ అనే వ్యక్తిని పరిచయం చేసుకుని అతని నుంచి ఆల్ప్రాజోలం కొని అమ్మేవాళ్లు. కమిషన్ ద్వారా వచ్చే డబ్బులు సరిపోక, వ్యాపారంలో అధిక లాభాలను చూసి సొంతంగా వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. ఇదే సమయంలో విశాల్ గౌడ్.. ముత్తంగికి చెందిన బీశ్వేశ్వర్ సింగ్‌ను పరిచయం చేయగా, అప్పటి నుంచి వీరందరూ కలిసి ఈ నిషేధిత ఆల్ప్రాజోలం వ్యాపారం చేస్తున్నారు. బీశ్వేశ్వర్ సింగ్‌కు ఆల్ప్రాజోలంను తయారు చేసే పద్ధతి తెలియడంతో అప్పటి నుంచి దాన్ని తయారు చేసి విక్రయించేవారు. అలా విక్రయించేందుకు మెదక్ వెళుతున్నట్టు అందిన సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టగా.. సుధీర్‌గౌడ్ సరుకుతో పాటు పట్టుబడ్డాడు. నిందితున్ని పట్టుకొని ఆల్ప్రాజోలంను స్వాధీనం చేసుకున్న పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివ కుమార్, జిన్నారం ఇన్‌స్పెక్టర్ నయీముద్దీన్, గుమ్మడిదల ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి, సీసీఎస్ ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

ఫిబ్రవరి 9,10 తేదీల్లో హైదరాబాద్‌లో ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాలు వచ్చేనెల తొమ్మిది, పది తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్నాయి. శనివారం హైదరాబాద్‌లో ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు జాతీయ సమితి సమావేశాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ-2020) రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. అది అమల్లోకి వస్తే దేశానికి, విద్యారంగానికి ప్రమాదకరమని చెప్పారు. ఎన్ఈపీ రద్దు కోసం విద్యార్థులు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యారంగంపై కేంద్రం ఆధిపత్యంలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నదని అన్నారు. విద్యా కేంద్రీకరణ, కార్పొరేటీకరణ, వ్యాపారీకరణ, కాషాయీకరణను ప్రోత్సహించే నిర్ణయాలు చేస్తున్నదని విమర్శించారు. ఎన్ఈపీ పేరుతో విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తున్నదని అన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేస్తున్నదని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో పది శాతం, జీడీపీలో ఆరు శాతం నిధులను విద్యారంగానికి కేటాయించకుండా ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ప్రభుత్వ విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాల్లో ఖాళీలను భర్తీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. పాఠ్యపుస్తకాల్లో ప్రజాస్వామ్యం, లౌకికవాదం పదాలతోపాటు డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించిందని అన్నారు. వాటి స్థానంలో ఆర్ఎస్ఎస్‌కు చెందిన హెడ్గేవార్, వీర సావర్కర్ వంటి వారి చరిత్రను పొందుపరుస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ చరిత్రను, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని వక్రీకరిస్తున్నదని చెప్పారు. ఎన్ఈపీ-2020ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వచ్చేనెల తొమ్మిది, పది తేదీల్లో జరిగే ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాలను విజయవంతం చేయాలని ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ స్టాలిన్ కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఉపాధ్యక్షులు గ్యార క్రాంతి, నాయకులు వంశీవర్ధన్‌రెడ్డి, ఎండీ అన్వర్, చైతన్య యాదవ్, హరీశ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే దేశం ఒకే ఎన్నికతో నియంత పాలన

- సెప్టెంబర్ 21 నుంచి చండీగఢ్‌లో జాతీయ మహాసభలు : సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఒకే దేశం.. ఒకే ఎన్నిక విధానాన్ని తేవడం ద్వారా దేశంలో నియంత పాలనను తెచ్చేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నాలను వేగవంతం చేసిందని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా విమర్శించారు. కేంద్రం విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలకు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్ బండ్లగూడలోని గిరిప్రసాద్ భవన్‌లో శనివారం సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఐ శతాబ్ది వేడుకలు, జాతీయ మహాసభలు, స్థానిక సంస్థల ఎన్నికలు, ప్రజా సమస్యలు, ఉద్యమాలు, తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. ఇటీవల కాలంలో మరణించిన వారికి సంతాప సూచకంగా మౌనం పాటించారు. అనంతరం అజీజ్‌పాషా మాట్లాడుతూ ఇటీవల జరిగిన వివిధ రాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో గెలిచేందుకు బీజేపీ కూటమికి ధనబలంతోపాటు, ఇండియా కూటమి అనైక్యత కూడా తోడైందని తెలిపారు. దీంతో బీజేపీ విజయం సులభమైందని చెప్పారు. దేశానికి వెన్నెముక అయిన రైతుల ఉద్యమం ఢిల్లీ వేదికగా నేటికీ కొనసాగుతోందనీ, దీనికి సంఘీభావంగా రాష్ట్రంలో సైతం పెద్ద ఎత్తున పోరాటాలను నిర్వహించాలని సూచించారు. సీపీఐ శతాబ్ది వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. అందుకోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ సమరశీల పోరాటాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. సీపీఐ 25వ జాతీయ మహాసభలు చండీగఢ్‌లో సెప్టెంబర్ 21 నుంచి 24 వరకు జరుగుతాయని వివరించారు. ఈ సందర్భంగా మేలో దేశంలోని నలుమూలల నుంచి నాలుగు జాతాలు ప్రారంభమై చండీగఢ్ చేరుకుంటాయని చెప్పారు. ఆగస్టు 31 నాటికి గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అన్ని మహాసభలనూ పూర్తి చేసుకోవాలని అన్నారు. అనంతరం కార్యదర్శి నివేదికను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రవేశపెట్టారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, పశ్యపద్మ తదితరులు హాజరయ్యారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటై అప్పులు

- మనస్తాపంతో యువకుని ఆత్మహత్య



నవతెలంగాణ-వర్ధన్నపేట

ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి అనేకమంది యువకులు అర్థాంతరంగా ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో లైశెట్టి రాజు (26) ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడి దాదాపు రూ.40 లక్షల వరకు పోగొట్టుకున్నాడు. దాంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడు ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడి అర్థాంతరంగా మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండె పగిలేలా రోదిస్తున్నారు. స్థానికులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కూరగాయలు, పాల వ్యాపారం చేసుకునే తల్లిదండ్రులకు కొడుకు రాజు.. చేదోడువాదోడుగా ఉంటూ రోజూ ఉదయం గ్రామంలో ఇంటింటికీ పాల ప్యాకెట్లు వేసి ఉపాధి పొందేవాడు. కాగా ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడ్డ రాజు.. డబ్బుల కోసం తండ్రిని వేధిస్తుండేవాడు. తండ్రి కన్న కొడుకును కాదనుకోలేక ఊళ్లోనే దాదాపు రూ.15 లక్షల వరకు అప్పులు చేశాడు. అయినా ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసైన కొడుకు డబ్బుల కోసం కొంతకాలంగా తండ్రిని వేధిస్తూనే ఉన్నాడు. రెండు రోజుల ముందు కూడా లక్ష రూపాయలు ఇవ్వగా అవి కూడా పోగొట్టుకున్నాడు. దాంతో మరో రూ.4లక్షలు ఇవ్వాలని, లేదంటే తనకు ఆత్మహత్యే శరణమని చెప్పడంతో తల్లిదండ్రులు దిక్కుతోచక మనోవేదనకు గురయ్యారు. తెలిసిన వారందరి దగ్గరా అప్పులు చేయడంతో మళ్లీ అప్పు పుట్టడం లేదని కొడుకుకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కుటుంబసభ్యులు. డబ్బులు ముట్టకపోవడంతో రాజు శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు రాజు సెల్‌ఫోన్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు.

కాగ్నిజెంట్‌లో పదవీ విరమణ వయసు పెంపు



బెంగళూరు : దిగ్గజ టెక్ కంపెనీ కాగ్నిజెంట్ తన ఉద్యోగుల పదవీ విరమణ వయసును 58 నుంచి 60కి పెంచాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉద్యోగులకు సమాచారం ఇచ్చింది. ఇది భారత్‌లోని అన్ని కాగ్నిజెంట్ కార్యాలయాల్లో పనిచేసే సిబ్బందికి వర్తిస్తుందని వెల్లడించింది. అనుభవజ్ఞులైన నిపుణుల సేవలను సద్వినియోగం చేసుకొనేందుకు ఈ మార్పు చేపట్టినట్లు తెలుస్తోంది. దేశంలోని అనేక ఐటి కంపెనీలు ప్రస్తుతం తమ సంస్థలో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయసును 58 ఏళ్లుగా నిర్ణయించాయి. తాజాగా కాగ్నిజెంట్ ఈ వయసును 60కి పెంచడంతో మిగతా కంపెనీలు ఇదే బాటలో నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. తమ సంస్థకు భారత్‌లో 2.50 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారని కాగ్నిజెంట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) రవి కుమార్ పేర్కొన్నారు. ఇంతక్రితం పెద్ద నగరాల్లోనే తమ కార్యాలయాలు ఉండేవని.. ఇప్పుడు చిన్న నగరాలకూ విస్తరించామన్నారు.



తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఇటీవల నూతనంగా భాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు శనివారం గంట శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ డివిజన్ పాస్టర్స్, క్రైస్తవన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పాస్టర్ బత్తుల మొజేశ్, చంద్ర శేఖర్, ఇమ్మనుయెల్, యేసయ్య తదితరులు జక్కిడి శివ చరణ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత పుష్పగుచ్చం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు.

నవతెలంగాణ-హయత్‌నగర్

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం



నవతెలంగాణ-హయత్ నగర్

ఇద్దరు వ్యక్తులు అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం.. మునగానూర్ గ్రామంలో గల మల్లికార్జున నగర్ కాలనీలో నివాసముంటున్న దోమలపల్లి మహిపాల్ నాలుగేండ్ల కిందట తన భార్యతో విడాకులు తీసుకున్నాడు. అప్పటి నుంచి పూర్తిగా మానసిక క్షోభకు గురై తల్లితో కలిసి ఉంటున్నారు. ఈ నెల 7వ తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

హయత్ నగర్‌లోని అయ్యప్ప కాలనీలో నివాసముంటున్న చెరుపల్లి నర్సింహ. ఈ నెల 9న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. దీంతో అతని కుటుంబ సభ్యులు అతని కోసం తెలిసిన వారివద్ద విచారించిన ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేస్ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వినియోగదారులకు సత్వర సేవలందించాలి



- అధికారులకు ఎండీ అశోక్ రెడ్డి ఆదేశం
- తట్టిఖానా సెక్షన్ పరిశీలన
- ట్యాంకర్ డెలివరీల్లో పెండెన్సీ లేకుండా చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-సిటీబ్యూరో

వేసవిలో జలమండలి వినియోగదారులకు సత్వర సేవలు అందించేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు. తట్టిఖానా సెక్షన్‌ను ఆయన జలమండలి అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ వెయిటింగ్ పిరియడ్, పెండెన్సీ తగ్గించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. వాటిని సమర్థంగా అమలు చేస్తే.. సకాలంలో వినియోగదారులకు ట్యాంకర్ డెలివరీ చేసే అవకాశం ఉంటుందన్నారు. కమర్షియల్ విధానంలో ట్యాంకర్లు బుక్ చేసే.. హాస్టళ్లు, హాస్పిటల్స్, హెూటల్స్, మాల్స్ తదితర వినియోగదారులతో అగ్రిమెంట్ చేసుకోవాలని అధికారులకు సూచించారు. పగటి సమయంలో గృహ వినియోగదారులకు ఇబ్బంది లేకుండా రాత్రి సమయంలో వీరికి ట్యాంకర్ డెలివరీ చేసేందుకు ఏర్పాటు చేయాలన్నారు.

20 ట్యాంకర్లతో దాదాపు 150 ట్రిప్పులను డెలివరీ

తట్టిఖానా సెక్షన్‌లో ఇప్పటికే 20 ట్యాంకర్లతో దాదాపు 150 ట్రిప్పులను డెలివరీ చేస్తున్నారు. ఇదే డిమాండ్ కొనసాగితే ఏప్రిల్ నాటికి రోజూ 400 ట్రిప్పులు కావాలి. ఇప్పుడున్న ఫిల్లింగ్ స్టేషన్‌లోని ఫిల్లింగ్ పాయింట్స్ నిర్మాణ పద్ధతి వల్ల ఒక ట్యాంకర్ నింపడానికి 15 నిమిషాలు పడుతుంది. తగిన ఏర్పాట్లు చేయడం వల్ల ఈ ఫిల్లింగ్ సమయాన్ని 5 నిమిషాలకు తగ్గించుకుంటే అనుకున్నదానికంటే రెట్టింపు ట్రిప్పులు సరఫరా చేయవచ్చని అంచనా వేశారు. దీని వల్ల వెయిటింగ్ పిరియడ్, పెండెన్సీ తగ్గడంతో పాటు, ప్రజలకు సకాలంలో నీరు సరఫరా చేయవచ్చు. గతేడాది భూగర్భ జలాలు అడుగంటడంతో ఫిబ్రవరి నెలలో ట్యాంకర్లకు డిమాండ్ పెరగడం ప్రారంభమైంది. ఏప్రిల్ నెలలో డిమాండ్ తారస్థాయికి చేరి, లక్షా 70వేల ట్యాంకర్లు డెలివరీ చేసే పరిస్థితి వచ్చింది. ఈ సారి అలాంటి సమస్యలు రాకుండా.. తగిన ఏర్పాట్లు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో సీజీఎం ప్రభు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు

- డీసీపీ పాటిల్ కాంతిలాల్



నవతెలంగాణ - చంపాపేట్

హైదరాబాద్ సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ ఐపీఎస్ సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్రాంతి ఆనందోత్సవాలతోను జరుపుకోవాలని ఆకాంక్షించారు. శాంతి భద్రత పరిరక్షణ ప్రజలందరూ పోలీసులను సహకరించాలని కోరారు.

సంక్రాంతి పండగకు ఊరికి వెళ్ళే ప్రజలకు దొంగతనాల నివారణపై ముఖ్య సూచనలు..

- మీరు ఊరికి వెళ్ళే సమయంలో వీలైనంత మేరకు ఇంటిలో విలువైన వస్తువులు, నగదు, బంగారు ఆభరణాలు పెట్టకండి వాటిని బ్యాంకు లాకర్లో లేదా భద్రంగా ఉన్న చోట దాచుకోవడం ఉత్తమం.
- బీరువా తాళం చెవులు బీరువా పైన కానీ, బీరువాలోని బట్టల క్రింద, ఇంట్లో పెట్టి వెళ్లవద్దు.
- వాహనాలను ఇంటి వద్దనే పార్క్ చేసి తాళం చెవులు వెంట తీసుకుని వెళ్తే మంచిది.
- ఇంటి ముందు తలుపులకు సెంటర్ లాక్ వేసి బయట గొళ్ళెం పెట్టకండి
- ఇళ్లకు నాసిరకం తాళాలు వాడొద్దు, తాళం కనపడకుండా కర్టెన్స్ వేయాలి.
- ఇంటి తలుపుల ముందు చెప్పులు ఉంచండి.
- బయట గేటుకు లోపల నుంచి తాళం వేయండి.
- బయటకు వెళ్ళేప్పుడు ఇంట్లో, బయట లైట్ వేసి ఉంచండి.
- పేపర్ బాయ్, పాలు వేసే వాళ్లకు రావద్దని చెప్పండి.
- నమ్మకమైన వాచ్‌మెన్‌లను మాత్రమే నియమించుకోండి.
- మీరు ఊరికి వెళ్ళేటప్పుడు మీకు నమ్మకమైన వారికి అలాగే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వండి.
- ఊరికి వెళ్ళిన తర్వాత కూడా ఇంటి పక్క వారికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకుంటూ ఉండాలి.
- బయటకు వెళ్లేటప్పుడు, వాకిట్లో ముగ్గులు వేసేటప్పుడు మెడలోని బంగారు ఆభరణాలు జాగ్రత్త. వీలైతే చీర కొంగుతో కవర్ చేసుకుంటే మంచిది.
- మీ కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే దొంగలు భయపడే అవకాశం ఉంది, భద్రత ఎక్కువగా ఉంటుంది.
- మీ ఇంటికి సీసీ కెమెరాలు సొంతంగా ఏర్పాటు చేసుకుని డీవీఆర్‌ని రహస్య ప్రదేశాలలో భద్రపర్చుకోవాలి. మొబైల్ యాప్ ద్వారా సీసీ కెమెరా దృశ్యాలు ఎప్పటికప్పుడు వీక్షించే అవకాశం ఉంటుంది. మీరు బస్సు లేదా రైలు ప్రయాణ సమయంలో అపరిచిత వ్యక్తులు ఇచ్చిన తిను బండారాలు తీసుకోకూడదు.
- మీ వెంట విలువైన వస్తువులను తీసుకుని వెళుతున్నట్లయితే అట్టి బ్యాగును మీ దగ్గరే జాగ్రత్తగా అంటి పెట్టుకుని ఉంచుకోవలెను.
- మీరు బయటికి వెళ్ళే విషయాన్ని ఎట్టి పరిస్థితుల్లో సోషల్ మీడియాలో షేర్ చేయకండి.
- మీకు ఎవరి మీదైనా అనుమానంవస్తే 100 టోల్ ఫ్రీ నెంబర్‌కు తెలపండి.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



నవతెలంగాణ-హయత్‌నగర్

డివిజన్‌లోని కమలానగర్‌లో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాలనీవాసులతో కలసి హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. పనులను త్వరగా పూర్తి చేసి స్థానికులకు అందుబాటులోకి తీసుకొని రావాలని కోరారు. రాబోవు కాలంలో కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సీసీ రోడ్ నిర్మాణ పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో టీవీ రావు, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ పూడికతీయించిన ఎమ్మెల్యే బలాల



నవతెలంగాణ - మలక్‌పేట్

మలక్‌పేట్‌లోని బాగ్ ఎ జవహర కాలనీలో నెలకొన్న డ్రైనేజీ, తాగు నీరు ఇతర సమస్యలను ఆ ప్రాంతవాసులు శనివారం ఎమ్మెల్యే బలాల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే కాలనీలో పర్యటించారు. తర్వాత ఆ సమస్యలపై అధికారులు, స్థానికులతో కలిసి సమీక్షించారు. ఇంకా దగ్గరుండి డ్రైనేజీ పూడికతీత పనులు చేయించారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా అదనపు పైప్ లైన్లు వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చెత్తా చెదారాన్ని డ్రైనేజీల్లో వేయకుండా మున్సిపాలిటీ చెత్త వాహనాల్లో వేయాలని ప్రజలకు సూచించారు. రహదారులపై చెత్త వేస్తే అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని. కాలనీని శుభ్రంగా ఉంచి నియోజకవర్గానికి ఆదర్శంగా తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మంచినీటి శాఖ అధికారులు, కాలనీవాసులు, ఎంఐఎం పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ- బడంగ్ పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఎంతో కృషి చేస్తున్నారని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాలాపూర్, బడంగ్ పేట్ స్మశాన వాటికలలో జరుగుతున్న అభివృద్ధి పనులను మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ పి.సరస్వతి, డీఈఈ జ్యోతి రెడ్డి, కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, పెద్దబావి శ్రీనివాస్ రెడ్డి, భీమిడి స్వప్న జంగారెడ్డి, బండారి మనోహర్, నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, గౌర శ్రీనివాస్, బంగారు ప్రభాకర్, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ యాదగిరి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బడంగ్‌పేట్ 18వ డివిజన్ శ్రీ బాలాజీ టౌన్ షిప్, శుభోదయ కాలనీ, సీపీఎన్ఆర్ ఫేస్ 2 కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ బండారు మనోహర్‌తో కలిసి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహా రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ జ్యోతి రెడ్డి, కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, నాయకులు ప్రతాప్ రెడ్డి, అప్పారావు, నరేందర్ రెడ్డి, సంజీవ రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

చైనీస్ మాంజా వాడితే చర్యలు : డీసీపీ



నవతెలంగాణ-మలక్‌పేట్

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నగరాల్లో ఎగురవేసే గాలిపటాలకు చైనీస్ మాంజాలు వాడితే చట్టపరమైన చర్యలు తప్పవని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్ హెచ్చరించారు. హైదరాబాద్ నగర కమిషనర్ ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బందితో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైనీస్ మాంజాను వినియోగించడం వలన పక్షులకు హానికరమని, ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారికి ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ముఖ్యంగా ఇవి విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంక్రాంతి పండుగకి ఊళ్ళకి వెళ్లేవారు పోలీసులకు, చుట్టుపక్కల వారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇంటి తాళాలు పూల కుండీలు, షూ రాక్, డోర్ మ్యాట్ కింద పెట్టవద్దని అన్నారు. తాళాలు విలువైన వస్తువులను తమ వెంట తీసుకువెళ్లాలని కోరారు. పని మనుషులు ఉంటే ఇంటి ఆవరణను శుభ్రపరుస్తూ ఉండమని, ఇంటి డోర్ సెంటర్ లాక్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలు ఉన్న ఇంటి యజమానులు ప్రతిరోజు ఆన్లైన్‌లో ఎప్పటికప్పుడు చూస్తూ ఉండాలని అన్నారు. ఊరికి వెళ్లేవారు వివరాలు సోషల్ మీడియాలో పోస్ట్ చేయవద్దని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎవరిపైన అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు.

విజయవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్



నవతెలంగాణ-హయత్ నగర్

సంక్రాంతికి నగర వాసులు తమ సొంత ఊర్లకు వెళ్తుండగా హైదరాబాద్ నగరం నుండి విజయవాడ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు, తోటి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం ఎల్బీనగర్ మాల్ మైసమ్మ ఫ్లై ఓవర్ వద్ద మొదలైన వాహనాల రద్దీ అక్కడి నుంచి ఎల్బీనగర్ బస్ స్టాప్, పల్లవి గార్డెన్, హయత్‌నగర్ బస్ స్టాప్, రామోజీ ఫిల్మ్ సిటీ నుండి కొత్త గూడెం, పంతంగి టోల్ గేట్ వరకు ఉంది. బస్ స్టాప్‌ల వద్ద ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు బస్‌లు, ట్రావెల్స్ బస్సులు, కార్లు ఇష్టమొచ్చినట్లు రోడ్లపై వాహనాలు నిలపడంతో వాహనాలు బారులు తీరాయి. వాటిని దృష్టిలో పెట్టుకొని ప్రతి వాహన దారుడు ఫాస్ట్ ట్యాగ్ వద్ద ట్రాఫిక్ జామ్ కాకుండా ఉండేందుకు ప్రతి వాహన దారుడు ఫాస్ట్ ట్యాగ్‌లో తగినంత నగదు ఉంచుకోవాలని, అలాగే ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా, ప్రమాదాలు జరగకుండా ప్రయణాలు సాఫీగా సాగేలా విధులు నిర్వహిస్తున్నట్టు సీపీ సుధీర్ బాబు తెలిపారు.

అక్షర ఇంటర్నేషనల్ పాఠశాలలో గ్రామోత్సవ్-2025



నవతెలంగాణ - హస్తినాపురం

నేటి తరం ఆధునిక విద్యార్థులకు గ్రామీణ ప్రజల జీవన విధానాలను, వారి స్థితిగతుల గురించి వారికి అవగాహన కల్పించే విధంగా అక్షర ఇంటర్నేషనల్ స్కూల్, ఎల్బీనగర్ బ్రాంచ్ అక్షర గ్రామోత్సవ్-2025 కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు గ్రామీణ నేపథ్యాన్ని ప్రదర్శిస్తూ చేసిన కళాకండాలు, నృత్యాలు, అలాగే గ్రామాల్లో ఉండే నివాస గృహాలు, అలనాటి చరిత్రను తలపించేలా చేసిన కార్యక్రమాలు, విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల సీఈఓ అరిశనపల్లి మదన్ మోహన్ రావు మాట్లాడుతూ నేటితరం విద్యార్థులకు గ్రామీణ ప్రాంతాలలో ప్రజల జీవన విధానం, వారి నేపథ్యం మీద అవగాహన ఉండాల్సిన అవసరం ఉన్నదని, మారుతున్న ప్రజల జీవన విధానం మూలాన నాటి గ్రామీణ చరిత్రను నేటి తరం తెలుసుకోవలసిన అవసరం ఉన్నదని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రిన్సిపాల్ రమణి వారణాసి మాట్లాడుతూ కాలానుగుణంగా నేటి తరానికి అంతర్జాతీయ పద్ధతిలో ప్రపంచంతో పోటీపడేలా భోధన చేస్తూనే నాటి గ్రామీణ చరిత్రను, ప్రజల ఇతివృత్తాన్ని పాఠశాల విద్యార్థులకు బోధిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్, పాఠశాల సిబ్బంది మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'వడ్డెర్ల ఐక్యతకు నాంది ఓబన్న జయంతి'



నవతెలంగాణ-చంపాపేట్

వడ్డెర్ల ఐక్యతకు నాంది వడ్డే ఓబన్న జయంతి అని వడ్డెర రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గుంజి సంతోష్ కుమార్, తమ్మిశెట్టి శివకృష్ణ అన్నారు. వీఆర్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో వడ్డే ఓబన్న జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్పీఎస్ ఆధ్వర్యంలో వడ్డెర ప్రజానీకానికి చేసిన అవేర్నెస్ కార్యక్రమం విజయవంతమైందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా రెండోసారి ఓవన్న జయంతిని నిర్వహించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంవత్సరం వడ్డే ఓపెన్ జయంతిని రాష్ట్రవ్యాప్తంగా వీఆర్పీఎస్, ఇతర కుల సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భక్తుల ఉపేంద్ర, వీఆర్పీఎస్ నాయకులు పల్లపు ఉదయ్, వల్లపు సందీప్, పల్లపు శ్రీకాంత్, పల్లపు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-హయత్ నగర్

వడ్డే ఓబన్న జయంతి వేడుకలను పలువురు రాజకీయ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు శనివారం కామినేని విగ్రహం వద్ద ఉన్న ఆయన చిత్ర పటానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అర్బన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మామిడి రామ్ చందర్ పాల్గొన్నారు. అదేవిధంగా హయత్ నగర్‌లో ఉన్న ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన వడ్డెర సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎత్తిరి భీమయ్య, దళిత సంఘాల నేతలు పారంద స్వామి, ఎర్ర రవీందర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌వన్ యూనియన్ సేవలు అభినందనీయం



-కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

నవతెలంగాణ -నాగోల్

తెలంగాణ మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ హెచ్‌వన్ యూనియన్ ఉద్యోగులకు చేస్తున్న సేవలు అభినందనీయమని హెచ్‌వన్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. హెచ్‌వన్ యూనియన్ 2025 సంవత్సరం డైరీని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఉద్యోగులకు అండగా ఉంటుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో వైద్య ఉద్యోగుల సంక్షేమం కోసం యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కర్నాటి సాయి రెడ్డి చేస్తున్న కృషి కార్యక్రమాలపై ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మల్లయ్య, కోశాధికారి రామచంద్రయ్య, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



నవతెలంగాణ- బడంగ్‌పేట్

సీఎం సహాయ నిధి పథకంతో పేద ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని కార్పొరేటర్లు యాతం పవన్ కుమార్ యాదవ్, చుక్క శివ కుమార్‌లు అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మామిడిపల్లి గ్రామంలోని లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మామిడిపల్లి శ్రీ వెంకటేశ్వర బాలాజీ స్వామి టెంపుల్ మాజీ చైర్మెన్ గోపాల్ యాదవ్, ముదిగొండ శంకర్ యాదవ్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
ఆదివారం | జనవరి 12, 2025 | www.navatelangana.com

వ్యవసాయానికి అనువుగా లేని భూముల పరిశీలన



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఘట్కేసర్ మండలంలోని పోచారం గ్రామంలో సర్వే నెంబర్ 35, 37, 38, 39, 40, 60, 61 లోని వ్యవసాయానికి అనువుగా లేని భూములను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. అలాగే యన్నంపేట గ్రామంలోని సర్వే నెంబర్ 121, మేడిపల్లి మండలంలోని బోడుప్పల్ సర్వే నంబర్ 168 భూములను కూడా పరిశీలించారు. అదనపు కలెక్టర్ వెంట కీసర ఆర్డీవో సైదులు, ఘట్కేసర్ తహశీల్దార్ రజిని ఉన్నారు.

ఘనంగా వడ్డె ఓబన్న జయంతి



నవతెలంగాణ - జవహర్ నగర్

జవహర్ నగర్ వడ్డెర సంఘం అధ్యక్షుడు ఇరగ దిండ్ల వెంకటేష్ ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధులు వడ్డెర ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జవహర్ నగర్ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ హాజరై ఓబన్న విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కుతాడి సాయి, పల్లపు రవి కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్ గౌడ్, వడ్డెర సంఘం ఉపాధ్యక్షులు మల్లేశం, తిరుపతి, నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కలిసిన ఈసీ నగర్ కార్యవర్గం



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్‌లోని ఈసీ నగర్ నూతన కార్యవర్గం డాక్టర్ ఏఎస్‌రావు నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహేష్ గౌడ్, అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ పద్మిని, కార్యదర్శి జగ్గ రాజు, కోశాధికారి ఇందిరా ఆనంద్ గౌడ్, భిక్షపతి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి



నవతెలంగాణ-ఘట్కేసర్

విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, సేవా ధృక్పథాన్ని పెంపొందించడానికి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చేస్తున్న కృషి అభినందనీయమని డీఆర్డీప శాస్త్రవేత్త డాక్టర్ యోగేష్ తెలిపారు. శనివారం ఘట్కేసర్ పట్టణంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాస్త్రీయ పరిశోధనలు, విద్యా రంగంలో విద్యార్థులు ప్రముఖపాత్ర పోషించేలా నిరంతరం కృషి చేయాలని ఆయన సూచించారు. అనంతరం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి క్రమ శిక్షణ, పట్టుదలతో నిరంతరం కృషి చేస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని చెప్పారు. కాగా విద్యార్థినీ, విద్యార్థులు నిర్వహించిన సంస్కృతి కార్యక్రమాలు అందరినీ ఆలరించారు. వివిధ రంగాలలో అత్యంత ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతుల అందజేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎస్ చైర్మెన్ రాఘవేంద్రరెడ్డి, డైరక్టర్లు విజయపాల్ రెడ్డి, రాధికారెడ్డి, ప్రిన్సిపల్ నీతుగుప్తా, ఆధ్యాపకులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అక్షర ఇంటర్నేషనల్ స్కూల్‌లో గ్రామోత్సవ్-2025



నవతెలంగాణ-కాప్రా

కాలానుగుణంగా మారుతున్న సమాజంలో ప్రజల జీవన విధానం ఎంతగానో మారింది. తదనుగుణంగా ప్రజల జీవన శైలిలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. భావి తరాలకు నాటి గ్రామీణ ప్రజల జీవన విధానాన్ని తెలియచేయడానికి, చారిత్రక మానవ శైలిని నేటి తరం బాలబాలికలకు తెలియజేయడానికి అక్షర ఇంటర్నేషనల్ స్కూల్ ఏఎస్‌రావు నగర్ బ్రాంచ్‌లో అక్షర గ్రామోత్సవ్ పేరుతో ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించా రు. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజల వేషధారణలో అలరించారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఉండే కులవృత్తులు, వారి రోజువారీ కార్యక్రమాలను తలపించేలా విద్యార్థులు చేసిన కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. పాఠశాల విద్యార్థులు బృందాలుగా విడిపోయి వారు గ్రామీణ నేపథ్యాన్ని ప్రదర్శిస్తూ చేసిన కళాకండాలు, నృత్యాలు, గ్రామాల్లో ఉండే నివాస గృహాలు, అలనాటి చరిత్రను తలపించేలా చేసిన కార్యక్రమాలు మైమరపించాయి. ఈ సందర్భంగా పాఠశాల సీఈఓ అరిశనపల్లి మదన్ మోహన్‌రావు మాట్లాడుతూ.. నేటితరం విద్యార్థులకు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల జీవన విధానం, వారి నేపథ్యం మీద అవగాహన ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ రితిక మాట్లాడుతూ.. కాలానుగుణంగా నేటి తరానికి అంతర్జాతీయ పద్ధతిలో ప్రపంచంతో పోటీపడేలా బోధన చేస్తూనే నాటి గ్రామీణ చరిత్రను, ప్రజల ఇతివృత్తాన్ని పాఠశాల విద్యార్థులకు బోధిస్తున్నా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జ్యోతిర్లింగ ఆలయాన్ని సందర్శించిన మైనంపల్లి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు జన్మదినోత్సవం సందర్భంగా నాందేడులోని జ్యోతిర్లింగ టెంపుల్‌ను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు మైనంపల్లిని మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో రాజకీయంగా ఇంకా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వై. ప్రేమ్ కుమార్, జితేంద్రనాథ్, నాయకులు కపిలేశ్వర్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లోని ప్రజల సమస్యలను పరిష్కరిస్తాం



కార్పొరేటర్ వై. ప్రేమ్‌కుమార్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని దుర్గా నగర్ కాలనీలోని పలు సమస్యలను పరిష్కరిస్తామని స్థానిక కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్ అన్నారు. శనివారం కాలనీలోని సమస్యలను తెలుసుకోడానికి డివిజన్‌లోని పలు కాలనీల్లో పర్యటించారు. కాలనీలో నాలా వద్ద రోడ్డు నిర్మాణం, విద్యుత్ స్తంభాలు, మంచినీరు సరఫరాలో ఇబ్బందులు ఉన్నాయని, పాడైపోయిన బోర్‌ను రిపేర్ చేయాలని తదితర సమస్యలను కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దుర్గా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నర్సింహారెడ్డి, జనరల్ సెక్రటరీ వీరాచారి, విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ గోపాల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సత్యమూర్తి, బ్రహ్మయ్య, కిషోర్, కాలనీ సభ్యులు దుర్గాప్రసాద్, శంకర్, ద్రోణాచారి, సూర్యప్రసాద్, లక్ష్మయ్య, కృష్ణ, యాదగిరి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

- ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి
- ఘట్కేసర్‌లో పలు అభివృద్ధి పనులకుశంకుస్థాపన



నవతెలంగాణ-ఘట్కేసర్

ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మున్సిపాలిటీలో రూ.2 కోట్ల 30 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో ఎప్పుడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెడుతుందన్నారు. సీఎం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలు దేశంలో ఎక్కడా లేవని చెప్పారు. జనవరి 26 నుంచి రైతు భరోసా అందిస్తున్నట్టు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాలలోనూ మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం ఎన్ని నిధులైనా ఇస్తుందని చెప్పారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, మున్సిపాలిటీ చైర్ పర్సన్ పావని జంగయ్య యాదవ్, వైస్ చైర్మెన్ మాధవరెడ్డి, మేడ్చల్ బీబ్లాక్ అధ్యక్షుడు మహేష్ గౌడ్, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యాలు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొక్క సంజీవరెడ్డి మేడ్చల్ జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షుడు సయ్యద్ అస్రాఫ్ అలీ కౌన్సిలర్ల తో కలిసి బాలాజీ నగరలో ర్యాలీ నిర్వహించి మహేందర్‌రెడ్డికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార వారధి నవతెలంగాణ

- సీఐటీయూ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.చంద్రశేఖర్



నవతెలంగాణ - చర్లపల్లి

ప్రజా సమస్యలను ప్రభుత్వానికి తెలిజేస్తూ ప్రజలకి ప్రభుత్వానికి మధ్య వారధిగా నవతెలంగాణ పత్రిక అండగా నిలుస్తుందని సీఐటీయూ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.చంద్రశేఖర్ అన్నారు. శనివారం నవతెలంగాణ చర్లపల్లి ఏరియా క్యాలెండర్‌ను కమలానగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఆవిష్కరించారు. నవతెలం గాణ ప్రజాశక్తి వరావడికతోనే ప్రతి అక్షరం రాస్తున్నదని సెంటర్ పబ్లిక్ సెక్టార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నాయకులు జె.రాఘవరావు అన్నారు. ప్రజాశక్తిగా ఉన్న పత్రిక రాష్ట్ర విభజన తర్వాత నవ తెలంగాణగా అవతరించిందన్నారు.అనంతరం సీఐటీయూ మేడ్చల్ జిల్లా నాయకులు జి.శ్రీనివాసులు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కరించడంలో నవతెలంగాణ తన వంతు పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. అత్యంత విలువైన దినపత్రికగా పేరు ప్రతిష్టలు సంపాదించుకుంటున్న పత్రిక ఏదైనా ఉందంటే అది నవతెలంగాణ మాత్రమే అని సీఐటీయూ మేడ్చల్ జిల్లా కార్యాలయ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ చర్లపల్లి రిపోర్టర్ పటేల్ నర్సింహులు, కాప్రా డివిజన్ ఇంచార్జ్ రవికుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కుండ భానుచందర్‌కు సన్మానం



నవతెలంగాణ - మేడ్చల్

గుండ్లపోచంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఇటీవల నియమికమైన కుండ భానుచందర్‌ను కాంగ్రెస్ నాయకులు మారేపల్లి సుధాకర్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌లో కష్టపడే వారికి గుర్తింపు లభిస్తుందన్నారు. కుండా భానుచందర్ కింది స్థాయి నుండి అంచలంచెలుగా ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారని తెలిపారు. భానుచందర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో కాంగ్రెస్ ఎస్సీ సెల్ మున్సిపల్ అధ్యక్షుడిగా నియమించిన ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ నగరి ప్రీతం, జిల్లా అధ్యక్షులు పత్తి కుమార్, మేడ్చల్ నియోజకవర్గ ఇన్ చార్జి వజ్రేష్ యాదవ్, జిల్లా అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, గుండ్లపోచంపల్లి మున్సిపల్ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్ యాదవ్ లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మారేపల్లి సుధాకర్,గుండె ఎల్లయ్య,నీరుడి వీరేష్ ముదిరాజ్,శ్రావణ్,జీవన్,రాజుకుమార్ పాల్గొన్నారు.

త్వరలోనే సీనియర్ సిటిజన్స్ భవనం నిర్మిస్తాం

- కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్



నవతెలంగాణ - చర్లపల్లి

సిటిజన్స్ కోసం భవనం త్వరలోనే నిర్మిస్తామని కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ హామీ ఇచ్చారు. శనివారం నాచారం డివిజన్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా డివిజన్ కార్పొరేటర్‌ను వారి నివాసంలో కలిసి నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను అందజేశారు. ఈ సందర్భంగా చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సీనియర్ సిటిజన్స్ కోసం భవనం నిర్మాణ పనులకు, తొందరగా నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని కార్పొరేటర్‌కు వినతిపత్రం కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఈ సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎం.వి.ప్రేమ్ కుమార్, పడాల సాయిబాబా ప్రధాన కార్యదర్శి వి.నాగేశ్వర్, ఉపాధ్యక్షులు ఆర్.జగన్నాథమ్, సంయుక్త కార్యదర్శి జి.శ్రీశైలం ఆర్థిక కార్యదర్శి పోచయ్య, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బోడుప్పల్‌లో వ్యవసాయేతర భూముల పరిశీలన



నవతెలంగాణ-బోడుప్పల్

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయదారులకు అందించే పంట సాయం లెక్క తప్పులేకుండా ఉండేందుకు పకడ్బందీ చర్యల్లో భాగంగా వ్యవసాయ అనుకూల, వ్యవసాయేతర భూముల వివరాలు సేకరిస్తున్నామని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. శనివారం బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని వ్యవసాయేతర భూములకు సంబంధించిన వివరాలు తెలుసుకునేందుకు కీసర ఆర్డీవో సైదులు, మేడిపల్లి రెవెన్యూ అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పంట సాయం కింద అందించే రైతు భరోసాను అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అందులో భాగంగానే వ్యవసాయానికి అనుకూలంగా లేని భూముల వివరాలను సాగు భూముల లిస్ట్‌లో లేకుండా ఉండేందుకు శనివారం వివరాలు తెలుసుకున్నామన్నారు. రైతు భరోసా విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా కేవలం వ్యవసాయ భూములకే రైతు భరోసా అందించేలా చేస్తున్నామని అన్నారు.

సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ముగ్గుల పోటీలు



- కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి

నవతెలంగాణ - చర్లపల్లి

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడానికి సంక్రాంతికి ముగ్గుల ముగ్గుల పోటీలు నిర్వహించడం మంచి పరిణామమన్ని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మల్లాపూర్ డివిజన్‌లోని అశోక్ నగర్ కాలనీలో శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీల ద్వారా మహిళల్లోని సృజనాత్మకత బయటపడుతుందని కార్పొరేటర్ అన్నారు. ముగ్గుల పోటీలను నిర్వహించిన శ్రీశైలం యాదవ్‌ను అభినందించారు. ఈ పోటీలో ప్రథమ బహుమతిని శ్రీలత, ద్వితీయ బహుమతిని అనూష సాధించారు. ఈ కార్యక్రమంలో తండా వాసుగౌడ్, బోదసు నరేష్, బుసాని రఘు, దీపక్ సింగ్, దయాకర్ రెడ్డి, మల్లేష్, అశోక్, రాజేష్, ఉస్మాన్, ముత్యం, ప్రదీప్, నవీన్, ప్రవీణ్ నాయక్ ఉన్నారు.

సెలవులొచ్చాయి ప్రభుత్వ భూముల్లో పాగా వేసేయ్..!



సర్కారు భూముల్లో ఇంటి నిర్మాణాల జోరు

నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని విలువైన ప్రభుత్వ భూములు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్తున్నాయి. శనివారం నుంచి వరస సెలవులు రావడంతో అధికారుల పర్యవేక్షణ ఉండదని భావించిన కబ్జాదారులు ప్రభుత్వ భూముల్లో ఇష్టానుసారంగా నిర్మాణాలకు పూనుకున్నారు. బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెంబరు 63/1,63/26,63/38 వరకు గల ప్రభుత్వ భూముల్లో శనివారం జోరుగా నిర్మాణాలు చేపడుతున్నారు. వరుస సెలవులు రావడం కబ్జాదారులకు వరంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. దీనిపై రెవెన్యూ యంత్రాంగం వెంటనే అప్రమత్తం కావాలని, లేని పక్షంలో విలువైన సర్కారు భూములు అన్యాక్రాంతం అవుతాయని స్థానికులు వాపోతున్నారు.


బోడుప్పల్ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో డిజిటల్ ఫెస్ట్



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్‌లోని సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపర్చేందుకు స్కూల్ యాజమాన్యం సైబర్ స్క్వేర్ సౌజన్యంతో ఒప్పందం కుదుర్చుకుంది. అందులో భాగంగా శనివారం విద్యార్థులకు ఫెస్ట్ మొదటి ఎడిషన్‌ను "ది టెక్నోటోపియా" పేరుతో ఆవిష్కరించింది. శరవేగంతో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలను అందించడానికి ప్రత్యేక శిక్షణనిచ్చేందుకు స్కూల్ యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. డిజిటల్ ఫెస్ట్ మొదటి దశలో భాగంగా విద్యార్థులకు ఏ1 కోడింగ్, రోబోటిక్స్, వెబ్‌సైట్ అభివృద్ధి, టెక్జాక్, ఐఓటీ షోకేసెస్ అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ డిజిటల్ ఫెస్ట్ సాంకేతిక పురోగతి ప్రాముఖ్యత వివరిస్తుందని, వచ్చేతరం ఆవిష్కర్తలను ప్రేరేపించడం లక్ష్యంగా పని చేస్తుందని నిర్వాహకులు వెల్లడించారు. సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం సృజనాత్మక ఆలోచన, సాంకేతిక సహకారం కోసం ఇలాంటి ఫేస్ట్ నిర్వహణలో ముందంజలో ఉందన్నారు. విద్యార్థులలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచడమే లక్ష్యంగా స్కూల్ యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ డాక్టర్ సుమన్‌తో పాటు సైబర్ స్క్వైర్ ప్రతినిధులు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రాక్‌ఉడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో సంక్రాంతి సంబురాలు



నవతెలంగాణ - పోచారం

రాక్‌ఉడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. తెలుగు సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అందరూ పాల్గొన్నారు. ఈ వేడుకలు భోగి మంటలతో ప్రారంభించారు. విద్యార్థులు అందమైన ముగ్గులు, గంగిరెద్దుల ఆటలు, హరికథ, పల్లెటూరు సంప్రదాయ ఆటలతో సందడి చేశారు. పల్లెటూరి వాతావరణాన్ని గుర్తు చేసే రీతిలో జల్లికట్టు, కోడి పందాల ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రత్యేక వంటకాలతో రుచికరమైన భోజనాలు ఏర్పాటు చేశారు. మట్టి బొమ్మల ప్రదర్శన పర్యావరణహిత సొగసును తెలిపింది. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, "మన పూర్వీకుల సంస్కృతి, సంప్రదాయాలు పాఠశాల విద్యార్థులకు అందించడమే ఈ వేడుకల ముఖ్య ఉద్దేశ్యం. సంక్రాంతి తత్వాన్ని అందరికీ చేరువ చేసేందుకు ఈ వేడుకలు ఎంతో తోడ్పడతాయి" అని తెలిపారు. విద్యార్థుల ఉత్సాహం, తల్లిదండ్రుల భాగస్వామ్యం ఈ వేడుకలను ప్రత్యేకంగా మార్చాయి. రాక్‌వుడ్స్ కుటుంబం అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.



మాల సేవ సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఉప్పల్

ఓల్డ్ రామంతాపూర్ మాల సేవ సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సరం 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. శనివారం ఓల్డ్ రామంతాపూర్‌లోని భరత్ నగర్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గౌరవ అతిధులుగా 9వ డివిజన్ కార్పొరేటర్ బండారి శ్రీ వాణి, 8వ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన, జవహర్ నగర్ కార్పొరేటర్ మేరు సతీష్‌తోపాటు 9వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గంధం జోష్న నాగేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర నాయకులు గడ్డం సాయి కిరణ్, కాంగ్రెస్ నాయకులు వినోద్ ముదిరాజ్, 9వ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లపు శ్రీకాంత్ యాదవ్, షాగా శ్రీధర్, సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం పెద్దలు బండారి నరసింహ, మోయడి సత్తయ్య, వల్ల సత్యనారాయణ, బండారి ఆగమయ్య, బండారి స్వామి, వల్ల జంగయ్యతోపాటు మాల సేవ సంఘం అధ్యక్షులు వల్ల బాబురావు, కోశాధికారి బండారి అనిల్, వైస్ ప్రెసిడెంట్ బండారి శివ, జనరల్ సెక్రటరీ భాస్కర్, పబ్లిక్ సిటీ సెక్రటరీ వల్ల సుధాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బుర్ర శ్రీనివాస్, స్వామి దాసు, గోసుల సాయి కుమార్, జాయింట్ సెక్రటరీ చంద్రకాంత్, మోయడి నాగరాజు, కాగితాల మహేష్ పాల్గొన్నారు.

లేజర్ బ్లేడ్ కంపెనీ కార్మికులకు అండగా ఉంటా



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

లేజర్ బ్లేడ్ కంపెనీ యూనియన్ కార్మికులకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. లేజర్ బ్లేడ్ కంపెనీ యూనియన్ ఎన్నికలలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ గెలుపొందారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, షాపూర్ నగర్‌లో లేజర్ బ్లేడ్ కంపెనీ యూనియన్ నాయకులు శ్రీశైలం గౌడ్‌ని శనివారం కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులను శ్రీశైలం గౌడ్ సన్మాంచి...తాను నిరంతరం మీకు అందుబాటులో ఉంటానని, కార్మికులకు ఏ సహాయం కావాలన్నా తను ఉన్నానని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.కాంత రెడ్డి , వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను లక్ష్మణరావు , పరుశురాం , వెంకటయ్య , అశోక్, తదితరులు పాల్గొన్నారు.

టీవీ-ఓటీటీ ఫెడరేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

బంజారాహిల్స్‌లోని తన నివాసంలో రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తెలుగు టెలివిజన్ డిజిటల్ మీడియా టెక్నీషియన్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (టీవీ-ఓటీటీ ఫెడరేషన్) క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షులు కె.రాకేష్ (నాని), ప్రధాన కార్యదర్శి పి.విజయ్ కుమార్, కోశాధికారి కె.నరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రమేష్ మాస్టర్, సంపత్‌తో పాటు ఫెడరేషన్ సలహాదారులు మురళీ, గిరిరాజ్, ఈశ్వర్, మధు, ఇరిగి నర్సింగ్ రావు, సురేష్, రాము, రాం గోపాల్ రెడ్డి, మహిపాల్, తాజొద్దీన్, సుదర్శన్, లోకేష్, పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఉచిత గుండె వైద్య పరీక్షలు

- టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కోసం, ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం, మేడ్చల్ జిల్లా శాఖ అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు ఓ ప్రకటనలో తెలిపారు. వివేకానంద నగర్‌లోని బండారు అస్పత్రి ఆధ్వర్యంలో, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ సుశ్రుత్ పర్యవేక్షణలో వైద్య శిబిరం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుత రోజుల్లో చాలామంది జర్నలిస్టులు, వృత్తిపరమైన ఒత్తిడిలకులోనై గుండె సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని, ఉచిత గుండె సంబంధిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉచితంగా ఈసీజీ, 2డి ఈకో, ఆర్‌బీసీలతోపాటు అవసరమైన ఇతర వైద్య పరీ క్షలను నిర్వహిస్తారని తెలిపారు. వివేకానంద నగర్‌లోని బండారు ఆస్పత్రిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యా హ్నం 12 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగు తుందన్నారు. జర్నలిస్టులు దీనిని సద్వినియోగం చేసుకొని వైద్య పరీక్షలను చేయించుకోవాలని కోరారు. ఈనెల 12వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుంది.

టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లలో సంక్రాంతి సంబరాలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లలో శనివారం ముందస్తు సంక్రాంతి పండుగ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. "సత్యవాణి విద్యా నికేతన్" ఎస్ ఆర్ నాయక్ నగర్, టీవీఆర్ మోడల్ హై స్కూల్ అపురూప కాలనీ స్కూల్స్‌లలో టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి.వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ ప్రత్యేకతలను తెలియజేస్తూ చిన్నారులకు భోగి పండ్లపోసి ,హై స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు రంగోలి (ముగ్గుల పోటీ) నిర్వహణ, హరిదాసు వంటి వేషధారణతో చిన్నారుల నృత్య నాటికలు, దక్షణాయనం కాలం ముగించుకొని ఉత్తరాయనంలోకి అడుగిడుతున్న శుభ తరునాన్ని వర్ణిస్తూ.. సంక్రాంతి ప్రత్యేకతను తెలియజేశారు. రంగవల్లి కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కరస్పాండెంట్ శ్రీమతి.టి.అరుణ కుమారి చిన్నారులకు భోగి పండ్లు పోసే కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. హరిదాసుల వేష ధారణ ద్వారా పండగ వాతావరణ సంతరించుకుంది. చిన్నా రులచే పతంగులు ఎగురవేసి, భోగి మంటలుతో ప్రారం భించి పండగ సంబరాలను టి.వంశీ రెడ్డి సందడి చేశారు. టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మెన్ టి.కోటిరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ డా.సూరా రవి చంద్రారెడ్డిలు అందరికీ సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

దీక్ష, కిడ్స్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సూరారంలోని దీక్ష కిడ్స్, దీక్ష పాఠశాలలో సంక్రాంతి సంబరాలను శనివారం వేడుకగా నిర్వహించారు. సంక్రాంతి ప్రాముఖ్యతను తెలుపుతూ.. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు సంప్రదాయ బద్ధంగా తెలుగుతనం ఉట్టిపడేలా చక్కటి సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకలు జరుపుకున్నారు. సంక్రాంతి వేడుకల సందర్భంగా పాఠశాల యజమాన్యం దీక్ష కిడ్స్ పాఠశాలలో విద్యార్థులకు భోగి పళ్ళు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు గాలిపటాలు ఎగురవేసి ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. అదేవిధంగా దీక్ష పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులు ముగ్గులు వేసి పాఠశాల ప్రాంగణాన్ని అందంగా అలంకరించారు. ప్రతి సంవత్సరం మకర సంక్రాంతి పండుగను దీక్ష కిడ్స్, దీక్ష పాఠశాలలో ఘనంగా జరుపుతూ.. నేటితరం విద్యార్థులకు తెలుగు పండగల విశేషతను తెలియజేయవలసిన అవసరం ఉందని అందులో భాగంగానే ఈ వేడుకలను జరిపినట్లు పాఠశాల చైర్మెన్ పి.శివయ్య తెలిపారు. ఈ వేడుకలలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ వీరేశం, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి





- జగద్గిరిగుట్ట సీఐ కేతూరి నరసింహ
- శ్రీ చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో రంగేళి ముగ్గుల సంబరాలు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మహిళలు, యువతులు అబలల వలె కాకుండా సబలల వలె అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం పురోభివృద్ధి సాధిస్తుందని జగద్గిరిగుట్ట సిఐ.కేతూరి నరసింహ అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి,మగ్దూం నగర్ లోని భగత్ సింగ్ మార్గ్‌లో గల శ్రీ చైతన్య విద్యానికేతన్ పాఠశాల క్యాంపస్ గ్రౌండ్స్‌లో శనివారం రంగురంగుల ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు, పాఠశాల చైర్మెన్, కరస్పాండెంట్ శివరాత్రి యాదగిరి, కూకట్‌పల్లి సీనియర్ కాంగ్రెస్ నాయకులు శేరి సతీష్ రెడ్డి, ముఖ్య అతిథులుగా హాజరై ముగ్గులను తిలకించారు. ముందుగా చిన్నారి విద్యార్థులకు భోగి పళ్ళు వేస్తూ ఆశీర్వదించారు. జరిగిన ముగ్గుల పోటీలలో పేరెంట్స్ విభాగంలో ప్రథమ విజేతగా నిలిచిన జ్యోతికి 4 వేల నగదు, ద్వితీయ విజేతగా నిలిచిన ప్రసన్నకు 3 వేల నగదు, తృతీయ విజేతగా నిలిచిన పద్మకు 2.500 నగదు పారితోషకాలను అందజేయడంతో పాటు విద్యార్థుల విభాగంలో ప్రథమ బహుమతి సాయి కీర్తి, ద్వితీయ బహుమతి హారిక, తృతీయ బహుమతి సాయి రామ్‌లు విజేతలుగా నిలిచారు. వీరికి మెమెంటోలు అందజేస్తూ అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తి కొన సాగించాలని ఆకాంక్షించారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు, పాఠశాల చైర్మెన్, కరస్పాండెంట్ శివరాత్రి యాదగిరి మాట్లాడుతూ తమ పాఠశాలలో విలువలతో కూడిన విద్యను అందించారు. విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా మనో ధైర్యాన్ని ఇస్తున్నామన్నారు. అనంతరం పాఠశాల ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శంకర్,ట్రస్మా రాష్ట్ర గౌరవ సలహా దారులు టి.వెంకటయ్య, ఉపాధ్యక్షులు డేనియల్ రాజు, కార్యదర్శి బాలరాజు, కంటెస్టెడ్ ఎమ్మెల్యే, సంజీవరావు, పాఠశాల డైరెక్టర్ల బృందం శివరాత్రి మంగ యాదగిరి డాక్టర్ శివరాత్రి శృతి విద్యసాయి నిఖిల్, సాయితేజ పాఠశాల ఇన్‌చార్జి గీత, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వివేకానంద విద్యా మందిర్ హైస్కూల్‌లో భోగి, సంక్రాంతి సంబరాలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని, వివేకానంద విద్యా మందిర్ హైస్కూల్‌లో ముందస్తుగా, భోగి, సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు రంగు రంగుల ముగ్గులను వేసి, గొబ్బెమ్మలను పెట్టి పండగ వాతావరణాన్ని కల్పిం చారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యా యులు మండవ.శ్రీనివాస్ గౌడ్, కరెస్పాండెంట్ యం.సునీత, వైస్ ప్రిన్సిపాల్ పి.లత, ఉపాధ్యాయులు, భోగి పళ్ళతో చిన్నారులను ఆశీర్వ దించారు. విద్యార్థులు హరిదాసు వేషధారణలతో వివిధ ఆట పాటలతో తమ ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థులు పాఠశా లలో పతంగులు, ఎగురవేసి ఆనందంగా గడిపారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ముగ్గుల పోటీల్లో పాల్గొ ని ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కైవాసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

తల్లిదండ్రులూ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

- పిల్లలకు వాస్తవ ప్రపంచాన్ని పరిచయం చేస్తున్న తీరు ప్రశంసనీయం
- అమోర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ కిశోర్ బి.రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యార్థులకు వాస్తవ ప్రపంచాన్ని పరిచయం చేసే దిశగా ప్రణాళికా బద్ధంగా ప్రోత్సహించడంలో శ్రీత్రివేణి పాఠశాల కృషి చేస్తున్న తీరు ప్రశంసనీయమని అమోర్ హాస్పిటల్స్, అమోర్ క్యాన్సర్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కిశోర్ బి.రెడ్డి అన్నారు. చిన్నారులతో పాటు.. వారి తల్లిదండ్రులు కూడా ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. వాతావరణం మారుతోందనీ, తరచూ ఏవో ఒక కొత్త వైరస్‌లు వస్తూ ఆందోళనకు గురిచేస్తున్నాయనీ, అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సరూర్‌నగర్‌లోని శ్రీ త్రివేణి పాఠశాల 11వ వార్షికోత్సవానికి ఆయన విశిష్ట అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు పాఠశాల చైర్మెన్ గోవర్ధన్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. నర్సరీ, జూనియర్ కేజీ, సీనియర్ కేజీ విద్యార్థులు ఆకాశం నుంచి తారలు దిగివచ్చి అందరినీ అలరిస్తున్నట్టుగా నత్యరూపకం ప్రదర్శించి అందరినీ అలరించారు. అనంతరం కొందరు విద్యార్థులు అద్భుతమైన యోగాసనాలు ప్రదర్శించారు. హైస్కూలు విద్యార్థులు ప్రైడ్ ఆఫ్ ఇండియా అంటూ ఆర్మీథీమ్ ప్రదర్శించారు. ఓ మహిళా నీకు జోహార్లు అంటూ మహిళా శక్తిని చాటి చూపారు. పల్లె జీవితాన్ని ప్రతిబింబిస్తూ, కుటుంబ విలువల ప్రాధాన్యాన్ని చాటుతూ, స్నేహం ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ.. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలంటూ చేసిన పలు ప్రదర్శనలు తల్లిదండ్రులను, అతిథులను ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాల చైర్మెన్ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులు అంచెలంచెలుగా ఎదిగేలా పాఠ్య ప్రణాళికను రూపొందించి, వారి సర్వతోముఖాభివద్ధికి తమ పాఠశాల కషి చేస్తోందని చెప్పారు. నేటి బాలలే దేశ భవిష్యత్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీత్రివేణి పాఠశాల డైరెక్టర్ సునీల్, ప్రిన్సిపాల్ యోగీశ్వరి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళల ప్రతిభకు దోహదం ముగ్గుల పోటీలు

- ట్రస్మా మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు బిర్రు ఆంజనేయులు
- సాయి విద్యానికేతన్ పాఠశాలలో సందడిగా ముగ్గుల సంబరాలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

తెలుగు ప్రజల సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిబింబం సంక్రాంతి అని మహిళల్లోని ప్రతిభను వెలికి తీయడానికి రంగురంగుల ముగ్గుల పోటీలు దోహదపడతాయని ట్రస్మ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు, శ్రీ సాయి విద్యానికేతన్ ఉన్నత పాఠశాల చైర్మెన్, కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు అన్నారు. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మగ్దూంనగర్, భగత్ సింగ్ మార్గ్‌లో గల పాఠశాల ఆవరణలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా విద్యార్థుల తల్లులుచే ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతోపాటు పాఠశాల డైరెక్టర్ బిర్రు శోభారాణి, ఉపాధ్యాయులతో కలిసి తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు ఎంతో విశిష్టత ఉందని మూడు రోజులపాటు కుటుంబ సభ్యులు సన్నిహితులతో కలిసి ఎంతో ఉత్సాహంగా ఈ పండుగను చేసుకుంటారన్నారు. తమ విద్యార్థులకు ప్రతి పండుగ విశిష్టతను తెలియజేసేలా పాఠశాలలో పండుగలకు సంబంధించి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహక బహుమతులను ఈనెల 24 న పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులచే ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణవేణి,అన్నే ఫాతిమా, ప్రశాంతి, సాజిత, ప్రసన్నలక్ష్మి, సుభాషిని తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సృజనాత్మకతను వెలికి తీయాలి



- ప్రముఖ వైద్యురాలు డాక్టర్ అర్పిత
- ఠాగూర్స్ పాఠశాలలో ఉల్లాసంగా ఉత్సాహంగా రంగేళి ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మహిళలు వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని తులిప్స్ ఆస్పత్రి ప్రముఖ వైద్యురాలు డాక్టర్ అర్పిత అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్‌లో గల ఠాగూర్స్ ఉన్నత పాఠశాలలో రంగవల్లుల ముగ్గుల పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆమె తోపాటు పాఠశాల చైర్మెన్, కరస్పాండెంట్ బండారు సాయికుమార్‌లు హాజరై ముగ్గులను తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భావితరాలకు పండుగ విశిష్టతలను తెలియజేసేలా పాఠశాలలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. పాఠశాల చైర్మెన్ కరస్పాండెంట్ బండారు సాయికుమార్ మాట్లాడుతూ చదువుతోపాటు సంస్కారవంతమైన జీవన విధానాన్ని తమ విద్యార్థులకు నేర్పుతున్నామన్నారు. విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా తల్లిదండ్రుల సహకారంతో అన్ని విధాలుగాతో ప్రోత్సహిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులు హరిదాసు వేషధారణ, గంగిరెద్దుల విన్యాసాలు, భోగి మంటలు, వరిధాన్యం, ముగ్గుల పోటీలు ఎంతగానో ఆకర్షించాయి. ముగ్గుల పోటీలలో ప్రథమ బహుమతి భాగ్యలక్ష్మి, ద్వితీయ బహుమతి ధనలక్ష్మి, తృతీయ బహుమతి గెలుచుకున్నారు.విజేతలను మెమెంటోలతో సత్కరించి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బండారు నేహా,సంఘ సేవకులు డాక్టర్ లక్ష్మీ నరసయ్య,సంజయ్ కుమార్,పాఠశాల ఇన్‌చార్జి చైతన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులున్నారు.

ఔదార్యాన్ని ప్రదర్శించిన కానిస్టేబుల్



నవతెలంగాణ-బాలానగర్

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా విధినిర్వహణలో నిమగ్నమయ్యే పోలీసులుంటారు. ఈ నేపథ్యంలో మేము కూడా మనుషులమే మాకూ మానవత్వం, దయ, జాలి.. ఇలా చెప్పుకుంటూ పోతే.. జనంలో మేము సైతం ప్రజా సేవలో ముందుంటామని బాలానగర్ పోలీసులు నిరూపించుకున్నారు. బాలానగర్ పెట్రోలింగ్ విధులలో ఉన్న కానిస్టేబుల్ కె. రవీందర్ ఉదార స్వభావానికి స్థానిక ప్రజలు శబాష్ పోలీస్ అనిపించుకున్నారు. శనివారం ఉదయం విధులు నిర్వహిస్తుండగా డయల్ 100 సమాచా రం రావడంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని చూడగా ఓ బిక్షాటన చేసే వృద్ధుడు అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. సమయ స్ఫూర్తితో వ్యవహరించిన కానిస్టేబుల్ కె. రవీందర్ వెంటనే వాటర్ బాటిల్ నీళ్లతో అపస్మారక స్థితిలో ఉన్న వృద్ధుడి మొహంపై చెల్లి తట్టి లేపి ఆహారం అందించాడు. ఇది గుర్తించిన స్థానిక ప్రజలు ఆయన చేసిన సేవ చూసి ఆ వృద్ధుడి పాలిట దేవుడిలా వచ్చావని ప్రశంసల జల్లు కురిపించారు. సమాచారం తెలుసుకున్న బాలానగర్ సీఐ నర్సింహా రాజు, ఎస్ఐలు రాంనారాయణ్, హాజీ మియాతో కలిసి కానిస్టేబుల్ రవీందర్, హోమ్ గార్డు వీర స్వామిని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సీఐ నర్సింహా రాజు మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ కావాలన్నారు. పోలీసులు అందించే సేవలను ప్రజలకు విధిగా తెలిపారు. పోలీసు సిబ్బంది చూపెట్టిన మానవత్వం, చొరవపై స్థానికులు ప్రశంసలు కురిపించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



నవతెలంగాణ-దుండిగల్

మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజలు శంభీపూర్ కార్యాలయంలో శనివారం కలిశారు. మౌలిక వసతులు కల్పించాలని కోరారు. వారు సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని తెలిపారు.

సంక్రాంతి పండుగ వేళ పిల్లలు జాగ్రత్త

- సూరారం సీఐ ఎస్.భరత్ కుమార్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సంక్రాంతి పండుగ సందర్భంగా రహదారుల పై పతంగులు ఎగరేయడాన్ని నిషేధించారని సూరారం సీఐ ఎస్ భరత్ కుమార్ అన్నారు. పోలీసుల అనుమతి లేకుండా బహిరంగ ప్రదేశాలలో లౌడ్ స్పీకర్లు, డీజేలు వినియోగించోద్దని స్పష్టం చేశారు. పిట్టగోడలు లేని బిల్డింగ్ లపై చిన్నారులు పతంగులు ఎగిరేసేటప్పుడు తల్లిదండ్రులు ఖచ్చితంగా గమనించాలని సూచించారు. విద్యుదా ఘాతం, ఇతర ప్రమాదాల దృశ్య తెగిపడిన గాలిపటాల కోసం చిన్నారులు రోడ్ల వెంట పరిగెత్తకుండా కనిపెట్టాలని , తద్వారా పిల్లలు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చని స్పష్టం చేశారు. భోగి పండగ సందర్భంగా కలప బలవంతంగా తీసుకోవద్దని, యజమానుల అంగీకారం తోనే సేకరించాలని సూచించారు. నిబంధనలను ఉలగిస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని సీఐ భరత్ కుమార్ హెచ్చరించారు.

ఎస్ఎస్‌డి గ్రామర్ హైస్కూల్‌లో సంక్రాంతి సంబురాలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

సంక్రాంతి అంటే నూతన కాంతి. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించడాన్ని మకర సంక్రమణం అంటారు. అయితే ఈ సంక్రమణాన్ని సంక్రాంతి అని పిలుస్తాము. తెలుగు ప్రజల పెద్ద పండుగ సంక్రాంతి పండగ. ఈ పండుగను మూడు రోజులు జరుపుకుంటారు. మొదటి రోజు భోగి, రెండవ రోజు సంక్రాంతి, మూడవరోజు కనుమ. ఈ మూడు రోజుల విశిష్టతను తెలుపుతూ, ఆల్విన్ కాలనిలోని ఎస్ఎస్‌డి గ్రామర్ హై స్కూల్‌లో, విద్యార్థులకు తెలిపే విధంగా పాఠశాల యాజమాన్యం వారు, వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహించారు. అందులో ముఖ్యంగా కొత్త వంటతో పొంగలిని తయారు చేసి రైతులకు పెద్దపీట వేశారు. తరువాత బొమ్మల కొలువుతో మన సంస్కృతి సాంప్రదాయాన్ని విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ఏర్పాటు చేశారు. విద్యార్థులు వేసిన రంగవల్లులతో స్కూలు వాతావరణం పల్లెటూరిని తలపించింది. ఈ కార్యక్రమంలో స్కూల్ ఫౌండర్ రవీందర్ రావు, వారి సతీమణి సురభి దుర్గావాణి, చైర్మెన్ చెన్నమనేని స్రవంతి, ప్రిన్సిపల్ తేజస్విని, అకాడమిక్ డీన్ మ్రినాలినీ, వైస్ ప్రెసిడెంట్, ఇన్‌చార్జి స్టాఫ్, పేరెంట్స్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

నియోజకవర్గంలోని ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలతో పనులు పరుగులు పెడుతున్నాయని వ్యాఖ్యానించారు. శనివారం 130 డివిజన్ సుభాష్ నగర్ పరిధిలోని కృషి కాలనీ, సాయి బాబా నగర్ నందు కమ్యూనిటీ హాల్ కొరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ హన్మంత్ రెడ్డి చొరవతో ఇంచార్జి మంత్రివర్యులు శ్రీధర్ బాబు స్పెషల్ ఫండ్స్ ద్వారా రూ.10లక్షల మంజూరైన సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం కృషి కాలనీ సభ్యులు హన్మంత్‌కి శాలువతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు ప్రధాన కార్యదర్శి విజయ భాస్కర్ రెడ్డి, మాజీ ప్రెసిడెంట్ మాజిద్ పాషా, రాజి రెడ్డి, వెంకట్ రెడ్డి, ఆనంద్, అంజి రెడ్డి, నర్స గౌడ్, సత్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 11వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏలూరి సత్య (నాని) పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డిని కలిసి శాలువాతో సత్కరించి ఆశీస్సులు తీసుకోవడం జరిగింది. కెఎస్ఆర్ శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అన్ని రంగాలలో ఎంతో రానించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఎస్.రావు, రాజు, శ్రీనివాసరాజు (మీసాల రాజు), ప్రశాంత్ రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్



మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా రాజానోళ్ల లక్ష్మి నియమింపబడిన సందర్భంగా.. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని కలిశారు. అనంతరం హన్మంతన్న శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జాజాల రమ్య, సరస్వతి, శోభ రాణి, సత్యనారాయణ పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్

నవతెలంగాణ
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
ఆదివారం | జనవరి 12, 2025 | www.navatelangana.com

ఎస్‌పీఆర్ హిల్స్‌లో వడ్డే ఓబన్న జయంతి వేడుకలు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా రహమత్‌నగర్ ఎస్‌పీఆర్ హిల్స్‌లోని వడ్డే ఓబన్న విగ్రహం వద్ద స్థానిక కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంబీసీ కార్పొరేషన్ చైర్మెన్ జెర్రిపాటి జైపాల్, నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, రహమత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ కార్పొరేటర్ బండపల్లి భవాని శంకర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి గ్యారా నాగరాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత



నవతెలంగాణ-సిటీబ్యూరో

సెవెన్ రేస్ ఫౌండర్ డాక్టర్ సారా పేదలకు అండగా నిలిస్తున్నారు. నగరానికి చెందిన నర్సయ్య, ఎల్లమ్మ దంపతులు పేదలు. వీరిని పోషించడానికి ఎవరూ లేరు. నర్సయ్య వికలాంగుడు. దీంతో వారు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్న సారా ఆ దంపతులకు నిత్యావసర సరుకులను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. పేదలకు అండగా నిలువడంలో చాలా ఆనందం ఉందని సారా తెలిపారు.

మీ భద్రతే మా బాధ్యత



- ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు
- ఆర్టీసీ డ్రైవర్లకు, సిబ్బందికి రోడ్డు భద్రతపై అవగాహన

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవల్లో భాగంగా ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బందికి ఎస్సార్‌నగర్ బస్‌స్టాప్ వద్ద అవగాహన కార్యక్రమాన్ని జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సైదులు మాట్లాడుతూ.. బస్ బే ప్రాముఖ్యత, ప్రయాణికులను నిర్దేశిత స్థలంలో ఎక్కించుకోవడం, దించడం, రోడ్ భద్రత ప్రమాణాలు పాటించడం, రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే నష్టాలు, నివారణ చర్యలను తెలియజేశారు. నిరంతరం ప్రయాణికులను సురక్షితంగా ఇంటికి చేర్చే ఆర్టీసీ ఉద్యోగులకు రోడ్డు ప్రమాదాల ఆవశ్యకత, కుటుంబాలకు, సమాజానికి జరిగే నష్టాలు అలాగే నష్ట నివారణ చర్యలను, వివిధ వీడియోస్, ఫోటోలను చూపించి భవిష్యత్‌లో ప్రమాద రహిత సమాజ స్థాపనలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మియాపూర్, జీడిమెట్ల, సికింద్రాబాద్ డిపోలకు చెందిన డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు-పాదచారులకు అవగాహన



జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవంలో భాగంగా ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో, మైత్రివనం కూడలి వద్ద ప్లాకార్డులు ప్రదర్శిస్తూ, రోడ్డు భద్రతకు చేపట్టవలసిన చర్యలపై విద్యార్థులకు, పాదచారులకు అవగాహన కల్పించారు. పాదచారులు, విద్యార్థులు రోడ్డు దాటేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఫేలికాన్ సిగ్నల్ వాడకము, అలాగే ఎదురుగా వచ్చే వాహనాలను గమనించుకుంటూ రోడ్డు దాటడము, ఇతర భద్రత అంశాల గురించి విద్యార్థులకు వివరించారు. జీవితంలో మనం మంచిగా ఉంటేనే ఏదైనా సాధించగలం కాబట్టి యువత అలాగే కుటుంబ పెద్దలు ఎవరు కూడా రోడ్డు ప్రమాదాల భారినపడి కుటుంబాలకు దూరం కావొద్దన్నారు. విలువైన జీవితాలను కోల్పోవద్దన్నారు. రాబోయే రోజుల్లో, ఈ జనవరి నెల మొత్తం కూడా వివిధ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి, వాహనదారులకు పాదాచారులకు అలాగే ఇతర వ్యక్తులందరికీ కూడా అవగాహన కల్పిస్తామని ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు.

పతంగి ఎగరేసిన డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-ఓయూ

సంక్రాంతి సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డితో కలిసి శనివారం తార్నాకలోని వారి నివాసంలో కాంగ్రెస్ నాయకులతో పతంగి ఎగరేసారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. చైనా మాంజాల వాడకం వల్ల అనేక ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని, ప్రాణాపాయం నివారించడానికి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పక్షులకు హాని కలగకుండా పండుగను సురక్షితంగా జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా తమ స్వగ్రామాలకు వెళ్తున్న ప్రజలందరికీ, వారు ముందుగా తమ సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారాన్ని ఇచ్చి, ప్రయాణాన్ని క్షేమంగా పూర్తి చేసుకొని తిరిగి క్షేమంగా రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.



నగర సీపీ సీవీ ఆనంద్ కుమార్ ఆదేశాల మేరకు బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయి ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు, ఇతర సభ్యులకు తప్పనిసారిగా డ్రెస్ కోడ్ వాడాలి, ఆటో పార్కింగ్‌లోనే పెట్టాలి, అంబులెన్స్‌కి దారి ఇవ్వాలని విజ్ఞప్తి చేసారు. లేని పక్షంలో కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని ప్రతి ఒక్కరు విధిగా తీసుకొని అవగాహన లేని వారికి అవగాహన కల్పించాలని సూచించారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్

బీదల బస్తీలో ముగ్గుల పోటీలు



నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ నియోజకవర్గం సీతాఫల్మండి డివిజన్ బీదల బస్తీలో శనివారం సాయంత్రం మేకల కీర్తీహర్షకిరణ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబురాలలో భాగంగా మహిళలకు ఘనంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు పాల్గొని రంగురంగుల ముగ్గులను వేశారు. 100 మంది మహిళలు ఈ పోటీలలో పాల్గొనగా ముగ్గురిని విజేతలుగా ఎంపిక అయ్యారు. వారితో పాటు పోటీలో పాల్గొన్న అందరికీ బహుమతులను నిర్వహకులు మేకల కీర్తి హర్షకిరణ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా బీజేపీ అధ్యక్షులు బూర్గుల శ్యాంసుందర్ గౌడ, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల.సారంగపాణి, రాచవల్ల కృష్ణమూర్తి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇలా అక్కాచెల్లెలు భారీగా వచ్చి పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉంది అని మేకల కీర్తి అక్షర అన్నారు. సంక్రాంతి అంటేనే రంగురంగుల ముగ్గులు, పిండివంటలు, గాలిపటాలు, గంగిరెద్దులూ ఇలా అన్ని కలబోసిన మన తెలుగు పండగన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ముందుందు ఇంకా ఎన్నో నిర్వహిస్తామన్నారు. సంక్రాంతి ముగ్గులు వేసిన ముగ్గురికి విజేతలకు ప్రత్యేకమైన బహుమతులు శ్యాంసుందర్ గౌడ్ అందజేశారు.

ఫుట్‌పాత్ వ్యాపారులకు అండగా ఉంటా..

- పోలీసులు వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయొద్దు
- అన్ని విధాలుగా అండగా ఉంటా.. అధైర్యపడొద్దు..
- సంక్రాంతి తర్వాత ఆయా ప్రాంతాలలో పర్యటిస్తా..
- సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసానిశ్రీనివాస్ యాదవ్
- మోండా డివిజన్‌లో ఎమ్మెల్యే పర్యటన



నవతెలంగాణ-బేగంపేట్

ఫుట్‌పాత్ వ్యాపారులకు అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మోండా డివిజన్‌లోని పాలికా బజార్, మోండా మార్కెట్, 31 బస్ స్టాప్, ఓల్డ్ జైలు ఖానా ప్రాంతాలలోని పుట్ పాత్ వ్యాపారులు, హాకర్స్ ఎమ్మెల్యేను శనివారం వెస్ట్ మారేడ్ పల్లిలోని కార్యాలయంలో కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఫుట్‌పాత్‌లపై చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహించుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్నారంటూ ట్రాఫిక్ పోలీసులు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. సరైన వ్యాపారాలు లేక అవస్తలు పడుతున్నామని, ఇలాంటి పరిస్థితులలో అధికారులు ఇబ్బందులకు గురి చేస్తే తమ కుటుంబాలు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే ట్రాఫిక్ పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చిరు వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయవద్దని, ఎన్నో ఏండ్ల నుండి ఇదే వృత్తిగా చేసుకొని జీవనం సాగిస్తున్నారని చెప్పారు. సంక్రాంతి పండుగ తర్వాత ఆయా ప్రాంతాలలో ట్రాఫిక్ పోలీసులు, అధికారులతో కలిసి పర్యటించి సమస్య పరిష్కారానికి సరైన నిర్ణయం తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ప్రజలకు, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా వ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచించారు. మీకు అన్ని విధాలుగా అండగా ఉంటానని అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో హాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి అశోక్, బీఆర్ నాయకులు నాగులు, శ్రీనాద్, అమర్, హాకర్స్ గోవర్ధన్, శివ, బబ్లు, ఆర్షాఫ్ తదితరులు ఉన్నారు.

కార్పొరేటర్ ఆధ్వర్యంలో వడ్డే ఓబన్న 218వ జయంతి



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఖైరతాబాద్ నియోజకవర్గంలోని జూబ్లీహిల్స్ డివిజన్ గౌతమ్‌నగర్ కమిటీహాల్ వద్ద స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న 218వ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయనకి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... స్వాతంత్ర్య ఉద్యమంలో వడ్డెర ఓబన్న చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలెందుకు కుల, మత, రాజకీయాలకు అతీతంగా, పనిచేస్తూ రాష్ట్రంలోని ఖైరతాబాద్ నియోజకవర్గంలోని వడ్డెర సంఘ ఐక్యత పెంపొందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆర్ ఎల్లయ్య, ఖైరతాబాద్ నియోజవర్గం అధ్యక్షుడు వి యాదయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వి కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు డి తిరుపతి, బసవరాజు, భీమయ్య, బోదాసు శ్రీశైలం, చిన్న వెంకటయ్, మహిళా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మారమ్మ,పద్మలు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలోని భారత్‌నగర్ బస్తీలోని కమ్యూనిటీ హాల్లో యువకులు డ్రగ్స్ సేవించి జీవితాలు నాశనం చేసుకోవద్దని, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, శనివారం సాయంత్రం స్థానిక కార్పొరేటర్ మాజీ జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ బాబా పసివుద్దిన్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, మజీద్ ఇమాములు, పాస్టర్లతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బాబా పసివుద్దీన్ మాట్లాడుతూ.. బస్తీలో యువకులు డ్రగ్స్ సేవించి చెడిపోతే వారి కుటుంబాలే కాక, బస్తీలోని యువకులందరూ చెడిపోతారని, చదువులో వెనక పడతారని, చెడు స్నేహాలు ఏర్పాటు చేసుకుంటారని, వారి జీవితాలు నాశనం చేసుకొని తల్లిదండ్రులకు, అక్క చెల్లెళ్లకు, అన్నదమ్ములకు, అన్యాయం చేసిన వారు అవుతారని అన్నారు. అనంతరం బోరబండ ఇన్‌స్పెక్టర్ వీరశేఖర్ మాట్లాడుతూ.. బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరు కూడా గంజాయి, డ్రగ్స్ అమ్మ వద్దని, యువకులు సేవించవద్దని, ఎవరైనా గంజాయి అమ్మే వారి వివరాలు పోలీస్ స్టేషన్లో తెలపాలని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అమ్మినట్లు సేవించినట్లు కేసులు నమోదు కాకుండా గంజాయి రహిత బోరబండగా పేరు తెచ్చుకోవాలని అన్నారు. అనంతరం డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ భూపాల్‌గౌడ్ మాట్లాడుతూ.. బోరబండ అంటే ఎక్కువ శాతం కష్టజీవులు జీవించే ప్రాంతమని, గంజాయి విక్రయించేవారు బోరబండను అడ్డాగా చేసుకునే అవకాశం ఉందని, అందువలన యువకులను తల్లిదండ్రులు ప్రతి రోజు ఎక్కడికి వెళుతున్నారు. ఏ సమయానికి ఇంటికి వస్తున్నారు. ఎవరితో తిరుగుతున్నారు గమనించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో, డీపీఠ వెంకటకృష్ణ, మధురానగర్, భారత్‌నగర్ మజీద్ ఇమాములు, చర్చి పాస్టర్లు, స్థానిక నాయకులు, బస్తీ పెద్దలు పాల్గొన్నారు.

ముందస్తు సమాచారం పీఎస్‌కు ఇవ్వండి

- లాలగూడా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.రఘుబాబు



నవతెలంగాణ-ఓయూ

సంక్రాంతి పండుగ సందర్భంగా చాలా మంది సొంత ఊళ్లకు వెళ్ళే ముందు సమాచారాన్ని పీఎస్‌కు ఇవ్వండని లాలగూడా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.రఘుబాబు తెలిపారు. ఇదే అదనుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారు. ఊళ్లకు వెళ్ళే వారు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌స్పెక్టర్ కె.రఘుబాబు నవతెలంగాణతో అన్నారు. సంక్రాంతి పండుగ దృష్ట్యా చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామని, ప్రజలను కూడా అప్రమత్తం చేస్తున్నమన్నారు. రాత్రి వేళల్లో వీధుల్లో గస్తీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ విషయంలో లాలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలు, స్థానికులు జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌స్పెక్టర్ స్థానికులకు, ప్రజలకు పలు సూచనలు చేశారు. ఊరు వెళ్తున్నప్పుడు పక్కింటివారికి ఇంటి పరిసరాలను గమనించమని చెప్పాలి. ఇంట్లో విలువైన వస్తువులను స్కూటర్ డిక్కీల్లో, కారులలో పెట్టడం చేయరాదు. మీ ద్విచక్రవాహనాలు, కారులను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేయాలి, రోడ్లపై నిలుపరాదు. బీరువా, లాకర్ తాళాలను ఇంట్లో ఉంచరాదు, తమతోపాటే తీసుకెళ్లాలి. ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం కనబడకుండా డోర్ కర్టెన్ వేయాలి. గ్రామాలకు వెళ్లే వారు ఇంట్లో ఏదో ఒక గదిలో లైటు వేసి ఉంచాలి. ఎక్కువ రోజులు విహారయాత్రల్లో ఉంటే పేపర్, పాల వారిని రావద్దని చెప్పాలి. పని మనుషులు ఉంటే రోజూ వాకిలి ఊడ్చమని చెప్పాలి. విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదన్నారు. ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమమని సూచించారు. లేదా ఎక్కువ రోజులు ఊళ్లకు వెళ్లేవారు విలువైన వస్తువులను వెంట తీసుకెళ్లాలి. టైమర్తో కూడిన లైట్లను ఇంట్లో అమర్చు కోవాలి. బ్యాగుల్లో బంగారు నగలు డబ్బు పెట్టుకొని ప్రయాణం చేస్తున్నప్పుడు బ్యాగులు దగ్గరలో పెట్టుకోవాలి. బ్యాగు బస్సులో పెట్టి కిందికి దిగితే దొంగలు అపహరిస్తారు సూచించారు. ఇంటి డోర్ సెంట్రల్ లాకింగ్ సిస్టంను ఏర్పాటు చేసుకోవడం సురక్షితం హెరీమ్ సెక్యూరిటీ సిస్టం ద్వారా ఇంటర్నెట్ అనుసంధానం ఉన్న మీ మొబైల్ నుంచే మీ ఇంటిని ఎక్కడి నుంచి అయినా లైవ్ అప్డేట్స్ ప్రత్యక్షంగా చూసుకునే వీలుంది. ఇంటికి సంబంధించిన నాణ్యమైన సీసీ టీవీలు ఆన్లైన్ మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. హెరీమ్ సెక్యూరిటీ సర్వెలెన్స్‌కు ఇవి ఎంతో ఉపయుక్తం. ఇంటి భద్రతాపరంగా ఇంటికి దృఢమైన, నాణ్యమైన తలుపులతో పాటు హై ఎండ్ గోద్రెజ్ హై సెక్యూరిటీ లాక్ సిస్టంని వాడడం మంచిదన్నారు. ఇండ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లేటప్పుడు చుట్టు పక్కల వారికి లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి. నమ్మకమైన సెక్యూరిటీ గార్డులు, వాచ్‌మెన్‌ను నియమించుకోవాలన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నెంబర్‌కు పోలీసు స్టేషను 8712661251 తెలపాలి. దీంతో వారి వివరాలను రిజిస్టర్ నమో దు చేసుకుని ఊరెళ్లిన వారి ఇండ్లపై నిఘాను ఏర్పాటు చేస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కొత్త వ్యక్తుల కదలికలపై 100 డయల్ లేదా హైదరాబాద్ పోలీసు వాట్సాప్ నెంబర్ 9490616555 కు సమాచారం ఇవ్వాలన్నారు. మీరు ముంద స్తుగా సమాచారాన్ని ఇస్తే మా పెట్రోలింగ్ వాహనం పెట్రోలింగ్ చేస్తాయి అన్నారు. 24 గంటల పాటు మా పీఎస్ నెంబర్‌కు ఫోన్ చేసి రక్షణ పరమైన సేవాలు పొందవచ్చు అన్నారు. ఈ సందర్భంగా అయిన లాలగూడ పోలీసు స్టేషన్ పరిధిలోని స్థానిక ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

పీఓసీఓ ఎక్స్ ఫ్యాక్టర్ విడుదల

నవతెలంగాణ-సిటీబ్యూరో

వినియోగదారు టెక్ బ్రాండ్‌లలో ఒకటైన పీఓసీఓ, దాని ఫ్లాగ్‌షిప్ ఎక్స్ 7 సిరీస్-పీఓసీఓ ఎక్స్ 7 5జీ పీఓసీఓ ఎక్స్ 7 ప్రో 5జీలను జైపూర్‌లో జరిగిన అధిక-శక్తి కార్యక్రమంలో ఆవిష్కరించింది. ఈ సందర్భంగా పీఓసీఓ ఇండియా కంట్రీ హెడ్ హిమాన్షు టాండన్ మాట్లాడుతూ.. "పీఓసీఓలో, మేం తీసుకునే ప్రతి నిర్ణయాన్ని ఆవిష్కరణ నడిపిస్తుంది. ఎక్స్ 7 సిరీస్‌తో, మేం ప్రీమియం స్మార్ట్‌ఫోన్ విభాగంలో కొత్త ప్రమాణాలను నిర్దేశిస్తున్నాం. పీఓసీఓ ఇండియాకు -ముఖదర్శిగా అక్షయ్ కుమార్ ఉండటం మాకు చాలా సంతోషంగా ఉంది. ఎక్స్ 7 సిరీస్‌తో, మీడియాటెక్ డైమెన్సిటీ 8400 అల్ట్రా, షియోమి హైపర్‌ఓఎస్ 2.0 ప్రపంచ వ్యాప్తంగా ప్రవేశపెట్టడం మాకు గర్వకారణం" అని తెలిపారు.

తిరుపతి తొక్కిసలాట మృతులకు ఓయూలో నివాళి

- తొక్కిసలాటకు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిందించడం సమంజసం కాదు: సీబీఎన్ ఫ్యాన్స్



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఎదుట శనివారం చంద్రబాబు నాయుడు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ అధ్యక్షుడు, ఓయూ పీహెచ్డీ స్టూడెంట్ తలారి.శ్రీనివాసరావు అధ్యక్షతన తిరుపతి తొక్కిసాట ఘటనలో మృతి చెందిన ఆరుగురుకి కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ ఘటనకు రాజకీయాలు పులమ టం బాధాకరంగా ఉందని, ఏపీ ప్రభుత్వం, టీటీడీ అధికారులు వెంటనే రంగంలోకి దిగారని, చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. అలసత్వం వహించిన అధికారులపై చర్యలు చేపట్టారని గుర్తు చేశారు. ఈ ఘటనను ప్రభుత్వ తప్పిదంగా అపాదించారదని కోరారు. ఇప్పటికే టీటీడీ పాలక మండలి మృతి చెందిన ఆరుగురు భక్తులకు రూ.25 లక్షల సహాయం, వారి పిల్లలకు చదువు, కుటుంబ సభ్యులల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, తీవ్రంగా గాయపడ్డా ఇద్దరికి రూ.5 లక్షల చొప్పున గాయపడ్డ 31 మంది క్షతగాత్రులకు, రూ.2 లక్షల చొప్పున ఇస్తామని నిర్ణయం తీసుకుందని ఇది హర్షణీయం అన్నారు. ఈ సందర్భంగా గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని భగవంతుని ప్రార్థింస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, చైర్మన్ నాయుడు ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో టీటీడీ అభివృద్ధికి, ఔన్నత్యాన్ని పెంపొందించటానికి, కృషి చేస్తున్నారని శ్రీనివాస రావు అన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు ఫ్యాన్స్, మల్లికార్జున్, సాయి, శివ, ప్రాణీత్, సాయికుమార్, అభినవ్, సాయికుమా ర్,కోటేష్, శ్రీకాంత్, అనిల్, విష్ణు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటలతో మానసిక ఉల్లాసం, సంపూర్ణ ఆరోగ్యం




- సెంట్ జోసెఫ్ కాన్వెంట్ స్కూల్ డైరెక్టర్ రామ్ జతన్

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఆట పాటలు చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని సెంట్ జోసెఫ్ కాన్వెంట్ స్కూల్ డైరెక్టర్ రామ్ జతన్ అన్నారు. సెంట్ జోసెఫ్ కాన్వెంట్ పాఠశాల స్పోర్ట్స్ డే వేడుకలు శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుతోపాటు శారీరక ఆటలు పిల్లల మానసిక శారీరక ఎదుగుదలకు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. శారీరక శ్రమ లేకపోవడంతో సంక్రమిస్తున్న వ్యాధులు ఆటల ద్వారా దూరమవుతాయని అన్నారు. వివిధ కారణాలతో ప్రస్తుతం చిన్నారులు ఫిజికల్ గేమ్స్‌కు దూరం అవుతున్నారని కేవలం టీవీలు మొబైల్ ఫోన్లో ఆటలతో కాలక్షేపం చేస్తున్న చిన్నారులకు ఈ తరహా వేడుకలు ఎంతో దోహదపడతాయని తెలిపారు.

స్టార్ ఆస్పత్రిలో చిన్నారికి అరుదైన వైద్య చికిత్స



డాక్టర్ మోకా ప్రణీత్



నవతెలంగాణ-బంజారాహిల్స్

తెలంగాణకు చెందిన ఎడాదిన్నర బాలుడు, అరుదైన ప్యాంక్రియాటిక్ సమస్యతో బాధపడుతూ.. ఏడు కిలోల బరువుతో తీవ్రమైన పొట్ట నొప్పి, జ్వరం, పొట్ట ఉబ్బరంతో రెండు నెలలుగా ఇబ్బంది పడుతున్నాడు. కుటుంబ సభ్యులు వివిధ ఆస్పత్ర ుల్లో చికిత్స నిమిత్తం తిరుగుతూ చివరికి వైద్యుని సలహాతో స్టార్ ఆస్పత్రికి చేరుకుని వైద్య పరీక్షలు చేయించారు. బాలుడికి ప్యాంక్రియాస్ సమస్య వల్ల పొట్టలో ద్రవం చేరడం కారణంగా ఈ ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్టు వైద్యుల బృందం గుర్తించింది. పీడియాట్రిక్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ పౌష్యలతో పాటు డాక్టర్ మోకా ప్రణీత్, పీడియాట్రిక్ అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ విజయలక్ష్మి సహకారంతో ప్యాంక్రియాస్, కాలేయ సంబంధిత సమస్యలు, ఆధునిక విధానాల్లో నిపుణుడైన డాక్టర్ ప్రణీత్ బాలుడుని మరో మారు పరిశీలించి, ప్యాంక్రియాటిక్ డక్ట్ లీకేజీ కారణంగా పొట్టలో ద్రవం చేరిందని నిర్ధారించారు. అత్యంత క్లిష్టమైన ఎండోస్కోపిక్ రెట్రోగ్రేడ్ కోలాంజియో ప్యాంక్రియాటోగ్రఫీ ఈఆర్‌సీపీ పద్ధతిని అమలు చేశారు. ప్యాంక్రియాటిక్ డక్ట్‌లో స్టెంట్‌ను పెట్టడం ద్వారా లీకేజీని ఆపి బాలుడికి శస్త్ర చికిత్స విజయవంతంగా చేసారు. డాక్టర్ ప్రణీత్ మాట్లాడుతూ.. చిన్నపిల్లల్లో ప్యాంక్రియాటిక్ డక్ట్ లీకేజీ చాలా అరుదుగా కనిపిస్తుందన్నారు. కుటుంబంతో చర్చించిన తర్వాత ఈఆర్‌సీపీ పద్ధతిని ఉపయోగించి స్టెంట్‌ను అమర్చి లీకేజ్‌ని ఆపివేయడంతో పాటు బాలుడికి 30 నిమిషాల చికిత్సను చేయడం దాన్ని తట్టుకొని వెంటనే కోలుకావడంతో ఆరోగ్యంగా ఉందని నిర్ణయించుకొని చికిత్స తర్వాత ఐదు రోజులు పసికందును నిశితంగా పర్యవేక్షించి, ఆరోగ్యంగా ఉన్నట్టు నిర్ధారించారు.

కంటోన్మెంట్‌లో అమృత్ పథకం..



- జన్యావుల రామకృష్ణ

నవతెలంగాణ-కంటోన్మెంట్

సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ జన్యావుల రామకృష్ణ అన్నారు. శనివారం కంటోన్మెంట్ మహేంద్ర హిల్స్‌లోని తన కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తనపై నమ్మకం మరోసారి నామినేటెడ్ మెంబర్‌గా అవకాశం కల్పించినందుకు ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు రాజ్ నాథ్ సింగ్, అమిత్‌షా, కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్‌తో పాటు మహంకాళి సికింద్రాబాద్ బీజేపీ జిల్లా అధ్యక్షులు బూర్గుల శ్యాంసుందర్‌కి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కంటోన్మెంట్‌లో తాను చేసిన అభివృద్ధి పనులను, తీసుకువచ్చిన సంస్కరణల గురించి చెప్పారు. అలాగే త్వరలో రూ.300కోట్లతో వివిధ పనులు చేపడతామని తెలిపారు. అలాగే అమృత్ పథకాన్ని కంటోన్మెంట్‌లో ప్రవేశ పెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు.

బీజేపీ నాయకులకు సన్మానం...

ఇటీవల నూతనంగా ఎంపికైన నూతన వార్డ్ అధ్యక్షులను ఈ కార్యక్రమంలో జన్యావుల రామకృష్ణ సన్మానించారు. కార్యకర్తలు నాయకులు కూడా కలిసి పనిచేస్తూ కంటోన్మెంట్‌లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు విజయానంద్, సతీష్, బీఎస్ శ్రీనివాస్, అజయ్ గౌడ్, కిరణ్ కుమార్, బీజేపీ శంకర్, అరుణ్, విరవర్ధన్, విజయ్ యాదవ్, రాజమల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
ఆదివారం | జనవరి 12, 2025 | www.navatelangana.com

చర్లపల్లి టెర్మినల్ స్టేషన్‌లో మెరుగైన సౌకర్యాలకు ప్రయత్నాలు..

నవతెలంగాణ-సిటీబ్యూరో

దక్షిణ మధ్య రైల్వే చర్లపల్లి రైల్వే స్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో రూ .413 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసింది. ఈ స్టేషన్ పునరాభివృద్ధి ప్రతిపాదించి నప్పటినుండి చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు రోడ్డు, రైలు మార్గాల పరంగా ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు, అనుసంధానాన్ని అందించడానికి జోన్ స్థిరమైన ప్రయత్నాలు చేస్తోంది. అనుసంధానం విషయంలో రైల్వేలు చేసిన ప్రయత్నాలు చాలావరకు ఫలించాయి. చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రజలకు రైళ్ల ప్రయాణ అవసరాలను తీర్చడానికి 17 జతల రైళ్లకు స్టాప్‌లను ఏర్పాటు చేసింది.

మెరుగైన అప్రోచ్ రోడ్ల కోసం రైల్వేల ప్రయత్నాలు

రైల్వే చర్లపల్లి రైల్వే స్టేషన్‌కి మెరుగైన ప్రయాణీకుల రాకపోకలక అవసరాలకు అనుగుణంగా మెరుగైన అనుసంధానాన్ని అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూనేఉన్నది. తెలంగాణ ప్రభుత్వాన్ని ఎఫ్.సి.ఐ గిడ్డంగి వైపు నుండి కలిపే రోడ్లను వెడల్పు చేయాలని, టి. ఎస్. ఐ. ఐ. సి పక్కనే ఉన్న ఖాళీ భూముల గుండా కొత్త రహదారిని వేయాలని కోరింది.అదేవిధంగా, ఉత్తర ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణీకులకు అనుగుణంగా ఉత్తరం వైపున ఉన్న రహదారిని (మహాలక్ష్మి నగర్ కాలనీ రోడ్డు) వెడల్పు చేయాలని తెలియజేశారు. ఈ ప్రయత్నాలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో జరిగిన సమన్వయ సమావేశంలో రోడ్డు సౌకర్యాన్ని అనుసంధానించడం, రవాణా సేవలను అందించడం అనే అంశంపై విస్తృతంగా చర్చించిన పిదప ప్రత్యేక కార్యదర్శి ఎం అండ్ యు.డి.తో సంయుక్తంగా తనిఖీ చేశారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్, జి.ఎచ్.ఎం.సి పరిధిలోకి వస్తున్నందున, రోడ్డు పనులను చేపట్టాలని జి.ఎచ్.ఎం.సిని కోరారు. ఈ అంశాన్ని రైల్వే అడ్మినిస్ట్రేషన్ వివిధ స్థాయిలలో పరిష్కారానికి కొనసాగిస్తోంది.

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సికింద్రాబాద్, ఇతర ప్రాంతాల నుండి చర్లపల్లి రైల్వే టెర్మినల్ వరకు 146 సాధారణ బస్సు సర్వీసులను నడుపుతున్నారు.

పండగ పూట పస్తులుంటున్న కార్మికులు

- సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్షులు జె.కుమారస్వామి

నవతెలంగాణ-సిటీబ్యూరో

పండగ పూట సైతం బుద్ధ పూర్ణిమ ప్రాజెక్టు పరిధిలోని పార్కులలో పనిచేస్తున్న అర్బన్ ఫారెస్ట్ కార్మికులు పస్తులతో ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నదని సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్షులు జె.కుమారస్వామి ఒక ప్రకటనలో అన్నారు. ఈ నెల సంక్రాంతి పండగ ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వేతనాలు కార్మికుల చేతికి అందలేదని తెలిపారు. దీంతో కార్మికులు పండగ పూట ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అర్బన్ ఫారెస్ట్ కార్మికులకు గత కొద్ది నెలలుగా వేతనాల విషయంలో ఇదే పరిస్థితి కొనసాగుతున్నదని... ప్రతినెలా మూడో వారంలో వేతనాలు తీసుకోవాల్సి వస్తోందన్నారు. దీనివల్ల ఇంటి యజమానులు నుంచి వారు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడు నాలుగు నెలలుగా ఈఎస్ఐ, పీఎఫ్ జమలు సైతం ఆగిపోయాయని, చాలీచాలని వేతనాలతో బతుకు ఈడుస్తున్న కాంట్రాక్ట్ అర్బన్ ఫారెస్ట్ వింగ్ కార్మికులు కేవలం అధికారుల నిర్లక్ష్యం వల్ల వేతనాలు అందని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. కమిషనర్ చొరవ తీసుకొని వేతనాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారని చెప్పారు.



నాదర్ గుల్ గ్రామంలో 27డివిజన్ బస్టాండ్ సమీపంలో ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కు కంచెను ఏర్పాటు చేయాలని బీజేపీ సీనియర్ నాయకులు మంత్రి మహేష్ కోరారు. నవతెలంగాణ-బడంగ్‌పేట్

'దిల్ రాజు మాటలు విచారకరం'

నవతెలంగాణ-సిటీబ్యూరో



తెలంగాణలో పుట్టి తెలంగాణ ప్రజల అండదండలతో సినీ ఎగ్జిబిటరుగా ఎదిగిన దిల్ రాజు తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీశారని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంటు అధ్యక్షులు సాయిబాబా అన్నారు. అశోక్‌నగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇటీవల దిల్ రాజు తన సినిమా ఫంక్షన్ సందర్భంగా తెలంగాణ ప్రజలకు కల్లు, మటన్ ఉంటే చాలని ఇంకేమీ అక్కర్లేదని మాట్లాడడం తెలంగాణ జాతిని ఆత్మగౌరవాన్ని కించపరచడం, మనోభా వాలు దెబ్బతీయడమేనని అన్నారు. ఇక్కడే పెరిగి ఇక్కడే వృద్ధి చెందిన దిల్ రాజు ఈ విధంగా మాట్లాడడం చాలా విచారకరమన్నారు. భవిష్యత్తులో ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా తెలంగాణ ప్రజలను కించపరచకుండా మాట్లాడాలని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా కింద 15 వేల ఇస్తానని ప్రకటించడం, దాన్ని రూ. 12 వేలకే కుదించడం, సంధ్యా థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో మహిళా మృతి చెందడంతో బెనిఫిట్ షోలు ఉండవని, పర్మిషన్లు ఇవ్వబోమని సాక్షాత్తు అసెంబ్లీలో ప్రకటించిన ముఖ్యమంత్రి మాట మార్చి బెనిఫిట్ షోలకు అవకాశం ఇవ్వడం చూస్తుంటే ముఖ్యమంత్రికి తన మీద తనకే నమ్మకం లేదని కనబడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నల్లెల్ల కిషోర్, పి.బాల్రాజ్ గౌడ్, ఎస్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరించిన పీఏసీ చైర్మెన్ గాంధీ

నవతెలంగాణ-కూకట్‌పల్లి

నవతెలంగాణ బీ కూకట్ పల్లి.... నవతెలంగాణ 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను, ఆల్విన్ కాలని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు అనిల్ రెడ్డి,నవతెలంగాణ విలేకరి భాస్కరా చారి లతో కలిసి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకేపూడి గాంధీ చేతుల మీదుగా,ఆయన నివాస కార్యాలయంలో నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరించారు, ఈ సందర్భంగా అరెకేపూడి గాంధీ మాట్లాడుతూ,ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల పక్షాన పోరాడుతూ,నిజాలను నిర్భయంగా వెలికితీసే పత్రిక నవతెలంగాణ పత్రిక అని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సెయింట్ ఆంథోని విద్యాసంస్థలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

నవతెలంగాణ-దుండిగల్

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కొంపల్లి లోని సెయింట్ ఆంథోని పాఠశాల, విద్యాసంస్థలలో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ అనగానే మనకు గుర్తొచ్చేవి పల్లె వాతావరణం, పాడి పంటలు, భోగిమంటలు, ముగ్గులు. ఈ పండుగకి ఎగసిపడే భోగిమంటలు రంగురంగుల ముగ్గులు పచ్చని పైరుగల పొలాలు అన్నీ ఎంతో అందంగా ఆహ్లాదకరంగా కనువిందుగా ఉంటాయని, సంక్రాంతి విశిష్టతను సెయింట్ ఆంథోని విద్యా సంస్థల అధినేత ఎస్ పి సుందర్ రాజు తెలిపారు. ఈ పండుగ సమయంలో రైతులు పండించిన పంట చేతికి వచ్చి వారికి లాభం చేకూరుస్తుంది కాబట్టి దీనిని రైతుల పండుగ అని కూడా అంటారని, అందుకు తగట్టు మనం మన పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని చెప్పారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పాఠశాల ప్రాంగణం అంతా ముగ్గులు, గాలి పటాలు, భోగి మంటలతో కోలాహలంగా గా మారింది. డూ డూ బసవన్న విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణ గా నిలిచాయి. పాఠశాల ఉపాధ్యాయ విద్యార్థుల బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సరిత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కుడారై ఉత్సవం



నవతెలంగాణ-ఘట్కేసర్

ధనుర్మాస పత్ర పూజ కార్యక్రమాల్లో భాగంగా మేడ్చల్ జిల్లా, ఘట్కేసర్ మండలం, ఎదులాబాద్లోని గోదా సమేత శ్రీమన్నారు రంగనాయకస్వామి దేవాలయంలో శనివారం ఘనంగా కుడారై ఉత్సవం జరిపారు. తెల్లవారుజామునే ఆలయంలో అమ్మవారికి తిరుప్పావై ఆలకించి, అభిషేకాలు, భక్తులకు అర్చనలు నిర్వహించారు. 11గంటలకు ఆలయ అవరణలో స్వామివారిని ప్రత్యేక వేదికపై అలంకరించారు. వెయ్యి గంగాళాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. వెయ్యి మందికి గంగాళాల్లో పాయసం వేసి భక్తులకు అందజేశారు. అనంతరం అమ్మవారికి భక్తులు ఒడిబియ్యం, పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంగళహారతి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు టీపీ లక్ష్మణాచార్యులు, రాజగోపాలచార్యులు, ఆనం తసేనామాచార్యులు, పురుషోత్తమాచార్యులు. అచ్యుతాచార్యులు. శ్రీవాత్సవాచార్యులు, శ్రీపతిచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE, NALGONDA DISTRICT. AT: BHONGIR.
O.S.No.57 OF 2015

Between:-
A.PRAVEEN REDDY. ...Plaintiff
A N D
S.SATYANARAYANA REDDY (Died per L.Rs) and others. ...Defendants
To
1.S.Manas Reddy,S/o.Late S.S.Satyanarayana Reddy, R/o.House Plot No.110,A Block, Airbus Apartment,H.No.3-5-585 Vithalwadi,Narayanguda, Hyderabad ...D4
Please take notice that the above named Plaintiff have filed the above suit against you for money and foreclosure of mortgage and the above suit is posted on 31-1-2025. At 10.30 am For your appearance either personally or through counsel otherwise the Hon'ble Court will proceed according to law.
//By order//
G.RAJEEV KUMAR,
Advocate
5-8-599/D,,First Floor,Ratan Mall Shipping Complex,Abids ,Hyderabad.

12
నవతెలంగాణ
హైదరాబాద్
ఆదివారం | జనవరి 12, 2025 | www.navatelangana.com

విక్టోరియా ప్లే గ్రౌండ్‌లో ముగ్గుల పోటీలు..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

అటల్ బిహారి శత జయంతి సందర్భంగా గన్‌ఫౌండ్రీ డివిజన్ చాదర్‌ఘాట్ విక్టోరియా ప్లే గ్రౌండ్‌లో శనివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలను స్థానిక కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్, బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షులు పాండు యాదవ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓం ప్రకాష్‌లు పరిశీలించారు. మహిళలు వేసిన వివిధ డిజైన్లతో వేసిన ముగ్గులు (రంగవల్లులు) అందరినీ ఆకట్టుకున్నాయి. విజేతలైన మహిళలకు బహుమతులు అందజేశారు.

17న ఎన్‌పీజీ చర్చి గ్రౌండ్‌లో 'క్యాంప్ ఫైర్'

నవతెలంగాణ-హిమాయత్ నగర్

గత ఏడాది 2024లో ప్రజల పట్ల యేసు ప్రభువు చూపిన కృపకు ధన్యవాదాలు తెలుపుతూ నూతన సంవత్సరం-2025లో ప్రజలందరిపై ఆయన దయ, కరుణ, రక్షణ, ప్రేమ, ఆశీస్సులు ఉండాలని ప్రార్థిస్తూ 17న సాయంత్రం 6 గంటలకు సికింద్రాబాద్‌లోని ఎన్‌పీజీ చర్చ్ గ్రౌండ్ లో 'క్యాంప్ ఫైర్' నిర్వహిస్తున్నామని క్రైస్తవులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వాయిస్ ఆఫ్ క్రిస్టియన్ యూనిటీ అధ్యక్షురాలు డాక్టర్ రాధా మ్యాథ్యూస్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ జామ్ చెరియన్, అనిల్ థామస్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ దీపక్ జాన్, రెవరెండ్ సిన్హా పాల్గొంటారని, అలాగే మోడరేటర్ ఆర్చ్ బిషప్ సింగం విల్సన్, డాక్టర్ సాధు సత్యనాథ్, సి.హెచ్.సుధీర్, డాక్టర్ అబ్రహం, రెవరెండ్ డెవిడ్ ఫ్రాంక్లిన్, డెవిడ్ నార్ఫోక్, సుజీవన్, బిషప్ ఆనంద్ కుమార్, బిషప్ ముళ్ళల భాస్కర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తిగీతాల ఆరాధన కొనసాగుతుందని వివరించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్లు: 9849745260, 9989442072లో సంప్రదించాలని ఆమె కోరారు.

పల్లెబాట పట్టిన పట్నం









సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్ వాసులు సొంతూళ్లకు పయనమయ్యారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై భారీ ట్రాఫిక్ జామ్ అయ్యింది. కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచి పోయాయి. పండుగకు సొంతూళ్లకు వెళ్లే వాహన దారులతో సందడి నెలకొంది.



24న పీఓడబ్ల్యూ ఐక్యత సభను జయప్రదం చేయండి

- కీబోర్డ్ డబ్ల్యు జాతీయ నాయకులు ఝాన్సీ



నవతెలంగాణ-ముషీరాబాద్

రెండు ప్రగతిశీల మహిళా సంఘంల ఐక్యత సభను 24న మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నామని ఈ సభకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పీఓడబ్ల్యూ జాతీయ నాయకులు ఝాన్సీ పిలుపునిచ్చారు. శనివారం విద్యానగర్ లోని మార్క్స్ భవన్ లో గ్రేటర్ హైదరాబాద్ ప్రగతిశీర మహిళా సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. నూతన గ్రేటర్ హైదరాబాద్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పీఓడబ్ల్యూ అధ్యక్షులుగా ప్రేమలత, ప్రధాన కార్యదర్శిగా భారతి, 11మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం మహిళా సంఘాల ఐక్యత సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా విడివిడిగా పనిచేస్తున్న రెండు పీఓడబ్ల్యూలు ఇకనుండి కలిసి పోతున్నాయని మహిళా సమస్యలపై మరింత ఉధృతంగా ఉద్యమిస్తామన్నారు. నేడు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మతోన్మాద విధానాల అవలంబిస్తూ పితృ స్వామిక భావజాలన్నీ మరింత స్థిరీకరిస్తుందన్నారు. దీని ద్వారా మహిళలపై హింస మరింత పెరుగుతుందన్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఇస్తానన్న రూ.2500 ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. మహిళలు అన్ని రంగాల్లో ఎదిగి సాధికారతవైపు అడుగులు వేయాలన్నారు. నరేంద్ర మోడీ సర్కార్ మతోన్మాద విధానాలకు, రేవంత్ రెడ్డి ప్రభుత్వ మహిళా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఈనెల 24న మంచిర్యాలలో జరుగు రెండు పీఓడబ్ల్యూల ఐక్యత సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు అనురాధ, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు అనసూయ, నాయకులు కావేరి, పుష్ప, రాజమణి, రాణి, సంతోషి, సుజాత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయులో చేరిన బీఆర్‌టీయు అంగన్వాడీ టీచర్స్



నవతెలంగాణ-మెహిదీపట్నం

అంగన్వాడి గోల్కొండ ప్రాజెక్టులోని అంగన్వాడి టీచర్స్ బీఆర్‌టీయు యూనియన్ నుంచి సీఐటీయులో చేరారు. సీఐటీయు నగర ప్రధాన కార్యదర్శి ఎంకటేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని వారు మాట్లాడుతూ అంగన్వాడి సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో పోరాడి సాధించేది సీఐటీయు అన్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రం అంగన్వాడి సమస్యలపై గత ప్రభుత్వాల మెడలు వంచి అంగన్వాడి కార్మికులకు జీతాలు పెంచిన ఘనత సీఐటీయు ఎర్రజెండాకే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాంపల్లి నియోజకవర్గం కార్యదర్శి సి.మల్లేష్ పాల్గొన్నారు.

పార్కులు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయి

చిల్డ్రన్స్ పార్కును ప్రారంభించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

మానసిక ఉల్లాసానికి పార్కులు దోహదపడుతాయని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లి మదర్ డైరీ పార్కులో చిల్డ్రన్స్ పార్క్‌ను ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పార్కులో చిన్నారుల సౌకర్యార్థం చిల్డ్రన్స్ పార్కును ప్రారంభించామని తెలిపారు. పిల్లలు ఆడుకోవడానికి ప్రత్యేక సదుపాయాలతో పార్క్ నిర్మాణం అవుతుందన్నారు. చదువుతోపాటు చిన్నారులకు ఆటవిడుపు కూడా ఎంతో అవసరమని చిన్నారుల మానసిక ఉల్లాసానికి ఈ పార్క్ ఎంతగానో దోహదం పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు ముఠా జై సింహా, స్థానిక డివిజన్ ప్రెసిడెంట్ శంకర్ ముదిరాజ్, బబ్లు, పార్క్ ప్రెసిడెంట్ రత్నాకర్ రెడ్డి, సుందరయ్య పార్క్ ప్రెసిడెంట్ నిరంజన్, రమేష్ రెడ్డి, నాగభూషణం, రాజశేఖర్, రాజు, శైలజ, కూరగాయల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మేరు యువ క్రీడాకారులు క్రీడారంగంలో రాణించాలి



- ఎంపీ అనిల్ కుమార్ యాదవ్

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

మేరు కులస్తులు అన్ని రంగాలతో పాటు క్రీడా రంగంలో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఆ దిశగా మేరు యువ క్రీడాకారులు కృషి చేయాల్సిన బాధ్యత తమపై ఉందని కాంగ్రెస్ ఎంపీ ఎం.అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. శనివారం మేరు క్రికెట్ లీగ్ సీజన్ 3-క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, పొన్నం అశోక్, రాష్ట్ర మేరు సంఘం నాయకులు కీర్తి రాజగోపాల్, మాడిశెట్టి లక్ష్మీనారాయణ, శాంతి కుమార్ నోముల, డి.కొండ నర్సింగ్ రావు లు ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. మేరు కులానికి చెందిన యువ క్రీడాకారులు, తమ నైపుణ్యాన్ని పెంపొందించేందుకు, ఇలాంటి టోర్నమెంట్‌లు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ఇలాంటి టోర్నమెంటులో భవిష్యత్తులో మరిన్ని నిర్వహించి, మేరు యువ క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మేరు కులస్తులను, అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం కీర్తి రాజగోపాల్ మాట్లాడుతూ.. ఈ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు రెండు రోజులు జరుగుతాయని ఇందులో 23 టీం లో పాల్గొంటాయని తెలిపారు. ఈ పోటీలో గెలుపొందిన విజేతలకు ట్రోఫి రన్నరఫ్‌గా నిలిచిన టీంకు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో, క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు ఓజోల శేఖర్, కుంట మల్ల లక్ష్మీ నారాయణ, జి అరుణ్, శ్రీపతి, సూరజ్ తదితరులున్నారు.

ఏఐవైఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

హిమాయత్‌నగర్‌లోని ఎన్. సత్య నారాయణరెడ్డి భవన్‌లో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి నూతన సంవత్సరం-2025 క్యాలెండర్ ను సంఘం రాష్ట్ర అధ్యక్షులు వలీ ఉల్లా ఖాద్రీ, కార్యదర్శి కె.ధర్మేంద్ర లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యువజన, విద్యార్థి సమస్యల పరిష్కార అజెండానే ఏఐవైఎఫ్ ప్రధాన కర్తవ్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువజన అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన కోసం నిర్దిష్టమైన విధానాలు అవలంభించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల బలోపేతం ద్వారానే దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ టి.సత్య ప్రసాద్, శ్రీమాన్, పేరబోయిన మహేందర్, కార్యవర్గ సభ్యులు సల్మాన్ బేగ్, మస్క సుధీర్, శివకుమార్, నవీన్, జగదీష్, హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలపై డీవైఎఫ్‌ఐ నిరంతరం పోరాటం

- క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభంలో డీవైఎఫ్‌ఐ రాష్ట్ర నాయకులు..



నవతెలంగాణ-ధూల్‌పేట్

దేశవ్యాప్తంగా యువకులను భారత యువజన ప్రజాతంత్ర సమైక్య డీవైఎఫ్‌ఐ నిరుద్యోగుల కొరకు నిరంతరం పోరాటం చేస్తుందని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్, అధ్యక్షులు కోట రమేష్‌లు అన్నారు. డీవైఎఫ్‌ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో క్రికెట్ సంక్రాంతి క్రీడోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాతబస్తీ జహనుమలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను వారు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా యువకులను డీవైఎఫ్‌ఐ నిరుద్యోగుల కొరకు నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. యువకులను క్రీడలు నిర్వహించి, వాళ్లలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడానికి డీవైఎఫ్‌ఐ కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా యువతకి యూత్ డిక్లరేషన్ పేరుతో ఐదు హామీలను ఇచ్చిందన్నారు. ప్రతి ఏడాది రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని జాబ్ క్యాలెండర్‌తో నియమకాలు చేపడతామని, నిరుద్యోగ భృతి రూ.4వేలు అందిస్తామన్నారు. ఇప్పటివరకు నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కృష్ణ నాయక్, ఆంజనేయులు, శ్రీను, రాజేష్, మురారి, హరీష్, చిన్న, 13 క్రికెట్ టీం కెప్టెన్లు పాల్గొన్నారు.

జైలుకెళ్లొచ్చినా తీరుమార్చుకోని నిందితులు

నగరంలో గంజాయి సరఫరా.. ఇద్దరు నిందితుల అరెస్టు.. ఆరుకిలోల గంజాయి స్వాధీనం

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో గంజాయి సరఫరా చేస్తున్న నిందితుడిని సౌత్ జోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. నిందితుని నుంచి ఆరు కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనంతో పాటు రూ.10,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.2,06,750 ఉంటుందని పోలీసులు తెలిపారు. శనివారం అదనపు డీసీపీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు నారాయణఖేడ్‌కు చెందిన టీమ్‌సింగ్ ఉపాధికోసం 2018లో హైదరాబాద్‌కు వచ్చి ఆర్సీపురంలో నివాసముంటున్నాడు. సరైన ఉపాధి అవకాశాలు లభించకపోవడంతో గంజాయి సప్లయ్ చేసి సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో ధూల్‌పేట్‌లో నివాసముంటున్న తనకు స్నేహితుడైన రాకేష్ సింగ్‌తో విషయం చెప్పాడు. ఇద్దరు కలిసి నిర్మాల్ ప్రాంతంలో గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌లో అధిక ధరలకు సప్లయ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ సారీ నిర్మల్ పోలీసులకు చిక్కారు. ఆ తర్వాత జైలు నుంచి తిరిగొచ్చిన తర్వాత తిరిగి గంజాయిని సప్లయ్ చేస్తున్నారు. పోలీసులకు చిక్కకుండా ఆసీఫాబాద్, జెన్నూర్ తదితర ప్రాంతాలల్లో గంజాయిని కొనుగోలు చేస్తూ నగరంలో సప్లయ్ చేయడం ప్రారంభించారు. టాస్క్‌ఫోర్సు పోలీసులు షాయినాథ్ గంజ్ పోలీసుల తో కలిసి ప్రత్యేక నిఘా వేశారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులపై నిర్మల్, కుల్సుపురా, హబీబ్‌నగర్, షాయినాథ్ గంజ్, మాదన్నపేట్, ధూల్‌పేట్‌తోపాటు వివిధ పోలీస్‌స్టేషన్లతోపాటు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో కేసులున్నాయని డీసీపీ తెలిపారు.

వనవాసి గూడెంలో వైద్య బృందం..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

జాతీయ యువజన దినోత్సవాలలో భాగంగా ఎన్ఎంఓ నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో వనవాసీయులకు సేవ చేసేందుకుగాను తెలుగు రాష్ట్రాల నుండి వివిధ వైద్య కళాశాలల వైద్య విద్యార్థులు సుమారు 150 మంది ఈ సేవలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా వనవాసీయుల సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకోవటమే కాకుండా వారి ఆర్థిక పరిస్థితి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని చికిత్సను అందించి ఉచిత మందుల పంపిణీ చేశామని ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.సురేంద్ర బాబు తెలిపారు. రాష్ట్రంలోని జాతీయ యువజనోత్సవాలలో భాగంగా ఎన్ఎంఓ ఆధ్వర్యంలో నిర్వ హించిన పోటీలలో వివిధ వైద్య కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులకు వివిధ పోటీలు అనగా క్విజ్ పోటీ, పోస్టర్ ప్రెజెం టేషన్, షార్ట్ ఫిల్మ్ మేకింగ్ వంటి పోటీలను నిర్వహించారు. ఎన్ఎంఓ ఆధ్వర్యంలో నిర్వహించిన కాంపిటీషన్‌లో పాల్గొన్న విద్యార్థులకు మెమోంటోస్, ప్రశంసా పత్రలను అందజేయడం జరిగిందని తెలిపారు.

కొండపోచమ్మ రిజర్వాయర్ ఘటన మృతుల్లో నలుగురు ముషీరాబాద్, మరొకరు ఖైరతాబాద్



నవతెలంగాణ-ముషీరాబాద్/బంజారాహిల్స్

సిద్దిపేట జిల్లా కొండపోచమ్మ రిజర్వాయర్ వద్ద నీటిలో మునిగి ఏడుగురు గల్లంతైన ఘటనలో ఐదుగురు మృతి చెందారు. అయితే ఈ ఐదుగురిలో నలుగురు ముషీరాబాద్‌కు చెందిన వారు కాగా, మరొకరు ఖైరతాబాద్‌కు చెందినవారు. ముషీరాబాద్‌లో నివసించే ధనుష్ (20) ఫొటో స్టూడియోలో పని చేస్తాడు. అతని సోదరుడు లోహిత్ అలియాస్ లక్కి (17) విద్యార్థి, బన్సిలాల్‌పేట కవాడిగూడ సమీపంలో నివసించే చీకట్ల ధనేశ్వర్ (17) విద్యార్థి, ఖైరతాబాద్ చింతల్‌బస్తీకి చెందిన జతిన్ (17) విద్యార్థి, సాహిల్ (19), రాంనగర్‌కు చెందిన కొమారి మృగాంక్ విద్యార్థి, ముషీరాబాద్‌కు చెందిన విద్యార్థి ఇబ్రహీంలు ప్రమాదం నుంచి బయటపడ్డారు.

సంకల్పంతో చదివితే విద్యార్థుల విజయం తథ్యం..



మోటివిషనల్ స్పీకర్ అమీన్ ముదస్సర్

నవతెలంగాణ-ధూల్‌పేట్

బోర్డు పరీక్షలకు హాజరు అయ్యే విద్యార్థినీ, విద్యార్థులు సంకల్పంతో చదివితే విజయం తథ్యమని మోటివిషనల్ స్పీకర్ అమీన్ ముదస్సర్ అన్నారు. ఆఫీసర్స్ మెస్ ఫంక్షన్ హాల్ లో సఫా బైతుల్ మాల్ ఆధ్వర్యంలో పేద విద్యార్థిని, విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన కెరీర్స్ గైడ్‌లైన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. బోర్డు ఎగ్జామ్స్ రాసే వారు ఉపాధ్యాయుల సూచనలను పాటిస్తూ క్రమశిక్షణతో ప్రతి రోజు ఉదయం రాత్రి సమయంలో చదివితే తప్పక విజయం సాధిస్తారన్నారు. విద్యార్థిని, విద్యార్థులు ఇప్పటి నుంచి పరీక్షలు ముగిసే వరకు సెల్ ఫోన్ వాడకుండా తల్లి తండ్రులు కూడా నిఘా పెట్టాలన్నారు. అనంతరం సఫా బైతుల్ మాల్ ప్రతినిధులు మాట్లాడుతూ.. సఫా బైతుల్ మాల్ గత రెండు దశబ్దాల నుంచి నిరుపేదలకు సహాయం చేస్తుందన్నారు. వృద్ధులు, వితంతువులకు నెల పింఛన్, పేద విద్యార్థులకు ఫీజు, నిరుద్యోగ యువకులకు జీవనోపాధి కోసం ఆర్థిక సహాయం చేస్తూ వారికీ ఉపాధి కల్పిస్తున్నామన్నారు. బోర్డు ఎగ్జామ్స్‌లో విద్యార్థుల ఉత్తీర్ణ శాతం పెంచడానికి కెరీర్ గైడ్‌లైన్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సఫా బైతుల్ మాల్ ప్రతినిధులు మౌలానా ముసదిక్ ఖాష్మి, మౌలానా అబ్దుల్లా మౌజ్, ఏటేశముద్దీన్, మీర్జా అక్రమ్ బేగ్, మౌలానా అన్సారీ, మౌలానా అబ్దుల్ గఫార్ తో పాటు విద్యార్థులు వారి తల్లి తండ్రులు పాల్గొన్నారు.

'కింగ్ ఫిషర్ బీర్లను తెలుగు రాష్ట్రాల్లో నిషేధించాలి'

- బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

తెలుగు రాష్ట్రాల్లో కింగ్ ఫిషర్ బీర్లపై నిషేధం విధించి ప్రజల ఆరోగ్యం, ఆర్థిక సంక్షేమం, ప్రాచీన సంప్రదాయాలను కాపాడటానికి కల్లు, నీరా ఉత్పత్తులను ప్రోత్సహించాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్ రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రులకు విజ్ఞప్తి చేశారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కింగ్ ఫిషర్ సంస్థకు అనుకూలంగా తీసుకున్న నిర్ణయాల వల్ల మోనోపలి ఏర్పడిందని, దీని వల్ల స్థానికంగా నాణ్యమైన బీర్లను ఉత్పత్తి చేసే చిన్న కంపెనీలకు మార్కెట్‌లో నిలదొక్కుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆ తల బిరుసుతోనే ఏకంగా ప్రభుత్వాన్ని బెదిరించే స్థాయికి యూబీ గ్రూపు వచ్చిందన్నారు. మాకు మిగలడం లేదని కంపెనీ గగ్గోలు పెడుతుందని, ఎక్కువ ఖర్చు లేకుండా తయారయ్యే బీరుకు 18 శాతం సరిపోవడం లేదా అని ప్రశ్నించారు. బ్లాక్ మెయిల్ చేసి ధరలు పెంచేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తుందని, మార్కెట్‌లో అంతకంటే తక్కువ ధరకు ఎక్కువ నాణ్యమైన బీర్లు సరఫరా చేసే కంపెనీలు బోలెడు ఉన్నాయని, మోనోపలి ఏర్పడటం వల్ల చాలా కంపెనీలు తెలంగాణలో అమ్మకాలు చేయలేకపోతున్నాయన్నారు. కల్లు, నీరా వంటి సంప్రదాయ ఉత్పత్తులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తాయని, ఆరోగ్య పరమైనవి మాత్రమే కాకుండా, గ్రామీణ ప్రజలకు ఉపాధి అవకాశాలను అందిస్తాయని, సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వీటిని ప్రోత్సహిం చడం ద్వారా గ్రామీణ ప్రాంతాల ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్ చైర్మెన్ గాలిగల్ల సాయిబాబా బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు వనం తిరుపతయ్య యాదవ్, గుర్రం రాఘవేందర్ గౌడ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ..



నవతెలంగాణ-ధూల్‌పేట్

నవతెలంగాణ నూతన క్యాలెండర్-2025ను ఆవిష్కరిస్తున్న ఫలక్‌నుమ సర్కిల్-10 డిప్యూటీ కమిషనర్ అరుణ కుమారి, నవతెలంగాణ జోన్ ఇన్‌చార్జి వెంకట స్వామి..

ఫిజికల్ డైరెక్టర్ రెజ్లింగ్ నవ్యరాణీకి ఘన సన్మానం..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

వస్తాద్ బాబయ్య వ్యామశాల కోచ్ ఎన్.జ్ఞానేశ్వర్ ఆధ్వ ర్యంలో ఇటీవల ఫిజికల్ డైరెక్టర్‌గా నియమితులైన నాగారం రెజ్లర్ నవ్యరాణికు పూలబొకే అందించి శాలువా కప్పి ఘనం గా సన్మానించిన ప్రముఖ కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ ఏముల సుధాకర్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్స్ డాక్టర్ రాజేష్, డాక్టర్ సునీల్, హైదరాబాద్ జిల్లా రెజ్లింగ్ అసోసి యేషన్ జనరల్ సెక్రటరీ నాసర్ ఖులఖి ఆర్గ సెక్రటరీ ఎండీ అస్లాం నయీం, క్రిమినల్ అడ్వకేట్ భూపాల్ రాజ్, ప్రముఖ వ్యాపారి మోతె గోపాలకృష్ణ, లాయర్ రమేష్, రిటైర్డ్ ఎస్ఐ వెంకటేష్ తదితరులు

నవతెలంగాణ-ధూల్‌పేట్



జాతీయ మైనారిటీ వింగ్ కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ అనిల్ థామోస్, టీఎస్ సీఎం ఎస్సీ చైర్మెన్ దీపక్ జాన్, మేనేజింగ్ డైరెక్టర్ సభితలను శాలువలతో సన్మానించిన జంట నగరాల చర్చిల కన్వీనర్ బ్రదర్ బి.ఆనందం..

దేవస్థాన క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ముషీరాబాద్

వైకుంఠ ఏకాదశి సందర్భంగా ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు తేజగౌడ్ చార్మినార్ శ్రీ బాలాజీ మందిర్ లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.



హైమావతి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలో పాల్గొన్న విద్యార్థులు నవతెలంగాణ-అంబర్‌పేట

నవతెలంగాణ-ముషీరాబాద్



వైకుంఠ ఏకాదశి సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు భూపేష్ సాగర్ తిరుమల తిరుపతి దేవస్థానంలో మాజీ కేంద్రమంత్రి తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు పనబాక లక్ష్మి తో కలిసి వెంకటేశ్వర స్వామి వారి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని కోరుకున్నానని తెలిపారు.

తొలి స్టంట్ ఉమెన్



సాధారణంగా సినిమాల్లో హీరోలు చేసే స్టంట్ సీన్లను చూసి ఆశ్చర్యపోతుంటాము. స్టంట్స్ చేయాలంటే ఎంతో ప్రాక్టీస్ ఉండాలి. దాంతో పాటు ధైర్యం కూడా ఉండాలి. ఇక హీరోహిన్లకు అలాంటి సీన్లు పెద్దగా ఉండవు. ఉంటేగింటే మహిళా ప్రాధాన్యం కలిగిన చిత్రాల్లో మాత్రమే ఉంటాయి. ఇప్పటికీ ఇదే పరిస్థితి ఉంది. అలాంటిది వంద ఏండ్ల కిందట బ్లాక్ అండ్ వైట్ సినిమాల టైంలో మహిళలను ఆ సీన్లలో చూపించే అవకాశమే లేదు. అలాంటి సమయంలో మేరీ ఆన్ ఎవాన్స్ ఆ లోటు తీర్చింది. ఫియర్‌లెస్ నదియాగా పేరు తెచ్చుకున్న ఆమె ఎవరో ఆమె సినీ ప్రస్థానం ఎలా మొదలైంది తెలుసుకుందాం...

సుమారు 115 ఏండ్ల కిందట నందిని అందర్నీ ఆశ్చర్యపరిచేలా స్టంట్‌లు చేసింది. కండలు తిరిగిన మగవాళ్లని ఒక్క ఉదుటున కట్టడి చేసే ఆమె తెగువకు అందరూ కంగుతిన్నారు. అమ్మాయిలు ఇలాంటివి కూడా చేయగలరనేందుకు ఆమె ప్రేరణగా నిలిచింది. ఆమె వల్లనే నేటి సినిమాల్లో అమ్మాయిలకు మంచి స్టైలిష్ ఫైటింగ్ సీన్‌లు ఇస్తున్నారని చెప్పుకోవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే భారతదేశంలోనే మొదటి స్టంట్ ఉమెన్‌గా ఆమె పేరు తెచ్చుకుంది.

నిజజీవితంలోనూ...

మేరీ ఆన్ ఎవాన్స్ ఆ రోజుల్లో అసాధారణమైన ఫైట్‌లతో ప్రేక్షకులను అలరించింది. 1908లో జన్మించిన ఆమె అసామాన్యమైన ధైర్యం, బలం, నిర్భయ వ్యక్తిత్వానికి నిలువెత్తు నిదర్శనంగా ఉండేది. అలనాటి బాలీవుడ్ సినిమా హనీ బన్నీలో అసమాన్యమైన ధైర్యసాహసాలు గల హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. ఆ సినిమాలో ఆమె చేసిన స్టంట్‌లు కేవలం సినిమా వరకు పరిమితం అనుకుంటే పొరపాటే. ఎందుకంటే ఆమె నిజజీవితంలో కూడా అలానే ఉండేవారంట. ఆస్ట్రేలియా మూలాలకు చెందిన నీలి కళ్ల ఆమె ఎంతో అందంగా ఉండేవారు. ఆ రోజుల్లో మోకాలి ఎత్తు బూట్లు వేసుకొని కొరడాతో ప్రత్యర్థులను చిత్తు చేసే హీరోయిన్‌గా ప్రేక్షకులను మెప్పించేవారు. చెప్పాలంటే ఇలాంటి ధైర్యవంతమైన మహిళలను కూడా ఆదరిస్తారు ప్రజలు అని తన నటనతో చాటి చెప్పింది.

సర్కస్‌లో పని చేస్తూ...

వైవిధ్య భరితమైన సాహసోపేతమైన పాత్రలు చేసినందుకు గానూ ఆమెను హంటర్‌వాలి అని ముద్దుగా పిలుచుకునేవారు అభిమానులు. ఆస్ట్రేలియాలోని గ్రీకుకి చెందిన తల్లి పెర్త్, బ్రిటిష్ తండ్రికి జన్మించింది ఎవాన్స్. తన తండ్రి సైనిక విభాగంలో పని చేస్తూ భారతదేశానికి రావడంతో ఆమె కూడా ఇండియాకు వచ్చేసింది. అయితే తండ్రి



మరణంతో కుటుంబం మొత్తం ముంబయిలోనే స్థిరపడింది. నటిగా కెరీర్ ప్రారంభించటానికి ముందు ఆమె సర్కస్‌లో పని చేసేది. అక్కడ నృత్యం, గుర్రపుస్వారీల వంటి ప్రదర్శనలు ఇచ్చేది. అలా నటిగా కెరీర్‌ని చిన్న చిన్న పాటలతో ప్రారంభించింది. వాటికి ప్రేక్షకుల ఆదరణ లభించడమే గాక ఓ బాలీవుడ్ దర్శకుని దృష్టిలో పడేలా చేసింది. ఆయన ఆమెలోని ప్రతిభను గుర్తించి బాలీవుడ్ సినిమాల్లో హీరోయిన్‌గా పరిచయం చేశాడు. అలా ఆమె సినీరంగ ప్రవేశం చేసింది. అంతేకాకుండా మహిళలు సైతం స్టంట్ సన్నివేశాలు చేయగలరని నిరూపించింది.

పోరాడే పాత్రలే...

సినీ రంగ ప్రవేశం చేసిన తర్వాత ఆమె కెరీర్‌లో మైలు రాయి హంటర్‌వాలి సినిమా. అందులో తన తండ్రి మరణానికి న్యాయం కోరుతూ ప్రతీకారం తీర్చుకునే యువరాణి పాత్రలో కనిపించి ప్రేక్షకులను అలరించింది. ప్రజల మదిలో ఆ పాత్ర నిలిచిపోయేలా నటించింది. ఆ విధంగా ఆమె బాలీవుడ్‌లో ప్రముఖ తారగా ఓ వెలుగు వెలిగింది. ఆమె సంతకం కూడా వెరైటీగా ఉంటుంది. ఓ అరుపులా హేయ్ అని క్యాచీగా సంతకం చేసేదంట. ధైర్యవంతురాలైన మహిళగా విలన్లతో పోరాడే పాత్రలనే ఆమె ఎక్కువగా చేసింది. ప్రజలు ఆ రోజుల్లో ఆమె స్టంట్‌లకు బ్రహ్మరథం పట్టేవారంట.

మూసధోరణిని బద్దలు కొట్టి

ఆమె ఈ పాత్రలు చేయడం ప్రారంభించిన తర్వాతనే హీరోయిన్లకు ఇలాంటి పాత్రలు రావడం సులవయిందని సినీ విశ్లేషకులు అనేవారు. అంతేకాదు బాలీవుడ్‌లో విశేష ప్రజాదరణ పొందిన విదేశీయులలో ఆమె కూడా ఒకరు. హీరోయిన్లంటే మామూలు పాత్రలకే పరిమితమైన మూసధోరణిని బద్దలు కొట్టి సాహసోపేతమైన విన్యాసాలను అవలీలగా చేయగలరని చెప్పేలా స్ఫూర్తిగా నిలిచింది. ఇలా ఎందరి అభిమానమో పొందిన ఆమె 1996లో తన 86వ ఏటన మరణించారు. ఇప్పటికీ స్టంట్ ఉమెన్ అనగానే ఆమె పేరు గుర్తొచ్చేలా ప్రజల మదిలో చెరగని ముద్ర వేసుకున్నారు. ■



అపరిచితులతో జాగ్రత్తా...

నేను గీతికకు ప్రేమతో...

ఎలా ఉన్నావ్ బంగారు తల్లి? ప్రతి వారం అమ్మ ఏదో ఒకటి చెప్తూనే ఉంటుంది అనుకుంటున్నావా? చెప్పక తప్పదు మరి. ఎందుకంటే జీవితంలో ఎన్నో సంఘటనలు, ఎందరితోనో పరిచయాలు అవుతూ ఉంటాయి. ఇప్పుడు నీకు బాగా ఊహ తెలిసింది కాబట్టి చెప్తున్నాను. నేను చెప్పేవన్నీ జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు తప్పక ఎదుర్కోవలసినవే.

ఈ రోజు నీకు అపరిచితులతో ఎలా ఉండాలో చెప్తాను. మనకు తెలియని వాళ్ళని అపరిచితులు అంటాము. పార్కుల్లో, సినిమా హాళ్ళల్లో, షాపింగ్ చేసేటప్పుడు, ప్రయాణాల్లో ఇలా ఎక్కడో ఒక చోట తారసపడి పలకరిస్తుంటారు. వీళ్ళు ఎంతో స్నేహంగా మాట కలుపుతారు. పరిచయం చేసుకుంటారు. వాళ్ళ గురించి ఎంతో గొప్పగా చెప్పుకుంటారు. వాళ్ళు చెప్పే వివరాలు ఎంత వరకు నిజమో మనకు తెలియదు. ఇటువంటి వారు వాళ్ళ గురించి చెప్తూనే మన వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తారు. అటువంటి వారితో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఫోన్ నెంబర్ అడిగితే 'నేనే మీకు ఫోన్ చేస్తాను, మీ నెంబర్ ఇవ్వండి' అని అడిగి తీసుకోవాలే తప్ప నీ నెంబర్ ఇవ్వకూడదు. వ్యక్తిగత వివరాలు ఏమైనా అడిగితే 'నేను కొంచెం పని తొందరలో ఉన్నాను, నెంబర్ తీసుకున్నాను కదా తర్వాత తీరిగ్గా మాట్లాడతాను' అని చెప్పాలి. మన వ్యక్తిగత

అమ్మ లేఖ

విషయాలు అస్సలు చెప్పవద్దు.

కొందరు అవగాహన లేక అపరిచితులతో పరిచయం పెట్టుకుని అనేక సమస్యలు తెచ్చుకుంటారు. ఉదాహరణకు అపరిచిత వ్యక్తి పార్కులో పరిచయం అయ్యారని అనుకుందాం. రోజూ వాకింగ్‌లో మాట్లాడుకుంటారు. వాళ్ళు మాటల్లో 'నిన్ననే మా అమ్మాయికి ఒక బంగారు గొలుసు చేయించాననో, స్థలం కొన్నామనో, ఇన్ని లక్షలు పెట్టి కారు కొనాలి అనుకుంటున్నామనో' ఇలాంటి విషయాలు ఎన్నో చెప్తారు. వాళ్ళు చెప్పారు కదా అని వీళ్ల కూడా అన్ని విషయాలు పూస గుచ్చినట్లు చెప్తారు. ఆ తర్వాత రకరకాల సమస్యలు మొదలవుతాయి. ఈ సమస్యలు వారి వరకే ఆగిపోవు, ఇంటి వరకు తెచ్చుకుంటారు. తర్వాత వాటి నుండి బయట పడటానికి ఎన్నో కష్టాలు ఎదుర్కోవలసి వస్తుంది.

అయితే అందరూ ఇలాగే ఉంటారని నేను అనను. వారి గురించి పూర్తిగా తెలియనంతవరకు ఏ విషయాలూ మాట్లాడకుండా ఉండటమే మంచిది. మనం తక్కువ మాట్లాడి, అవతలి వారి వివరాలు ఎక్కువ తెలుసుకునే ప్రయత్నం చేయాలి చిట్టితల్లి. వారు నివసించే ప్రాంతంలో నీకు తెలిసిన వాళ్లు ఉంటే కనుక వారి ద్వారా వీరి గురించి తెలుసుకోవాలి.

మాటలతో మభ్య పెట్టేవారు ఉంటారు. నమ్మకం కలిగేలా మాట్లాడతారు. మీరు ఇంకా లోక జ్ఞానం లేని చిన్న పిల్లలు కనుక చెప్తున్నాను నాన్న. ఎవరికీ ఫోన్ నంబర్స్, అడ్రసు లాంటివి ఇవ్వ వద్దు. సమస్యలు కొని తెచ్చుకోవద్దు. జాగ్రత్తగా ఉంటావని ఆశిస్తూ.... ■



ప్రేమతో అమ్మ
- పాలపర్తి సంధ్యారాణి

దాడి పిరికి పందల చర్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ చేసిన దాడిని పిరికి పంద చర్యగా ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వేర్వేరుగా విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు. రాజకీయంగా ఎదుర్కోలేక భౌతిక దాడులతో గులాబీ సైనికులను భయపెట్టాలని కాంగ్రెస్ విఫలయత్నం చేస్తోందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతోనే దాడి జరిగిందని ఆరోపించారు. కాంగ్రెస్ చేసిన మోసాలపై జిల్లాపార్టీ అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం లేకే దిగజారుడు చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో తెలంగాణ ప్రశాంతంగా ఉందని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అరాచక శక్తులకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందనీ, ఇందిరమ్మ రాజ్యం పేరుతో అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ తెలంగాణలో గూండారాజ్యం చలాయిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ భువనగిరి పార్టీ కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ శ్రేణులతో పాటు, వారి వెనుక ఉన్న నాయకులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు తగు రీతిలో స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు.

కన్నౌజ్ రైల్వే స్టేషన్‌లో కూలిన భవనం

(మొదటిపేజీ తరువాయి)

కార్మికులు పని చేస్తున్నారని తెలుస్తోంది. రైల్వే సిబ్బంది, పోలీసులు, ప్రభుత్వాధికారులు సంయుక్తంగా సహాయక చర్యలు చేపట్టి 23 మంది కార్మికులను సురక్షితంగా శిథిలాల నుండి బయటకు తీసుకొచ్చారు. ప్రాథమిక సమాచారం ప్రకారం నిర్మాణంలో ఉన్న భవనం పైకప్పు కూలిపోయిందని జిల్లా మెజిస్ట్రేట్ తెలిపారు. శిథిలాల కింద చిక్కుబడిన కార్మికులను కాపాడడమే తమ తొలి ప్రాధాన్యత అని, అందుకోసం అందుబాటులో ఉన్న అన్ని వనరులనూ ఉపయోగిస్తున్నామని ఆయన చెప్పారు.



బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడి

(మొదటిపేజీ తరువాయి)

స్థాయిలో రివ్యూ నిర్వహించి శాంతిభద్రతలను కాపాడాలని పోలీసులకు సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసును ముట్టడించేందుకు బీఆర్ఎస్ శ్రేణులు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దాంతో పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. అనంతరం యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రిన్స్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి చిత్రపటాన్ని దహనం చేశారు. ప్రభుత్వం డౌన్‌డౌన్, సీఎం రేవంత్‌రెడ్డి డౌన్‌డౌన్, కాంగ్రెస్ గూండాలు, రౌడీలు ఖబడ్దార్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ జడల అమరేందర్‌గౌడ్, రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ కన్వీనర్ కొలుపుల అమరేందర్, మున్సిపల్ మాజీ చైర్మెన్ అంజనేయులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జనగాం పాండు, పట్టణ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు జక్క రాఘవేందర్‌రెడ్డి, ర్యాకల శ్రీనివాస్, అజీముద్దీన్, ఏకుబాల్ చౌదరి, మధు పాల్గొన్నారు.

దాడిని ఖండించిన మాజీ మంత్రులు

బీఆర్ఎస్ కార్యాలయంపై దాడిని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఖండించారు.

లిక్కర్ కంపెనీల ఒత్తిడికి తలొగ్గం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లిక్కర్ కంపెనీల ఒత్తిడికి తలొగ్గేది లేదని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తేల్చి చెప్పారు. ఎక్సైజ్ శాఖ అధికారులతో శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి సీఎం సమీక్ష నిర్వహించారు. ఇటీవల యునైటెడ్ బేవరేజస్ కంపెనీ బీర్ల ధరలను 33.1 శాతం పెంచాలని ఒత్తిడి చేసిందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కంపెనీల ఒత్తిడి కి తలొగ్గేది లేదనీ, పొరుగున ఉన్న ఏపీ, మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న బీర్ల ధరలను పరిశీలించాలని సీఎం సూచించారు. హైకోర్ట్ రిటైర్డ్ జడ్జి నేతృత్వంలోని ధరల నిర్ణయ కమిటీ (ప్రైస్ ఫిక్సేషన్ కమిటీ) నివేదిక ఆధారంగా ధరల పెంపుపై నిర్ణయం తీసుకుంటామని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో మద్యం సరఫరా చేసేందుకు ముందుకొచ్చే కంపెనీలను ఎంపిక చేసేందుకు పారదర్శక విధానం పాటించాలని ఈ సందర్భంగా సీఎం అధికారులను ఆదేశించారు. ఇప్పటికే టీజీబీసీఎల్‌కు సరఫరా చేస్తున్న కంపెనీలు, కొత్త బ్రాండ్లు సరఫరా చేసేందుకు సులభతర వాణిజ్య విధానం అనుసరించాలని సూచించారు. కొత్త కంపెనీల నుంచి దరఖాస్తులు తీసుకునేందుకు నోటిఫికేషన్ జారీ చేసి, కనీసం నెల రోజుల నిర్ణీత గడువు ఇవ్వాలని ఆదేశించారు. ఆయా కంపెనీలు తమ బ్రాండ్ల పేర్లతో దరఖాస్తు చేసుకోవాలనీ, నాణ్యత ప్రమాణాలు, సరఫరా సామర్థ్యం పరిశీలించి పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గత ఏడాదిగా ఎక్సైజ్‌శాఖకు మద్యం సరఫరా చేసే కంపెనీలకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నామని ఈ సందర్భంగా అధికారులు సీఎంకు వివరించారు. గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను సైతం క్రమంగా క్లియర్ చేయాలని సీఎం ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సయ్యద్ ముర్తుజా రిజ్వీ, కమీషనర్ హరికిరణ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా 'ఉస్మానియా'కు శంకుస్థాపన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జనవరి నెలాఖరులోగా కొత్త ఉస్మానియా ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో ఆస్పత్రి నిర్మాణంపె సీఎం సమీక్ష నిర్వహించారు. గోషామహల్‌లో ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌శాఖ పరిధిలో ఉన్న స్థలాన్ని వైద్య, ఆరోగ్య శాఖకు వీలైనంత త్వరగా బదిలీ చేయాలని ఆదేశించారు. రెండు శాఖల మధ్య భూ బదలాయింపు ప్రక్రియ, ఇతర పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఆస్పత్రి భవన నిర్మాణాలకు సంబంధించిన నమూనా మ్యాపులను అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు. వాటిల్లో కొన్ని మార్పులు, చేర్పులను సీఎం సూచించారు. అన్ని రకాల ఆధునిక వసతులతో ఆస్పత్రి నిర్మాణం ఉండాలనీ, నాణ్యతలో ఎలాంటి రాజీ పడకూడదని ఆదేశించారు. రోడ్లు, పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నమూనాలను రూపొందించాలని సూచించారు.

రోడ్డు విస్తరణ, ఫ్లై ఓవర్ లాంటి నిర్మాణాలు చేపట్టినా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ముందుచూపుతో డిజైన్లను రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అత్యాధునిక వసతులతో పాటు రోగుల సహాయకులు సేదతీరేందుకు గ్రీనరీ, పార్క్ లాంటి సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా అత్యాధునిక వసతులతో ఉస్మానియా ఆస్పత్రి కొత్త భవనం ఉండాలని సీఎం ఆకాంక్షించారు.

అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుల్‌పై విస్తృత అధ్యయనం

(మొదటిపేజీ తరువాయి)

స్పందిస్తూ, వ్యవసాయానికి, గృహ అవసరాలకు మార్చి నెలలో అత్యధిక డిమాండ్ ఉంటుందనీ, దానికి అనుగుణంగా సరఫరా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్ సిటీ విస్తరిస్తున్నందున దానికి తగినట్టు విద్యుత్ ఏర్పాట్లు ఉండాలని సూచించారు. ఎక్కడైనా సాంకేతిక సమస్యలు వస్తే, సమీపంలోని మరో ఫీడర్ నుంచి ప్రత్యమ్నాయంగా సరఫరా చేసే వ్యవస్థను అమలు చేయాలని ఆదేశించారు. ఆదివాసీ గూడేల్లోని ఇండ్లకు సోలార్ విద్యుత్, సోలార్ పంపుసెట్లు ఉచితంగా అందించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. దీనికోసం అటవీ, గిరిజన సంక్షేమ శాఖలతోపాటు ఇతర శాఖలతో కూడా సమావేశమై త్వరలో పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని కోరారు. దాని ఆధారంగానే ఆదివాసీ గూడేల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, సోలార్ విద్యుత్ అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలపై సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. సోలార్‌తో పాటు ఇతర పునరుత్పాదక ఇంధనంపై ఆసక్తి చూపే కంపెనీలను ఆహ్వానించి, వారికి ఎలాంటి పనులు అప్పగించాలో ప్రణాళికలు తయారు చేయాలని చెప్పారు. దీనిపై ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్న విధానాలను పరిశీలించాలన్నారు. పరిగి వద్ద 400 కేవీ సబ్‌స్టేషన్ మంజూరై, పదేండ్లు అయినా ఇంకా పెండింగ్‌లోనే ఉందనీ, దానికి సంబంధించి పురోగతి నివేదిక ఇవ్వాలని కోరారు. గోషామహల్‌లో కొత్త ఉస్మానియా ఆస్పత్రి భవనం నిర్మిస్తున్నందున స్టేడియం పక్కనే ఉన్న సబ్‌స్టేషన్‌ను మరోచోటకి తరలించి, మరింత అదనపు సామర్థ్యంతో మరింత అధునాతన టెక్నాలజీతో నిర్మాణం చేయాలని ఆదేశించారు.

ఓయూ పీహెచ్‌డీ ఎంట్రెన్స్ టెస్ట్ నోటిఫికేషన్ విడుదల

24 నుంచి దరఖాస్తులు

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ ఎంట్రెన్స్ టెస్ట్-2025 కేటగిరీ-2 నోటిఫికేషన్‌ను పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.ఐనవోలు పాండురంగారెడ్డి శనివారం విడుదల చేశారు. 2022 తరువాత మళ్లీ ఇప్పుడే ఈ నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తు చేసుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, పీడబ్ల్యూడీ విద్యార్థులకు పీజీలో 50 శాతం మార్కులు, ఓపెన్ కేటగిరీ విద్యార్థులు 55 శాతం మార్కులు కలిగి ఉండాలి. ఇక టెస్ట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, పీడబ్ల్యూడీ విద్యార్థులకు 45 శాతం మార్కులు, ఓపెన్ కేటగిరీ విద్యార్థులకు 50 శాతం మార్కులు వస్తేనే అర్హత సాధిస్తారని నోటిఫికేషన్‌లో డైరెక్టర్ పేర్కొన్నారు.

క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీలో...

(మొదటిపేజీ తరువాయి)

రెండేండ్లకోసారి 5 శాతం పెంచుతారు. 2029-30 నాటికి థర్మల్ విద్యుదుత్పత్తి 15,893 మెగావాట్లకు చేరుతుందనీ, 20234-35 నాటికి ఇది 16,966 మెగావాట్లకు పెరుగుతుందని పేర్కొన్నారు. అంటే థర్మల్ ఉత్పత్తి పదేండ్లలో కేవలం1,103 మెగావాట్లు మాత్రమే పెరుగుతుంది. పై కాలానికి సంబంధించి వరుస ఏండ్లలో సోలార్ విద్యుదుత్పత్తి 19,874 మెగావాట్లు, 26,374 మెగావాట్లకు పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సోలార్ వ్యవస్థాపిత సామర్థ్యం 7,889 మెగావాట్లు ఉంది. అంటే 2034-35 నాటికి సోలార్ విద్యుత్ 18,485 మెగావాట్లు పెంచుకోవాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా 2034-35 నాటికి మొత్తం విద్యుదుత్పత్తి వ్యవస్థాపిత సామర్థ్యం 66,694 మెగావాట్లు కాగా, దీనిలో థర్మల్ వాటా 16,966 ఉంది. మిగిలిన విద్యుత్ మొత్తం పునరుత్పాదక ఇంధనమే కావడం గమనార్హం. ఇంత భారీ ఎత్తున పునరుత్పాదక ఇంధనాన్ని ఉత్పత్తిచేయాలని నిర్ణయించినా, పాలసీలో ఎక్కడా టీజీ జెన్‌కో లేదా టీజీ రెడ్కో వంటి ప్రభుత్వరంగ సంస్థల వాటాను నిర్ణయించలేదు. పూర్తిగా ప్రయివేటు రంగానికే పునరుత్పాదక ఇంథనాన్ని అప్పగిస్తున్నట్టే పాలసీలో తెలుస్తుంది. ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకాలు కూడా పూర్తిగా ప్రయివేటు రంగానికే పరిమితమయ్యాయి. సోలార్, డిస్ట్రిబ్యూటెడ్ రెనవబుల్ ఎనర్జీ, విండ్, హైడ్రో, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్స్, న్యూక్లియర్, గ్యాస్ బేస్డ్‌తో పాటు ఇతర పునరుత్పాదక ఇంధనోత్పత్తి విధివిధానాలను ఈ పాలసీలో రూపొందించారు.

లెక్క..పక్కా ఉండాలె !

(మొదటిపేజీ తరువాయి)

కచ్చితమైన లెక్కలు తీసి, దాని ఆధారంగా అనర్హులకు చెక్ పెట్టేందుకు సిద్ధమవుతున్నది. ఈ సారికి ఏ రైతుకూ సీలింగ్ పెట్టే ఆలోచన ప్రభుత్వానికి లేదని అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వం ఎకరాకు ఐదువేలు ఇచ్చింది. ఈసారి ప్రభుత్వం వెయ్యి రూపాయలు పెంచి, ఎకరాకు ఆరువేలు చేసింది. ఏడాదికి ఎకరాకు రూ. 12వేలు ఇవ్వబోతున్నది. రైతు కూలీలకు ఏడాదికి రూ. 12వేల ఇస్తామని ప్రభుత్వం చెప్పిన విషయం తెలిసిందే.

రెవెన్యూ, వ్యవసాయ శాఖల సమన్వయం

(మొదటిపేజీ తరువాయి)

జాబితా ఏఈవోల దగ్గర ఉన్నది. అందులో అనర్హుల పేర్లు తొలగించేందుకు రెవెన్యూ లెక్కలు తీస్తున్నది. వాటి ఆధారంగా కొత్త జాబితా సిద్ధం చేయనుంది. వారికే ఈ ప్రభుత్వం రైతు భరోసా జమ చేయనుంది. ఇప్పటికే క్షేత్రస్థాయిలో ఏఈవోలు డిజిటల్ క్రాప్ సర్వే కూడా పూర్తి చేశారు. వానకాలంలోనైతే మొత్తం భూమి సాగు చేస్తారు. పత్తి, వరి, జొన్న, మొక్కజొన్న, సజ్జ, సోయా, ఆముదం, పప్పు ధాన్యపు పంటలు పండిస్తారు. అయితే యాసంగి సీజన్ కాబట్టి కేవలం ఆరుతడి పంటలు మాత్రమే వేస్తారు. తమకున్న భూమిలో బోర్లు, బావులు, కాలువల కింద వరి, సోయా, మొక్క జొన్న, కూరగాయల పంటలు వేస్తారు. మిగతా భూమిలో వర్షాధార పంటలు వేస్తారు. కొంత మంది రైతులు తమకు ఉన్న భూమిలో మేకలు, గొర్రెలు, కోళ్లు, పందులను పెంచుకుంటారు. అవే వారికి జీవనాధారం. పామాయిల్, పండ్ల తోటలు, కూరగాయలు, ఆకు కూరలు పండిస్తారు. వీటి పంట కాలంలోనూ వ్యత్యాసం ఉంది. కొన్ని పంటలు 30 రోజుల్లో చేతికొస్తే...మరికొన్ని 8 నెలలకు వస్తాయి. పామాయిల్, పండ్ల తోటలు ఏండ్లపాటు పంటనిస్తాయి. ఈ పంటలు పండే భూములకు కచ్చితంగా పెట్టుబడి సాయం ఇస్తామని చెబుతున్నది.

కొండపోచమ్మ సాగర్‌లో నీట మునిగి ఐదుగురు యువకులు మృతి

(మొదటిపేజీ తరువాయి)

మల్లన్నను దర్శించుకొని వస్తామని ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పి బయలు దేరారు. మార్గమధ్యలో తూంకుంట వద్ద తొమ్మిదిన్నరకు టిఫిన్ చేసి మర్కుక్‌లోని కొండపోచమ్మ సాగర్ వద్దకు చేరుకొని ఈత

కొట్టేందుకు ఏడుగురు నీటిలోకి దిగారు. ఈ క్రమంలో సెల్ఫీలు దిగుతుండగా ఐదుగురు ప్రమాదవశాత్తు నీటిలో గల్లంతయ్యారు. వారిలో గైరా ధనుష్, గైరా లోహిత్, దినేశ్వర్, సాహేల్ దిపక్ సుతార్, ఉప్పల జతీన్ మృతిచెందారు. ప్రమాదం నుంచి బయటపడ్డ మృగాంక్, ఎండీ ఇబ్రహీం.. సాగర్ పరిసర ప్రాంతంలో ఉన్న రైతులకు సమాచారం చేరవేశారు. వారు వచ్చేసరికి ఐదుగురు నీట మునిగారు. దాంతో పోలీసులకు సమాచారం అందజేశారు. సిద్దిపేట సీపీ అనురాధ, గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి, గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లను రప్పించి యువకుల కోసం గాలింపుచర్యలు చేపట్టారు. 7 గంటల పాటు శ్రమించి ఐదు మృతదేహాలను బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, ఘటన విషయం తెలుసుకున్న సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, గజ్వేల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి.. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహాలను బయటకు తీసేవరకు అక్కడే ఉండి పర్యవేక్షించారు.

రోజుకు 23 మిలియన్ల మంది ప్రయాణం..

దక్షిణమధ్య రైల్వే ఐజీ అరోమాసింగ్ ఠాకూర్

నవతెలంగాణ-హైదరాబాద్

భారతీయ రైల్వేల్లో రోజుకు 23 మిలియన్ల మంది ప్రయాణిస్తున్నారని దక్షిణమధ్య రైల్వే ఐజీ అరోమాసింగ్ ఠాకూర్ అన్నారు. ప్రజలకు సేవలు అందించడమేక ఇతర అంశాలపై కూడా దృష్టిపెట్టాలని సూచించారు. శనివారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో రైల్వేల్లో మహిళా భద్రత, సాధికారతపై ప్రత్యేక చర్చాగోష్ఠి జరిగింది. ఈసందర్భంగా ఐజీ మాట్లాడుతూ సాధికారత కోసం ఒక సాధనంగా రైల్వేలు ఉపయోగపడతాయని వివరించారు.సామాజిక ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.

నవచిత్రం



"సంక్రాంతికి వస్తున్నాం'లో ఎక్స్ కాప్, ఎక్స్ గర్ల్‌ఫ్రెండ్, ఎక్స్‌లెంట్ వైఫ్.. ఈ లైనే చాలా ఫ్రెష్‌గా అనిపించి, సినిమా చేశాను' అని హీరో వెంకటేష్ చెప్పారు.

అనిల్ రావిపూడి, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ కాంబినేషన్‌లో వెంకటేష్ హీరోగా రూపొందిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించారు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్స్‌గా నటించారు. ఈ సినిమా ఈనెల 14న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా హీరో వెంకటేష్ మీడియాతో ముచ్చటించారు.

● హానెస్ట్ అండ్ సిన్సియర్‌గా వర్క్ చేయడమే మన చేతిలో ఉంటుంది. హిట్స్, ఫ్లాప్స్ మన చేతిలో ఉండవు. మన కంట్రోల్‌లో లేని విషయాలు గురించి నేను ఎక్కువ థింక్ చేయను. నా సోషల్ మీడియా అకౌంట్స్ నుంచి చాలా పాజిటివ్ పోస్టులు రావడానికి కారణం ఒక్కటే.. లైఫ్‌లో పాజిటివ్‌గా ఉండాలి. ఓవర్ థింకింగ్ అనవసరం. ఓ పాజిటివ్ థాట్‌తో రోజు మొదలు పెడితే జీవితం చాలా హాయిగా ఉంటుంది.

- వెంకటేష్

క్లైమాక్స్ అందర్నీ సర్‌ప్రైజ్ చేస్తుంది

● నా కెరీర్‌లో ఇది మరో సంక్రాంతి సినిమా. ఒక క్లీన్ ఎంటర్‌టైనింగ్ ఫిల్మ్‌తో రావడం చాలా ఆనందంగా ఉంది. ఇందులో ఓ చిన్న క్రైమ్ ఎలిమెంట్‌తోపాటు న్యూ జోనర్ కూడా ఉంది. నా కెరీర్‌లో సంక్రాంతికి వచ్చిన చాలా సినిమాలు చాలా బాగా ఆడాయి. ఈ సినిమా కూడా అద్భుతంగా ఆడుతుందనే నమ్మకం ఉంది.

● దర్శకుడు అనిల్, నాది సూపర్ హిట్ కాంబినేషన్. పెర్ఫార్మెన్స్ వైజ్ ఇందులో కామెడీ స్టయిల్ కొంచెం డిఫరెంట్‌గా ఉంటుంది. చాలా సెటిల్డ్‌గా, కొత్తగా ట్రై చేశాం. ఫ్రెష్ సీన్స్ ఉంటాయి. సినిమా అద్భుతంగా వచ్చింది. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ ఇద్దరూ చాలా మంచి క్యారెక్టర్స్ చేశారు. చక్కగా నటించారు. వీళ్ళ క్యారెక్టర్స్ చాలా క్రేజీగా ఉంటాయి.

● భీమ్స్ చాలా హార్డ్ వర్క్ చేసి బెస్ట్ మ్యూజిక్ ఇచ్చాడు. తనకి ఈ సినిమా మంచి బ్రేక్ ఇస్తుందనే నమ్మకంతో చేశాడు. ఫస్ట్ ట్యూన్ వినగానే హిట్ అనుకున్నాం. అది సూపర్ బ్లాక్ బస్టర్ అయ్యింది. 'గోదారి గట్టు' పాట 85 మిలియన్ వ్యూస్ క్రాస్ చేసింది. నాతో 'పొంగల్'.. సాంగ్ పాడించాలనే ఆలోచన నాదే. నైట్ రెండు గంటలకి ఆ సాంగ్ విన్నప్పుడు తెలియకుండానే డ్యాన్స్ చేశాను. ఏదో క్రేజీ ఎనర్జీ ఆ సాంగ్‌లో ఉంది. సరదాగా నేనే పాడతానని అన్నాను. ఆ రోజు గొంతు బాగానే ఉంది. ఇంగ్లీష్ వర్డ్స్ ఉండటంతో నాకు ఇంకా ఈజీ అయ్యింది (నవ్వుతూ). ఇందులో రమణ గోగుల పాడిన 'గోదారి గట్టు' పాట పెద్ద హిట్ అయ్యింది.

● ఇందులో క్లైమాక్స్‌లో చెప్పే డైలాగ్స్ చాలా క్రేజీ ఉంటాయి. ప్రేక్షకులు చాలా ఎంటర్‌టైన్ అవుతారు. డైలాగ్స్‌ని యూత్ చాలా లవ్ చేస్తారు. అన్నింటికీ మించి క్లైమాక్స్ అందర్నీ సర్‌ప్రైజ్ చేస్తుంది. దిల్ రాజు ప్రొడక్షన్‌లో సీతమ్మ వాకిట్లో..' నుంచి ట్రావెల్ అవుతున్నాను. వారితో జర్నీ చాలా కంఫర్ట్‌బుల్‌గా ఉంటుంది. మేం చేసిన సినిమాలన్నీ బాగా ఆడాయి. వారికి మరిన్ని విజయాలు రావాలని కోరుకుంటున్నాను.

కొత్త బాలకృష్ణని చూస్తారు



బాబీ కొల్లి

'సినిమా విషయంలో చిరంజీవి, బాలకృష్ణ ఇద్దరూ ఒకేలా ఉంటారు. ఇద్దరిలో ఎంతో క్రమశిక్షణ ఉంటుంది. ఇద్దరూ పని రాక్షసులే. నిర్మాతలకు అసలు నష్టం రానివ్వకూడదనే ఉద్దేశంతో పని చేస్తూ ఉంటారు. సినిమా కోసం ఎంతయినా కష్టపడతారు. వారితో కలిసి పని చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను' అని దర్శకుడు బాబీ కొల్లి అన్నారు.

బాలకృష్ణ హీరోగా బాబీ కొల్లి తెరకెక్కించిన చిత్రం 'డాకు మహారాజ్'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్ మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ కథానాయికలు. బాబీ డియోల్, ఊర్వశి రౌతేలా, చాందిని చౌదరి కీలక పాత్రలు పోషించారు.

సంక్రాంతి కానుకగా నేడు (ఆదివారం) ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు బాబీ కొల్లి శనివారం మీడియాతో సినిమాకి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

■ బాలకృష్ణ ఇమేజ్‌ని, ప్రేక్షకుల్లో ఆయన సినిమాపై ఉండే అంచనాలను దృష్టిలో ఉంచుకొని ఈ సినిమా చేశాను. అయితే ఆయన గత చిత్రాలకు భిన్నంగా కొత్తగా చూపించడానికి ప్రయత్నించా. బాలయ్య సెటిల్డ్‌గా డైలాగ్‌లు చెప్తే చాలా బాగుంటుంది. 'నరసింహనాయుడు', 'సమరసింహారెడ్డి' తర్వాత 'సింహా' ఎలా అయితే గుర్తుండే సినిమా అయిందో.. 'డాకు మహారాజ్' కూడా అలా గుర్తుండిపోయే సినిమా అవుతుంది.

■ బాలకృష్ణని నిర్మాత నాగవంశీ ఎంతో అభిమానిస్తారు. ఆ అభిమానంతోనే తమ బ్యానర్‌లో వచ్చే సినిమా వైవిధ్యంగా ఉండాలి అనుకున్నారు. ఇద్దరం కలిసి ఈ సినిమాలో విజువల్స్ గురించి ప్రత్యేకంగా మాట్లాడేలా చేయాలి అనుకున్నాం. మా విజన్‌కి తగ్గట్టుగానే డీఓపీ విజయ్ కన్నన్ అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. అలాగే ఇందులో హీరోకి ఆయుధం అనేది కీలకం. ఆర్ట్ డైరెక్టర్ అవినాష్ అద్భుతమైన ఆయుధాలను డిజైన్ చేశారు. తమన్ సంగీతం గురించి వేరే చెప్పక్కర్లేదు. పాటలు, నేపథ్య సంగీతం అదిరిపోయాయి.

■ ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్‌వి ప్రాధాన్యం ఉన్న పాత్రలు. ఇద్దరూ వారి పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. అలాగే రెగ్యులర్ విలన్ పాత్రలా కాకుండా బాబీ డియోల్ పాత్ర కొత్తగా ఉంటుంది.

■ నా గత సినిమాలతో బాబీ కథా కథనాలు బాగా రాస్తాడు అనే పేరు తెచ్చుకోగలిగాను. అయితే హాలీవుడ్ స్థాయిలో విజువల్స్ అద్భుతంగా ఉన్నాయని మాట్లాడుకునేలా చేయలేకపోయాను. ఇప్పుడు ఈ సినిమా విజువల్స్ పరంగా గొప్ప పేరు తీసుకొస్తుంది.



భిన్న కంటెంట్‌తో..

స్వాష్ కలర్స్ మీడియా, అలీనియ అవిజ్ఞ స్టూడియోస్, సెటిల్ కింగ్ ప్రొడక్షన్ నెం.1లో నిర్మాత వేణుబాబు ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఘంటసాల విశ్వనాథ్ దర్శకుడు. ఆదర్శ్ పుందిర్, అశ్రీత్ రెడ్డి, ప్రియాంక సింగ్, పూజిత పుందిర్, రాజ్ గౌడ్, సునందిని, మధుసూదన్ తదితరులు కీలక పాత్రధారులు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.

దర్శకుడు ఘంటసాల విశ్వనాథ్ మాట్లాడుతూ, 'డిసెంబర్ 26న షూటింగ్ మొదలు పెట్టి, నిరంతరం పగలు రాత్రి తేడా లేకుండా 15 రోజులపాటు చేశాం. దీంతో 50 శాతం షూటింగ్ కంప్లీట్ అయ్యింది. మిగతా సగ భాగం షూటింగ్ కోసం యుఎస్ వెళ్తున్నాం. టెక్నాలజీ, ఎమోషన్, లింగ సమానత్వం పై ఉండబోతున్న ఈ చిత్రం ఈ ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు వచ్చేలా సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు.

'నాకు చాలా మంచి క్యారెక్టర్ ఇచ్చారు. నా క్యారెక్టర్ అందరికీ నచ్చుతుందని అనుకుంటున్నాను. ఈ రోజుల్లో ఇటువంటి సినిమాలు రావడం లేదు. ఈ సినిమా ఎంతో స్పెషల్‌గా ఉండబోతోంది' అని నటి ప్రియాంక సింగ్ చెప్పారు. మరో నటి ఆదర్శ్ పందిరి మాట్లాడుతూ, 'మేము కొత్త కామెడీతో ముఖ్యంగా లింగ బేధాల పై మంచి సినిమాతో ప్రేక్షకులు ముందుకు రానున్నాం. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది' అని అన్నారు.





పట్నం.. పల్లె బాట

- సంక్రాంతికి సొంతూళ్లకు పయనం
- కిక్కిరిసిన బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు
- విజయవాడ హైవేపై వాహనాల బారులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్ నగరం పల్లెబాట పట్టింది. కుటుంబ సభ్యులతో కలిసి సొంత గ్రామాల బాట పట్టడంతో మహాత్మాగాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్), జూబ్లీ బస్టాండ్లతో పాటు సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. రైళ్లు, బస్సులు ప్రయాణికులతో నిండి పోయాయి. ఎలాగైనా ఇంటికి చేరుకోవాలనే తపనతో రిజర్వేషన్ లేకున్నా ఇబ్బందులు పడుతూనే జనం సొంతూళ్లకు పయనమయ్యారు. దాంతో హైదరాబాద్, విజయవాడ జాతీయ రహదారిపై శనివారం ఉదయం నుంచి రద్దీ పెరిగింది. అబ్దుల్లాపూర్‌మెట్ ఓఆర్‌ఆర్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. చౌటుప్పల్ పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరాయి. 10 టోల్‌బూత్‌ల ద్వారా ఏపీ వైపు వెళ్తున్న వారిని పంపించారు. హైదరాబాద్ వైపు వచ్చే వారిని ఆరు గేట్ల ద్వారా వదిలారు. చౌటుప్పల్ కూడలిలో అండర్‌పాస్ నిర్మాణ పనుల వల్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఆదివారం మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. హైదరాబాద్ నుంచి వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ రహదార్లలోనూ విపరీతమైన రద్దీ కనిపిస్తోంది. సాధారణ రోజుల్లో 35 వేల నుంచి 40 వేల వాహనాలు వెళ్తాయనీ, సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్ నుంచి లక్షకు పైగా వాహనాలు వివిధ టోల్‌ప్లాజాల ద్వారా వెళుతున్నాయని అధికారులు చెబుతున్నారు. మరో రెండ్రోజుల పాటు నగరం నుంచి రద్దీ ఇలాగే ఉంటుందని భావిస్తున్నారు.



టీజీఆర్టీసీ 6,432 ప్రత్యేక బస్సులు

సంక్రాంతికి ఊరెళ్లే ప్రయాణికుల కోసం తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ (టీజీఆర్టీసీ) 6,432 స్పెషల్ బస్సులను నడుపుతోంది. వాటిలో తెలంగాణ జిల్లాలకు 1,600 బస్సులు, మిగిలినవి ఏపీ సహా బెంగుళూరు తదితర ప్రాంతాలకు నడుపుతోంది.

అలాగే దక్షిణ మధ్య రైల్వే అధికారులు 366 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్లు జనాలతో నిండిపోగా, కొత్తగా ఏర్పాటు చేసిన చర్లపల్లి రైల్వే టెర్మినల్ నుంచి ఏపీలోని నర్సాపూర్, కాకినాడ, శ్రీకాకుళం, విశాఖపట్నం, తిరుపతి ప్రాంతాలకు ప్రత్యేకంగా 59 రైళ్లను నడుపుతున్నారు.

విమాన టికెట్ల ధరలకు రెక్కలు

సంక్రాంతి రద్దీని క్యాష్ చేసుకునేందుకు విమానయాన సంస్థలు సైతం టికెట్ల ధరలను భారీగా పెంచాయి. సాధారణ రోజుల్లో హైదరాబాద్, బెంగుళూరు నుంచి విశాఖకు విమాన చార్జీ రూ. 3,400 నుంచి 4,000 వేల వరకు ఉంటుంది. ప్రస్తుతం సంక్రాంతి సీజన్ సందర్భంగా విమాన టికెట్లకు రెక్కలు వచ్చి మూడు నాలుగు రెట్లు పెరిగిపోయాయి. అయినప్పటికీ సొంతూళ్ళకు వెళ్లాలనే తపనతో ప్రయాణికులు వేలాది రూపాయలు ఖర్చు పెట్టి ప్రయాణం సాగిస్తున్నారు. శని, ఆదివారాల్లో హైదరాబాద్ నుంచి విశాఖకు కనీస చార్జీ రూ.17,500కి పైగా ఉందని ప్రయాణికులు చెబుతున్నారు.



ప్రయివేటు ట్రావెల్స్ దోపిడీ

సంక్రాంతి పండుగ రద్దీని ట్రావెల్ ఏజెన్సీలు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నాయి. సాధారణ టికెట్ ధర కంటే మూడు, నాలు గింతలు వసూలు చేస్తూ అడ్డ గోలుగా దోపిడీ చేస్తున్నాయి. సాధారణ రోజులతో పోలిస్తే, ప్రత్యేక సర్వీసుల పేరిట 50 శాతం చార్జీలు అదనంగా వసూలు చేస్తున్నారు. ఆర్టీసీ బస్సులు సరిపడా లేకపోవడంతో ప్రయివేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు నిండా మునుగుతు న్నారు. సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుంచి విశాఖ పట్నానికి వెళ్లే ఏపీ స్లీపర్ బస్సుల్లో టికెట్ ధర రూ.4 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.6 వేలకుపైగా పలుకుతోంది. అలాగే సాధారణ రోజుల్లో ఏసీ సీటర్ బస్సుల్లో గరిష్టంగా రూ.1,849 వసూలు చేసేవారు. కానీ ప్రస్తుతం రూ.5,500 ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.

ఆటలు

షమి వచ్చేశాడు

- ఇంగ్లాండ్ టీ20 సిరీస్‌కు స్టార్ పేసర్
- బుమ్రా, పంత్, యశస్విలకు విశ్రాంతి



మహ్మద్ షమి ఎట్టకేలకు భారత జట్టులోకి వచ్చేశాడు. 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ తర్వాత గాయంతో జాతీయ జట్టుకు స్టార్ పేసర్ దూరమయ్యాడు. దేశవాళీ సర్క్యూట్‌లో ఫిట్‌నెస్, ఫామ్ నిరూపించుకున్న షమి ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌కు ఎంపికయ్యాడు. తెలుగు తేజాలు తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి సైతం టీ20 జట్టులో చోటు దక్కించుకున్నారు.

నవతెలంగాణ-ముంబయి

ఇంగ్లాండ్‌తో ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌లో పోటీపడే భారత జట్టును బీసీసీఐ సీనియర్ సెలక్షన్ కమిటీ శనివారం ఎంపిక చేసింది. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో 15 మందితో కూడిన జట్టును ప్రకటించింది. మోకాలు నొప్పి, చీలమండ గాయానికి శస్త్రచికిత్సతో సుమారు ఏడాదికి పైగా ఆటకు దూరమైన స్టార్ పేసర్ మహ్మద్ షమి మళ్లీ జాతీయ జట్టులోకి వచ్చాడు. జనవరి 22న కోల్‌కతలో జరగనున్న భారత్, ఇంగ్లాండ్ తొలి టీ20లో మహ్మద్ షమి బరిలోకి దిగనున్నాడు. ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌కు సహా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనే భారత జట్టును సెలక్షన్ కమిటీ ఇంకా ప్రకటించలేదు. ప్రాథమిక జట్లను సమర్పించేందుకు జనవరి 12ను ఐసీసీ గడువుగా నిర్దేశించింది. ఐసీసీ నుంచి ప్రత్యేక అనుమతి తీసుకుంటే మినహా.. గడువులోగా భారత జట్టును బీసీసీఐ వెల్లడించాల్సి ఉంటుంది.

బుమ్రాకు విశ్రాంతి

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో కండ్లుచెదిరే ప్రదర్శన చేసిన జస్‌ప్రీత్ బుమ్రా సహా వికెట్ కీపర్ రిషబ్ పంత్, ఓపెనర్ యశస్వి జైస్వాల్ విశ్రాంతి పొందారు. ఈ ముగ్గురు క్రికెటర్లు ఐదు టెస్టుల్లోనూ ఆడారు. ఆఖరు టెస్టులో బుమ్రా వెన్నునొప్పితో మైదానం వీడటంతో అతడి గాయం తీవ్రతపై బీసీసీఐ వైద్య బృందం పర్యవేక్షణ కొనసాగుతుంది. ఫిట్‌నెస్ సమస్యలు లేకుంటే.. వన్డే సిరీస్ లేదంటే నేరుగా చాంపియన్స్ ట్రోఫీ జట్టులో బుమ్రా నిలిచే అవకాశం ఉంది. శుభ్‌మన్ గిల్‌ను సెలక్టర్లు పరిగణనలోకి తీసుకున్నట్టు లేదు!. వికెట్ కీపర్లుగా సంజు శాంసన్, ధ్రువ్ జురెల్ జట్టులో నిలిచారు. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో బెంగాల్ తరఫున ఆడిన మహ్మద్ షమి 7.85 ఎకానమితో 11 వికెట్లు పడగొట్టాడు. విజయ్ హజారే ట్రోఫీలోనూ 25.80 సగటుతో ఐదు వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. షమి ఫిట్‌నెస్‌పై అనుమానాలు కొనసాగుతున్నా.. టీ20 మ్యాచ్‌కు పెద్దగా ఇబ్బందులు ఉండవనే భావనతో సెలక్షన్ కమిటీ అతడిని ఎంపిక చేసినట్టు తెలుస్తోంది.

ఆ ఐదుగురు అవుట్

నిరుడు దక్షిణాఫ్రికాపై టీ20 సిరీస్ నెగ్గిన జట్టులోని ఐదుగురు ఆటగాళ్లను సెలక్షన్ కమిటీ పక్కనపెట్టింది. రమణ్‌దీప్ సింగ్, జితేశ్ శర్మ, అవేశ్ ఖాన్, యశ్ దయాల్, విజయ్ కుమార్ వైశాక్‌లకు ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో చోటు దక్కలేదు. ఆసీస్‌తో టెస్టులో సిరీస్‌లో ఆడిన నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రానా, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్‌లు టీ20 జట్టులో నిలిచారు. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ సెలక్షన్ కమిటీ నుంచి మరోసారి అవకాశం దక్కించుకోగా.. స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ ప్రమోషన్ అందుకున్నాడు. టీ20 జట్టుకు వైస్ కెప్టెన్‌గా అక్షర్ పటేల్ ఎంపికయ్యాడు. రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, అర్షదీప్ సింగ్, హార్దిక్ పాండ్య, రింకూ సింగ్‌లు జట్టులో కొనసాగుతున్నారు.

తెలుగు వెలుగు

టీమ్ ఇండియా టీ20 జట్టులో తెలుగుదనం ఉట్టిపడుతోంది. తెలంగాణ క్రికెటర్ తిలక్ వర్మ, ఆంధ్ర స్టార్ నితీశ్ కుమార్ రెడ్డి జాతీయ జట్టులో నిలిచారు. 22 ఏండ్ల తిలక్ వర్మ భారత్‌కు 22 టీ20లు ఆడగా.. 21 ఏండ్ల నితీశ్ కుమార్ ఇప్పటివరకు 3 టీ20లు ఆడాడు. భారత జట్టులో ఒక్క తెలుగు క్రికెటర్ ప్రాతినిథ్యం వహించటమే గగనమైన రోజుల నుంచి.. ఏకంగా ఇద్దరు క్రికెటర్లు చోటు సాధించటం తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమని చెప్పవచ్చు.



22న తొలి టీ20

భారత్, ఇంగ్లాండ్ పోటీ సిరీస్ ఈ నెల 22న ఆరంభం కానుంది. చాంపియన్స్ ట్రోఫీ ముంగిట భారత్ ఐదు టీ20లు, మూడు వన్డేలు ఆడనుంది. కోల్‌కత, చెన్నై, రాజ్‌కోట్, పుణె, ముంబయిలు టీ20 మ్యాచులకు వేదికగా నిలువనున్నాయి. తొలి మ్యాచ్ 22న, ఐదో మ్యాచ్ ఫిబ్రవరి 2న జరుగుతుంది. కీలక వన్డే సిరీస్ ఫిబ్రవరి 6న షురూ కానుంది. నాగ్‌పూర్‌లో తొలి వన్డే షెడ్యూల్ చేయగా.. కటక్, అహ్మదాబాద్‌లో చివరి రెండు వన్డేలు జరుగుతాయి. ఐసీసీ 2025 చాంపియన్స్ ట్రోఫీ ఫిబ్రవరి 19న ఆరంభం కానుంది. ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ అనంతరం భారత్ నేరుగా దుబాయ్‌కు చేరుకోనుంది. గత ఏడాది మూడు వన్డేలే ఆడిన టీమ్ ఇండియా ఆశించిన ప్రదర్శన చేయలేదు.

భారత టీ20 జట్టు

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), సంజు శాంసన్ (వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి, మహ్మద్ షమి, అర్షదీప్ సింగ్, హర్షిత్ రానా, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రింకూ సింగ్, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, వాషింగ్టన్ సుందర్.

సాత్విక్ జోడీ అవుట్

మలేషియా ఓపెన్ సూపర్ సిరీస్


కౌలాలంపూర్ : వరల్డ్ నం.9, భారత బ్యాడ్మింటన్ స్టార్స్ సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టిలు మలేషియా ఓపెన్ నుంచి నిష్క్రమించారు. ఏడాది తొలి సూపర్ సిరీస్‌లో భారత డబుల్స్ జోడీ నిరాశపరిచింది. శనివారం జరిగిన మెన్స్ డబుల్స్ సెమీఫైనల్లో దక్షిణ కొరియా జోడీ కిమ్, సియో చేతిలో వరుస గేముల్లో పరాజయం పాలైంది. 10-21, 15-21తో సాత్విక్, చిరాగ్‌లు అనూహ్యంగా ఓటమి చెందారు. తొలి గేమ్‌లో 6-11తో వెనుకంజ వేసిన సాత్విక్, చిరాగ్‌లు 19 నిమిషాల్లోనే ప్రత్యర్థికి గేమ్ అప్పగించారు. 10-21తో తొలి గేమ్ చప్పగా ముగిసింది. కీలక రెండో గేమ్‌లో ఏడో సీడ్ భారత జోడీ 11-8తో విరామ సమయానికి ముందంజ వేసింది. కానీ ద్వితీయార్థంలో పొరపాట్లు ఫైనల్లో బెర్త్ కోల్పోయేలా చేశాయి.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

'మత్తు'లో మోడీ సర్కార్‌!

- మాదకద్రవ్యాల రవాణా కట్టడిలో వైఫల్యం
- పదేండ్లలో ఏడురెట్లు పెరిగిన రవాణా
- డ్రగ్స్‌ సరఫరాకు అడ్డాగా మారిన గుజరాత్‌లోని ముద్రా పోర్టు
- 2047కల్లా మాదకద్రవ్యాల రహిత భారత్‌ : అమిత్‌ షా



న్యూఢిల్లీ : గత పదేండ్లలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా ఏడు రెట్లు పెరిగిందని కేంద్ర హోం మంత్రి అమిత్‌ షా స్వయంగా వెల్లడించారు. అంతకుముందు దశాబ్దంతో పోలిస్తే 2014 నుంచి 2024 మధ్య కాలంలో డ్రగ్స్‌ రవాణా అధికంగా పెరిగిందన్నారు. 'మాదకద్రవ్యాల అక్రమ రవాణా, జాతీయ భద్రత' అనే అంశంపై న్యూఢిల్లీలోని విజ్ఞాన్‌ భవన్‌లో నిర్వహించిన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అమిత్‌ షా మాట్లాడుతూ 2024వ సంవత్సరంలో నార్కోటిక్స్‌ కంట్రోల్‌ బ్యూరో (ఎన్‌సిబి), వివిధ రాష్ట్రాల పోలీసులు కలిపి రూ.16,914 కోట్ల విలువ చేసే డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారని వెల్లడించారు. దేశ స్వాతంత్య్రం తర్వాత ఇంత పెద్ద మొత్తంలో డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకోవడం ఇప్పుడేనని మంత్రి పేర్కొన్నారు. అయితే డ్రగ్స్‌ సరఫరాను అడ్డుకోవడానికి బ్లాక్‌ వెబ్‌, క్రిప్టో కరెన్సీ, డ్రోన్లు పెద్ద ప్రతిబంధకాలుగా మారాయని అమిత్‌ షా చెప్పారు. కానీ గుజరాత్‌లోని ముద్రా పోర్టు నుంచి వేలాది టన్నుల మేర డ్రగ్స్‌ ఇక్కడ నుంచి విదేశాలకు సరఫరా అవుతున్నా..విదేశాల నుంచి దాదాపు అంతే మొత్తంలో నార్కోటిక్స్‌ మత్తు పదార్థాలు భారత్‌కు దిగుమతి అవుతున్నా.. కేంద్ర, రాష్ట్రాల్లోని డబుల్‌ ఇంజిన్‌ బిజెపి ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కించాయే మినహా పోర్టుపై చర్యలు తీసుకున్నది లేదు. దీనికి ప్రధాన కారణం.. ముద్రా పోర్టు అనేది ప్రధాని మోడీ, అమిత్‌ షాకు అత్యంత సన్నిహితుడైన అదానీ గ్రూపు సంస్థల అధినేత గౌతమ్‌ అదానీకి చెందినది కావడమే. గతేడాది ఇదే పోర్టులో విదేశాల నుంచి వచ్చిన 3300 కిలోల నార్కోటిక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఆ కేసు అంతటితోనే అటకెక్కించారు.

24 లక్షల కిలోల డ్రగ్స్‌ స్వాధీనం

2004-2014 మధ్య కాలంలో కేవలం 3,63,000కిలోల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకోగా ప్రస్తుత దశాబ్ద కాలంలో పరిస్థితులు అనూహ్యంగా మారిపోయాయన్నారు. ఏకంగా 24లక్షల కిలోల మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నామని అమిత్‌ షా వెల్లడించారు. లా ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సంస్థలు డ్రగ్స్‌ రవాణాపై కఠినమైన పోరాటం చేస్తున్నాయని, అందువల్లే గతేడాది కాలంలో అన్ని రికార్డులను అధిగమించి డ్రగ్స్‌ను పట్టుకోగలిగామన్నారు. 2004-2014 దశాబ్దంలో రూ.8,150కోట్ల విలువైన డ్రగ్స్‌ను నిర్వీర్యం చేయగా, 2014-2024 మధ్య కాలంలో ఏకంగా రూ.56,851 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను లా ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సంస్థలు నిర్వీర్యం చేశాయన్నారు. ఇది, అంతకుముందు దశాబ్దంతో పోలిస్తే 8రెట్లు ఎక్కువన్నారు. ఉత్తర భారతంలోని పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన ముఖ్యమంత్రులు, గవర్నర్లు, లెఫ్టినెంట్‌ గవర్నర్లు, సీనియర్‌ అధికారులు ఇతర ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సంస్థల సీనియర్‌ అధికారులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. కేవలం డ్రగ్స్‌ మాత్రమే కాదని, వివిధ రాష్ట్రాల్లో తీవ్రవాద నెట్‌వర్క్‌లను కూడా భగ్నం చేశామన్నారు. జమ్మూ కాశ్మీర్‌, గుజరాత్‌, పంజాబ్‌, ఉత్తరప్రదేశ్‌ రాష్ట్రాల్లో ఈ మాదకద్రవ్యాల రవాణాతో ముడిపడి అనేక టెర్రర్‌ నెట్‌వర్క్‌లు పనిచేస్తున్నాయన్నారు. వాటిని కూడా పోలీసులు ఎండగట్టారని చెప్పారు. గత రెండేళ్ళుగా ప్రత్యేకంగా ఈ అంశంపై దృష్టి పెట్టామని చెప్పారు. ప్రాంతీయ సమావేశాలు నిర్వహించడం, డ్రగ్స్‌పై జరుగుతున్న పోరాటాన్ని సమీక్షించడమనేది రొటీన్‌గా సాగుతూ వస్తోందన్నారు. వీటన్నింటి ప్రాతిపదికగా హోం శాఖ కొత్త వ్యూహాన్ని రూపొందించి, రాష్ట్రాలతో కలిసి అమలు చేస్తోందన్నారు. జనవరి 11 నుండి 25 వరకు డ్రగ్‌ డిస్పోజల్‌ ఫోర్ట్‌నైట్‌ (మాదకద్రవ్యాల నిర్వీర్య పక్షోత్సవాలు)ను నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.8,600కోట్ల విలువైన లక్ష కిలోల డ్రగ్స్‌ను ఈ పక్షం రోజుల్లో నిర్వీర్యం చేయనున్నారు. 2047కల్లా మాదకద్రవ్యాల రహిత భారతదేశాన్ని రూపొందించడం లక్ష్యమని హోం మంత్రి పేర్కొన్నారు. ఇందుకోసం మూడంచెల వ్యూహాన్ని అమలు చేస్తున్నామన్నారు. సంస్థాగతమైన యంత్రాంగాలను బలోపేతం చేయడం, నార్కోటిక్స్‌ సంస్థల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడం, ప్రజల్లో పెద్ద ఎత్తున చైతన్యం తీసుకువచ్చే కార్యక్రమాలు చేపట్టడం ఈ వ్యూహంలో భాగంగా వున్నాయి. డ్రగ్స్‌ రవాణాను అరికట్టాలన్న ప్రభుత్వ ప్రయత్నాలకు డార్క్‌ వెబ్‌, క్రిప్టో కరెన్సీ, ఆన్‌లైన్‌ మార్కెట్‌, డ్రోన్లు వంటివి సవాళ్ళుగా మారుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. కఠిన చర్యలు ద్వారా వీటిని కూడా నియంత్రించాల్సి వుందన్నారు. రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం, సాంకేతిక నిపుణుల సమిష్టి కృషి ద్వారా ఈ సమస్యలకు ఒక సాంకేతిక పరిష్కారం కనుగొనాలన్నారు. దేశంలోకి ఒక్క కిలో డ్రగ్స్‌ కూడా రావడం కానీ బయటకు పోవడం కానీ జరగకూడదని ఆయన స్పష్టం చేశారు. అందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. డ్రగ్స్‌ రవాణాతో ముడిపడిన అనేక నెట్‌వర్క్‌లను నిర్మూలించడంలో విజయం సాధించామని చెప్పారు.

బిజినెస్‌

అమెరికాతో ప్రపంచంలో అనిశ్చితి

- ట్రంప్‌ పన్నులతో ప్రతికూలత
- భారత వృద్ధి బలహీనం
- ఐఎంఎఫ్‌ చీఫ్‌ క్రిస్టాలినా జార్జివా అంచనా

జెనీవా : అమెరికా వాణిజ్య విధానం వల్ల ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి నెలకొనే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్‌) మేనేజింగ్‌ డైరెక్టర్‌ క్రిస్టాలినా జార్జివా అన్నారు. అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్ట్‌ ట్రంప్‌ ప్రభుత్వ ప్రతిపాదిత సుంకాలు, పన్నుల పెంపు, నియంత్రణ నిబంధనలను అమల్లోకి వస్తే ఆర్థిక వ్యవస్థలపై ప్రతికూల ప్రభావం ఉంటుందన్నారు. శనివారం ఆమె ఓ రౌండ్‌ టేబుల్‌ సమావేశంలో మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా స్థిరంగా అభివృద్ధి కొనసాగుతున్నప్పటికీ 2024-25లో భారత వృద్ధిరేటు స్వల్పంగా బలహీన పడవచ్చునని అన్నారు. జిడిపి బలహీన పడటానికి కారణాలేమీ జార్జివా వివరించలేదు. దీనిపై మరిన్ని వివరాలను ప్రపంచ ఆర్థిక పరిస్థితిపై రాబోయే నివేదికలో పొందుపర్చుతామన్నారు. ప్రాంతీయంగా విభేదాలు ఉన్నా, గ్లోబల్‌ వృద్ధిరేటు నికరంగా ఉంటుదన్నారు. ఐఎంఎఫ్‌ వరల్డ్‌ ఎకానమీ ఔట్‌లుక్‌ ప్రకారం అమెరికా వద్ధిరేటు అంచనాలకన్నా మెరుగ్గా ఉంటుందని చెప్పారు. యూరోపియన్‌ యూనియన్‌ అభివృద్ధి నిలిచిపోవచ్చన్నారు. బ్రెజిల్‌ ఆర్థిక వ్యవస్థపై అధిక ద్రవ్యోల్బణం ప్రభావం చూపుతుందన్నారు. ప్రపంచంలోకెల్లా అతి పెద్ద రెండో ఆర్థిక వ్యవస్థ చైనాలో ప్రతికూల ద్రవ్యోల్బణం నెలకొందన్నారు. దేశీయంగా డిమాండ్లకు సవాళ్లు ఎదురవుతాయన్నారు. అన్ని రకాల చర్యలు తీసుకున్నా తక్కువ ఆదాయ దేశాల ఆర్థిక వ్యవస్థలపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. ట్రంప్‌ ప్రభుత్వం అమలు చేసే సుంకాలు, పన్నులు, నియంత్రణ నిబంధనలను అమల్లోకి తెస్తే మరింత ప్రతికూల ప్రభావం ఉంటుందన్నారు. చైనా, కెనడా, మెక్సికో వంటి దేశాలపై అదనపు సుంకాలను విధించే ప్రణాళికలను డొనాల్డ్‌ ట్రంప్‌ ఇప్పటికే ప్రకటించారు. జనవరి 20న ఆయన అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సుంకాలను పెంచాలనేది ఆయన ప్రధాన ఉద్దేశ్యంగా బహిరంగంగా ప్రకటించారు. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను మరింత పెంచుతుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ సరఫరా వ్యవస్థపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థలు అనిశ్చితికి గురవుతాయన్నారు.

ప్రస్తుత ఏడాది 2025లో భారత జిడిపి 6.6 శాతానికి మందగించే అవకాశాలున్నాయని ఇంతక్రితం రోజు ఐక్యరాజ్య సమితి పేర్కొన్న విషయం తెలిసిందే. 2024లో 6.9 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. వచ్చే 2026లోనూ 6.7 శాతానికే పరిమితం కావొచ్చని పేర్కొంది. ప్రపంచ వృద్ధి రేటులోనూ స్తబ్దత చోటు చేసుకోవచ్చని ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది. ప్రస్తుత ఏడాది 2025లో ప్రపంచ వృద్ధి రేటు 2.8 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. ఇప్పటికీ అనిశ్చితి పెద్ద ఎత్తున ఉందని తెలిపింది. ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో భౌగోళిక రాజకీయ సంఘర్షణలు, పెరుగుతున్న వాణిజ్య ఉద్రిక్తతలు, పెరిగిన రుణ వ్యయాల నుండి వచ్చే ప్రమాదాలు పొంచి ఉన్నాయని విశ్లేషించింది. ఈ సవాళ్లు ముఖ్యంగా తక్కువ ఆదాయం, దుర్బల దేశాలపై తీవ్ర ప్రతికూలతను చూపనున్నాయని విశ్లేషించింది. ఈ పరిణామాలు ప్రపంచ అభివృద్ధి పురోగతిని దెబ్బతీయనున్నాయని హెచ్చరించింది.

కాగ్నిజెంట్‌లో పదవీ విరమణ వయస్సు పెంపు

బెంగళూరు : దిగ్గజ టెక్‌ కంపెనీ కాగ్నిజెంట్‌ తన ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం పదవీ విరమణ వయసు 58గా ఉంది. దాన్ని 60కి చేర్చుతూ ఉద్యోగులకు సమాచారం ఇచ్చింది. ఇది భారత్‌లోని అన్ని కాగ్నిజెంట్‌ కార్యాలయాల్లో పనిచేసే సిబ్బందికి వర్తిస్తుందని వెల్లడించింది. అనుభవజ్ఞులైన నిపుణుల సేవలను సద్వినియోగం చేసుకొనేందుకు ఈ మార్పు చేపట్టినట్లు తెలుస్తోంది. దేశంలోని అనేక ఐటి కంపెనీలు ప్రస్తుతం తమ సంస్థలో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయసును 58 ఏళ్లుగా నిర్ణయించాయి. తాజాగా కాగ్నిజెంట్‌ ఈ వయసును 60కి పెంచడంతో మిగితా కంపెనీలు ఇదే బాటలో నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. కాగ్నిజెంట్‌కు భారత్‌లో 2.50 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారని కాగ్నిజెంట్‌ చీఫ్‌ ఎగ్జిక్యూటివ్‌ ఆఫీసర్‌ (సిఇఒ) రవి కుమార్‌ పేర్కొన్నారు. ఇంతక్రితం పెద్ద నగరాల్లోనే తమ కార్యాలయాలు ఉండేవని.. ఇప్పుడు చిన్న నగరాలకూ విస్తరించామన్నారు.

మీరే అసెట్‌ ఎంఎఫ్‌ నుంచి స్మాల్‌క్యాప్‌ ఫండ్‌

న్యూఢిల్లీ : మీరే అసెట్‌ మ్యూచువల్‌ ఫండ్‌ కొత్తగా మీరే అసెట్‌ స్మాల్‌ క్యాప్‌ ఫండ్‌ను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఈ ఒపెన్‌ ఎండెడ్‌ ఈక్విటీ స్కీమ్‌లోని నిధులను స్మాల్‌ క్యాప్‌, మిడ్‌క్యాప్‌ స్టాక్స్‌ల్లో పెట్టుబడిగా పెట్టనుంది. నిఫ్టీ స్మాల్‌ క్యాప్‌ 250 ఇండెక్స్‌పై ప్రధానంగా దృష్టి సారిస్తున్నట్లు.. దీనికి తమ ఈక్విటీ సీనియర్‌ ఫండ్‌ మేనేజర్‌ వరుణ్‌ గోయల్‌ నేతృత్వం వహించనున్నారని తెలిపింది. జనవరి 10న సబ్‌స్క్రిప్షన్‌కు తెరువబడిందని.. 24న మూసివేయబడుతుందని పేర్కొంది. తిరిగి ఫిబ్రవరి 3న క్రయ, విక్రయాల కోసం తెరుబడుతుందని తెలిపింది. కనీస పెట్టుబడిని రూ.5000గా నిర్ణయించింది.

ఆపిల్‌ సీఈవో వేతనం రూ.643 కోట్లకు పెంపు..!



శాన్‌ఫ్రాన్సిస్కో : ప్రముఖ టెక్‌ కంపెనీ ఆపిల్‌ చీఫ్‌ ఎగ్జిక్యూటివ్‌ ఆఫీసర్‌ (సిఇఒ) టిమ్‌ కుక్‌ వార్షిక వేతనం 18 శాతం పెరగ నుంది. దీంతో ఆర్థిక సంవత్సరం 2024-25గానూ టిమ్‌కు 74.6 మిలియ న్‌ డాలర్ల (దాదాపు రూ.643 కోట్లు) వేతనం చెల్లించ నుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 25న జరగబో యే కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశానికి ముందు ఆపిల్‌ ఈ నిర్ణయం తీసుకో నుందని రిపోర్టులు వస్తున్నాయి. ఈ సమావేశంలో కుక్‌ జీతంతో సహా పలు ప్రతిపా దనల్ని వాటాదారుల ముందుంచి ఆమోదించనున్నారని సమాచారం.

తలసేమియా రోగులకు రక్తదాన శిబిరం

- అగర్వాల్‌ సమాజ్‌ నిర్వహణ

నవ తెలంగాణ - హైదరాబాద్‌

తలసేమియాతో బాధపడుతున్న వ్యక్తులకు కీలకమైన సహాయాన్ని అందించడం కోస అగర్వాల్‌ సమాజ్‌ తెలంగాణ, హైదరాబాద్‌ కట్‌పీస్‌ క్లాత్‌ మర్చంట్‌ అసోసియేషన్‌, హోల్‌సేల్‌ ఆర్ట్‌ సిల్క్‌ క్లాత్‌ మర్చంట్‌ అసోసియేషన్‌లు రక్తదాన శిబిరాన్ని నిర్వహించాయి. తొలి రోజు ఘాసీ బజార్‌ మార్కెట్‌లోని సూరజ్‌ భవన్‌లో, రెండవ రోజు చార్‌కమాన్‌లోని అగర్వాల్‌ శిక్షా సమితి వద్ద రక్తదాన శిబిరం నిర్వహించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. ఈ శిబిరంలో 314 యూనిట్ల సేకరించిన రక్తాన్ని తలసేమియా మరియు సికిల్‌ సెల్‌ సొసైటీకి దానం చేయనున్నట్లు ఆ సంస్థల ప్రతినిధులు తెలిపారు. శిబిరంలో తలసేమియా మరియు సికిల్‌ సెల్‌ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్‌ చంద్రకాంత్‌ అగర్వాల్‌తో సహా, అగర్వాల్‌ సమాజ్‌ తెలంగాణ అధ్యక్షుడు మనీష్‌ అగర్వాల్‌, వైస్‌ ప్రెసిడెంట్‌ పురుషోత్తం అగర్వాల్‌, కోశాధికారి నవీన్‌ అగర్వాల్‌, గౌరవ కార్యదర్శి కపూర్‌ చంద్‌, హైదరాబాద్‌ కట్‌పీస్‌ క్లాత్‌ మర్చంట్స్‌ అసోసియేషన్‌ మరియు ఆర్ట్‌ సిల్క్‌ క్లాత్‌ మర్చంట్‌ అసోసియేషన్‌ కీలక ప్రతినిధులు పాల్గొన్నారు.

వచ్చే వారమూ మార్కెట్లలో అప్రమత్తత..!

ముంబయి : వచ్చే వారమూ మార్కెట్లలో ఒడిదుడుకులు ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. గడిచిన వారంలో ఐదు సెషన్లలోనూ మార్కెట్లు బలహీనంగా నమోదయ్యాయి. భారీ నష్టాలతో మదుపర్లు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అంతర్జాతీయంగా కొనసాగుతున్న బలహీన పరిణామాలకు తోడు భారత మార్కెట్ల నుంచి కొనసాగుతున్న విదేశీ సంస్థాగత పెట్టుబడులు తరలిపోవడంతో గత కొన్ని సెషన్లుగా సూచీలు నష్టాలు చవి చూస్తున్నాయి. మరోవైపు దేశ ఆర్థిక వ్యవస్థలో కొనసాగుతున్న బలహీనతలు మదుపర్లను విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. గత వారం చివరి మూడు సెషన్లలో భారీ నష్టాలతో మదుపర్లు రూ.12 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. చమురు ధరలు పెరగడం, డాలర్‌కు డిమాండ్‌ పెరగడం, రూపాయి పతనం మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. వరుస నష్టాల నేపథ్యంలో వచ్చే వారం మార్కెట్ల పట్ల రిటైల్‌ ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

మతోన్మాద కోణం లేదు, కేవలం రాజకీయాలే

- బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై హింసపై పోలీసుల నివేదిక



ఢాకా : గతేడాది ఆగస్టులో ప్రధాని షేక్‌హసీనా వైదొలగిన తర్వాత మొత్తంగా 1769 మతోన్మాద దాడులు చోటు చేసుకున్నాయని బంగ్లాదేశ్‌ హిందూ బుద్ధిస్ట్‌ యూనిటీ కౌన్సిల్‌ ఫిర్యాదు చేసింది. దానిపై విచారణ జరిపిన బంగ్లాదేశ్‌ పోలీసులు ఒక నివేదికను ప్రభుత్వానికి అందచేశారు. వీటిల్లో మెజారిటీ కేసుల్లో మతోన్మాదం కోణం లేదని, కేవలం రాజకీయ స్వభావంతో కూడినవేనని పేర్కొన్నారు. 1234 సంఘటనలు పూర్తిగా రాజకీయ కోణంతో కూడినవేనని, కేవలం 20 సంఘటనలు మాత్రమే మతోన్మాదంతో కూడినవని పోలీసుల నివేదిక పేర్కొంది. మరో 161 ఫిర్యాదులు తప్పుడివగా తేలిందని నివేదిక తెలిపింది. హింసకు లక్ష్యాలుగా మారిన వారితో పోలీసులు మాట్లాడారని, కౌన్సిల్‌ తన నివేదికలో ప్రస్తావించిన ప్రతి ప్రదేశం, వ్యక్తి, సంస్థలను పోలీసులు సందర్శించారని, పోలీసులకు ఫిర్యాదులు చేయాల్సిందిగా అందరినీ కోరినట్లు చెప్పారు. అటువంటి వారందరికీ తగు భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు పోలీసులు తమ నివేదికలో పేర్కొన్నారు. దర్యాప్తులో వెల్లడైన నిర్ధారణలకు అనుగుణంగా తగు చర్యలు తీసుకున్నామని తెలిపారు.

మెజారిటీ కేసుల్లో దాడుల వెనుక ఎలాంటి మతోన్మాద కుట్ర కోణాలు లేవని, కేవలం రాజకీయ స్వభావంతో కూడినవేనని పోలీసులు తేల్చారు. మొత్తంగా 35మందిని అరెస్టు చేశారు. 1769 ఆరోపణలు రాగా ఫిర్యాదులను బట్టి పోలీసులు 62కేసులు నమోదు చేశారు. బంగ్లాదేశ్‌లో మతోన్మాద హింస చెలరేగితే సహించేది లేదని ప్రొఫెసర్‌ మహ్మద్‌ యూనస్‌ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం శనివారం స్పష్టం చేసింది. హసీనా ప్రభుత్వం కూలిపోయిన నేపథ్యంలో పోలీసు పాలనా వ్యవస్థ కూడా కుప్పకూలింది. దీంతో హిందూ బౌద్ధిస్ట్‌ యూనిటీ కౌన్సిల్‌ చొరవ తీసుకుని తమ దృష్టికి వచ్చిన సంఘటనలను, ఆరోపణలను నమోదు చేసింది.

బెయిలు కోసం లాహోర్‌ హైకోర్టుకు ఇమ్రాన్‌

ఇస్లామాబాద్‌: పాకిస్తాన్‌ తెహ్రీక్‌ ఎ ఇన్సాఫ్‌ (పిటిఐ) వ్యవస్థాపకుడు, మాజీ ప్రధాని ఇమ్రాన్‌ ఖాన్‌ బెయిలు కోసం శనివారం లాహోర్‌ హైకోర్టునాశ్రయించారు. మే9 నాటి హింసకు సంబంధించి తనపై అనేక కేసులు పెట్టి గత రెండేళ్లుగా జైలులోనే నిర్బంధించారని, ఇది రాజకీయ కక్ష సాధింపు తప మరొకటి కాదని ఆయన తన బెయిలు దరఖాస్తులో పేర్కొన్నారు. ఆ రోజు (మే9) హింసతో తనకెలాంటి సంబంధమూ లేదని ఇమ్రాన్‌ స్పష్టం చేశారు. తప్పుడు కేసులు బనాయించి అన్యాయంగా తనను జైలులో పెట్టారని, తనకు అరెస్టు అనంతర బెయిలు మంజూరు చేయాలని ఇమ్రాన్‌ కోరారు. ఆయన బెయిలు పిటిషన్‌ను యాంటీ టెర్రరిజం కోర్టు (ఎటిసి) తిరస్కరించడంతో ఇమ్రాన్‌ లాహోర్‌ హైకోర్టునాశ్రయించారు. ఇమ్రాన్‌ ఖాన్‌ను విడుదల జేయాలని కోరుతూ ఇటీవల పాకిస్తాన్‌లో ప్రదర్శనలు వెల్లువెత్తాయి. సైన్యం , ప్రభుత్వం కూడబలుక్కుని ఇమ్రాన్‌ ఖాన్‌ను వేధిస్తున్నాయని పిటిఐ మద్దతుదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను దేశం వీడి వెళ్లిపోతానంటే అవకాశమిస్తామని సైన్యం ఆఫర్‌ ఇవ్వగా, దానిని తిరస్కరించానని ఇమ్రాన్‌ఖాన్‌ ఇటీవల జైలు నుంచి ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

తిరుపతి ఘటనలో రూ.కోటి పరిహారం ఇవ్వాలి

- మోడీ సేవలో రాష్ట్ర ప్రభుత్వం : వి శ్రీనివాసరావు
- సీపీఎం రాష్ట్ర మహాసభ పోస్టర్‌ ఆవిష్కరణ



నెల్లూరు : తిరుపతి ఘటనలో మృతి చెందినవారి కుటుంబాలకు ప్రభుత్వం కోటి రూపాయలు పరిహారం అందించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు డిమాండ్‌ చేశారు. వచ్చే నెల 1, 2, 3 తేదీల్లో నెల్లూరులో జరగనున్న సిపిఎం రాష్ట్ర 27వ మహాసభ వాల్‌పోస్టర్‌ను నెల్లూరులోని డాక్టర్‌ రామచంద్రారెడ్డి భవన్‌లో శనివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖలో ప్రధాని పర్యటనకు పోలీసు భద్రత కల్పించడంలో బిజీబిజీగా గడిపారన్నారు. తిరుపతి వెంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన యాత్రికుల భద్రతను గాలికొదిలేసి విశాఖలో మోడీ స్వామికి సేవలు చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం పరుగులు తీసిందన్నారు. తిరుపతిలో యాత్రికుల తొక్కిసలాట జరిగి ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం, మరో 40 మంది అస్వస్థతకు గురవ్వడం ప్రభుత్వ అసమర్థత, చేతకానితనం వల్లనే జరిగిందన్నారు. ఒక రోజు ముందుగానే యాత్రికులందరినీ ఒకే చోటుకు చేర్చి, రాత్రి వరకూ నిలబెట్టి తొక్కిసలాటకు ప్రభుత్వం పరోక్షంగా కారణమైందని పేర్కొన్నారు. రోప్‌ పార్టీ లేదని, యాత్రికులను కట్టడి చేయడంలో పోలీసులు విఫలమయ్యారని, ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటూ గడిపేస్తున్నారని విమర్శించారు. ప్రజలు ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో వారిని మభ్యపెట్టేందుకు ఒకరికొకరు క్షమించాలంటూ పోటీలుపడి ప్రాధేయపడుతున్నారన్నారు.

క్షమాపణలు చెప్పినంత మాత్రాన మరణించిన వారి కుటుంబ సభ్యులను ఓదార్చగలరా? అని ప్రశ్నించారు. కేవలం పాతిక లక్షల రూపాయలు ఒక్కొక్క మృతుడి కుటుంబానికి అందజేస్తే సరిపోదన్నారు. కోటి రూపాయల చొప్పున ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. ఇటువంటి ఘటనల నివారించేందుకు టిటిడి బోర్డు చైర్మన్‌, సభ్యులు ఏమి చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. వేరే ప్రార్థనా మందిరాల వద్ద ఇటువంటి ఘటనలు చోటు చేసుకొని ఉంటే బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌ వారు పెద్ద ఎత్తున ఆందోళనలు చేసేవారని, తిరుపతిలో జరిగిన ఘటనపై ఆర్‌ఎస్‌ఎస్‌, బిజెపి, విశ్వహిందూ పరిషత్‌ వారు ఒక్కమాట కూడా మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. మృతి చెందిన వారు, గాయపడిన వారు హిందువులు కాదా? ఈ ప్రభుత్వాలకు ఏ మాత్రమూ బాధ్యత లేదా? అని ప్రశ్నించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా దర్శనానికి యాత్రికులు తిరుపతికి రావాలని పిలుపునిచ్చి వచ్చిన వారికి భద్రత కల్పించకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనని తెలిపారు. గతంలో ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్న సమయంలో ఆయా శాఖల మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వానికి ఆ మాత్రం నైతిక విలువలు లేవా? అని ప్రశ్నించారు. సంక్రాంతికి ప్రజలు సంతోషంగా లేరని తెలిపారు. ఏటా ప్రభుత్వాలు ప్రజలకు పండగల సందర్భంగా ఇచ్చే కానుకలు ఈ ఏడాది అందజేయకపోవడం శోచనీయమన్నారు.

పింఛన్లపై వేటు

ఆరు నెలల్లో 1.60 లక్షల కోత



అమరావతి : రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక పింఛన్లపై ప్రభుత్వం వేటువేస్తోంది. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సామాజిక పింఛన్లను పెంచిన సంగతి తెలిసిందే. అయితే, కుడి చేత్తో పెంచి ఎడమ చేత్తో ప్రభుత్వం కోత పెడుతోందన్న ఆరోపణలు వస్తున్నాయి. అనర్హుల ఏరివేత పేరిట ఈ ప్రక్రియ సాగుతోందన్నది ప్రధాన విమర్శ. తాజాగా 'న్యూస్‌ మినిట్‌' వెబ్‌సైట్‌ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత ఆరు నెలల కాలంలో 1.60 లక్షల పింఛన్లపై వేటు పడినట్లు ఒక కథనాన్ని ప్రచురించింది. దేశ వ్యాప్తంగా ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును (పబ్లిక్‌ సర్వీసెస్‌ డెలివరీ విధానం)ను అధ్యయనం చేసే 'లిబ్‌టెక్‌ ఇండియా' విడుదల చేసిన గణాంకాల ఆధారంగా ఈ నిర్ధారణకు వచ్చినట్లు ఆ సంస్థ పేర్కొంది. ఇంజినీర్లు, సామాజిక కార్యకర్తలు కలిసి పింఛన్ల డాటాను క్రమం తప్పకుండా ట్రాక్‌ చేయడం ద్వారా ఈ గణాంకాలను రూపొందించారని తెలిపింది. ఈ కథనం ప్రకారం 2024 జూన్‌ నెలలో రాష్ట్రంలో 65.5 లక్షల సామాజిక పింఛన్లు పంపిణీ అవుతుండగా, డిసెంబర్‌ నెలాఖరుకు ఆ సంఖ్య 63,92,702కు తగ్గింది. అంటే దాదాపుగా 1.60 లక్షల మేరకు పింఛన్లపై కోత పడింది. ఆరు నెలల కాలంలోనే ఈ స్థాయిలో కోత పెట్టడం అనూహ్యమన్న వ్యాఖ్యలు వినపడుతున్నాయి. అయితే, పింఛన్ల కోత ఒక క్రమ పద్ధతి ప్రకారం జరుగుతోందని, ప్రతి నెలా లబ్ధిదారుల సంఖ్యలో తగ్గుదల ఉంటోందని 'లిబ్‌టెక్‌ ఇండియా' పేర్కొంది. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన పింఛన్లపై టిడిపి కూటమి నాయకులు మొదటి నుండి అనుమానాలు వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. దానిలో భాగంగానే డిసెంబరు 9, 10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా జిల్లాకు ఒక సచివాలయాన్ని పైలెట్‌ ప్రాజెక్టుగా ఎంపిక చేసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఈ సర్వేలో 10,958 మంది పింఛన్‌దారులను పరిశీలిస్తే ఐదు శాతం మందిని అనర్హులుగా సర్వే టీమ్‌లు గుర్తించాయి. దీనినే పేర్కొంటూ రాష్ట్రం మొత్తం మీద 3.2లక్షల మంది అనర్హులు పింఛన్‌ పొందుతున్నారని ప్రభుత్వ వర్గాలు కొద్దిరోజుల క్రితం అంచనా వేశాయి. వీటి కారణంగా ప్రతి నెలా రూ.120 కోట్ల భారం ప్రభుత్వంపై పడుతున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో పింఛన్ల సంఖ్య తగ్గుతుండటం గమనార్హం.

ఉక్కులో వీఆర్‌ఎస్‌

- యాజమాన్యం ప్రకటన
- కార్మికుల ఆగ్రహం

ఉక్కునగరం : విశాఖ ఉక్కుపై కుట్రలు కొనసాగుతూనే ఉన్నాయి. ఖాళీలను భర్తీ చేయకుండా ఉన్నవారిని కూడా ఇంటికి పంపించే కుట్రలకు స్టీల్‌ప్లాంట్‌ యాజమాన్యం దిగింది. ప్లాంట్‌లో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ (విఆర్‌ఎస్‌) స్కీంను ప్రకటిస్తూ శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. 1.1.2026 తర్వాత ఉద్యోగంలో ఉన్నవారికి ఇది వర్తించనున్నట్టు తెలిపింది. ఈలోగా రిటైర్‌ అయ్యేవారికి ఇది వర్తించదని, అర్హత కలిగిన ఉద్యోగుల నుంచి ఈ విఆర్‌ఎస్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు స్టీల్‌ మేనేజ్‌మెంట్‌ పేర్కొంది. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో మాత్రమే అంగీకరిస్తామని తెలిపింది. జనవరి 15 నుంచి 31వ తేదీ వరకు ఈ ప్రక్రియకు గడువు విధించింది.

ప్రైవేటీకరణలో భాగమే

ఉక్కు ప్రయివేటీకరణలో భాగంగానే విఆర్‌ఎస్‌ ప్రకటన చేశారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. వలంటరీ రిటైర్మెంట్‌ స్కీమ్‌ను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్‌ చేసింది. ఉద్యోగులు ఎవరూ విఆర్‌ఎస్‌ తీసుకోవద్దని విజ్ఞప్తి చేసింది. ఉక్కునగరంలోని స్టీల్‌ సిఐటియు కార్యాలయంలో సంఘం గౌరవ అధ్యక్షులు అయోధ్యరాం అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ.. విఆర్‌ఎస్‌ పేరుతో ఉద్యోగులను బయటకు పంపించేందుకు కుట్ర జరుగుతోందన్నారు. జీతాలు చెల్లించేందుకే డబ్బులు లేవు అన్న ప్రభుత్వం విఆర్‌ఎస్‌కు డబ్బులు ఎక్కడి నుంచి తెస్తుందని, ఇది బూటకమని అంతా గ్రహించాలని అన్నారు. పార్లమెంటు సాక్షిగా ఉక్కు మంత్రి ఐదు వేల ఉద్యోగాలు ఖాళీ ఉన్నాయని 2023లో ప్రకటించారని, ఆ తర్వాత కాలంలో సుమారు 2000 మంది కార్మికులు ఉద్యోగ విరమణ చేశారని తెలిపారు. సుమారు 7000 ఉద్యోగాలు ఖాళీ ఉన్న సమయంలో ఈ విఆర్‌ఎస్‌ ప్రకటన అత్యంత దుర్మార్గమని అన్నారు. ఇదే సమయంలో 4000 మంది కాంట్రాక్ట్‌ కార్మికులను తొలగిస్తానని పేర్కొంటూ యాజమాన్యం చర్యలు చేపడుతున్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ విధంగా ఉద్యోగుల సంఖ్యను తగ్గించి ఉత్పత్తి జరగటం లేదని చెప్పి దీనిని మిట్టల్‌, అదానీ, జిందాల్‌, పోస్కో వంటి వారికి కట్టబెట్టడానికి చూస్తున్నారన్నారు. సమావేశంలో పోరాట కమిటీ ప్రతినిధులు డి.ఆదినారాయణ, కెఎస్‌ఎన్‌.రావు, యు.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుపతికి సీఎం



రేణిగుంట : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదివారం తిరుపతికి రానున్నారు. తిరుచానూరు సమీపంలో ఎజిఅండ్‌పి సంస్థ వారు వినియోగదారులకు ఏర్పాటు చేసిన పిఎన్‌జి గృహ గ్యాస్‌ కనెక్షన్లను ప్రారంభించే కార్యక్రమంలోనూ, తాజ్‌ హోటల్లో సిఎన్‌జి ఆటో, ఎల్‌సివి వాహనాలకు జెండా ఊపి ప్రారంభించనున్నారు. సిఎం పర్యటన ఏర్పాట్లపై శనివారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయంలో అధికారులతో ఇన్‌ఛార్జి జిల్లా ఎస్‌పి మణికంఠ చందులు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు సిఎం రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అక్కడినుంచి రోడ్డు మార్గాన తిరుచానూరుకు వెళ్తారు. సాయంత్రం 4.25 గంటలకు తాజ్‌ హోటల్‌ చేరుకుని సిఎన్‌జి ఆటో, ఎల్‌సివి వాహనాలను ప్రారంభించనున్నారు. సాయంత్రం 5.55 గంటలకు నారావారిపల్లికి వెళ్లనున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు రవి మనోహర్‌ ఆచారి, వెంకటరావు, శ్రీనివాసరావు, ఆర్‌డిఒ కిరణ్మయి పాల్గొన్నారు.

సామ్‌సంగ్‌ ఎసిల్లో 'గుడ్‌ స్లీప్‌' టెక్నాలజీ

గుర్‌గావ్‌ : సామ్‌సంగ్‌ కొత్తగా విండ్‌ఫ్రీ ఎసిలను ఆవిష్కరించినట్లు తెలిపింది. వీటిల్లో నిద్ర దశల ప్రకారం ఉష్ణోగ్రతను సర్దుబాటు చేయడం ద్వారా రాత్రంతా ఆహ్లాదకరమైన నిద్రను పొందవచ్చని పేర్కొంది. ఇందుకోసం సామ్‌సం గ్‌ 'గుడ్‌ స్లీప్‌' మోడ్‌ను ప్రవేశపెట్టినట్లు వెల్లడించింది. వినియోగదారులు తమ ఎయిర్‌ కండిషనర్‌లను వారి గెలాక్సీ వాచ్‌ సిరీస్‌తో కనెక్ట్‌ చేయడానికి, వారు నిద్ర లోకి జారుకున్నప్పుడు 'గుడ్‌ స్లీప్‌' ఆటోమెటిక్‌గా పనిచేయటానికి వీలు కల్పిస్తుం దని తెలిపింది. వినియోగదారులు ఎంపిక చేసిన సామ్‌సంగ్‌ విండ్‌ఫ్రీ ఎయిర్‌ కండిషనర్‌లను కొనుగోలు చేయడంపై 42 శాతం వరకు తగ్గింపు పొందవచ్చని పేర్కొంది.

రూపాయి పతనంపై మౌనం వీడండి : ప్రియాంక గాంధీ

న్యూఢిల్లీ : అమెరికా డాలరుతో రూపాయి మారకం విలువ భారీగా తగ్గిపోవడంపై కాంగ్రెస్‌ ఎంపి ప్రియాంక గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. రూపాయి పతనంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్‌ చేశారు. శుక్రవారం రూపాయి విలువ ఒక్కసారిగా 16 పైసలు క్షీణించి చరిత్రలోనే తొలిసారిగా 86.04కి చేరుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో 'ఎక్స్‌' వేదికగా ప్రియాంక గాంధీ విమర్శలు గుప్పించారు. మాజీ ప్రధాని మన్మోహన్‌ సింగ్‌ హయాంలో డాలరుతో రూపాయి మారకం విలువ 58-59 గా ఉండేదని, అప్పట్లో నరేంద్ర మోడీ రూపాయి విలువను ప్రభుత్వ ప్రతిష్ఠతో ముడిపెట్టేవారని ఆమె గుర్తు చేశారు. మరి ఇప్పుడేమైందని ఆమె నిలదీశారు.